అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 11-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక

హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ కూటమి జయకేతనం



అన్ని పోస్టులూ మరోసారి క్లీన్‌స్వీప్
- అధ్యక్షునిగా అతీక్ అహ్మద్ ఘనవిజయం
- మతోన్మాద ఏబీవీపీకి పరాభవం వివరాలు 2లో..

సంపుటి : 9 సంచిక : 311 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 16 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50



నిప్పుతో ఆటలొద్దు

బిల్లుల విషయంలో ఆలస్యం చేయొద్దు

- గవర్నర్ల తీరు ఆందోళనకరం
- సుప్రీం ధర్మాసనం ఆగ్రహం
- కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు
- విచారణ 20కి వాయిదా

న్యూఢిల్లీ : నిప్పుతో ఆటలాడొద్దని గవర్నర్లను అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. తమిళనాడు, పంజాబ్ గవర్నర్లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీలో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరును సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. బిల్లులను ఆమోదించడంలో గవర్నర్లు చేస్తున్న జాప్యంపై పంజాబ్, తమిళనాడు ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రజలెన్నుకున్న నేతల ద్వారా అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లుల విషయంలో ఆలస్యం చేయొద్దని ఇరు రాష్ట్రాల గవర్నర్లను హెచ్చరించింది. బిల్లులపై గవర్నర్ల తీరు తీవ్రమైన ఆందోళన కలిగించే విషయమని ధర్మాసనం పేర్కొంది. పెండింగ్ బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. "మీరు నిప్పుతో ఆడుకుంటున్నారు. సమావేశాలు సక్రమంగా జరగలేదన్న కారణంతో అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు చెల్లవని గవర్నర్ ఎలా చెబుతారు. పంజాబ్‌లో గవర్నర్, ప్రభుత్వం మధ్య జరుగుతున్న పరిణామాలపై మేం సంతృప్తికరంగా లేం. ఇలాంటి చర్యలతో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కొనసాగిస్తామా? ఇది చాలా తీవ్రమైన విషయం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. దేశం స్థిరపడిన సంప్రదాయాలపై నడుస్తున్నదనీ, వాటిని అనుసరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

తమిళనాడు రాష్ట్ర శాసనసభ ఆమోదించిన 12 బిల్లులకు ఆమోదం తెలిపేందుకు నిరాకరించిన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. తమిళనాడు రాష్ట్రం లేవనెత్తిన అంశాలు చాలా ...15లో

కేసీఆర్ ఇంటికే..

పదేండ్ల పాలనలో బీఆర్ఎస్‌ది అవినీతే

- బీజేపీ చేసిన లక్షల కోట్ల అప్పుతో దేశం దివాళా
- బీసీ డిక్లరేషన్‌లో కర్నాటక సీఎం సిద్దరామయ్య
- కామారెడ్డి భూములపై కేసీఆర్ కన్ను : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి
- కామారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్





నవతెలంగాణ-కామారెడ్డి

కాళేశ్వరం పేరుతో సీఎం కేసీఆర్ సంపాదించిన అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో ఓట్లు కొంటున్నారని కర్నాటక సీఎం సిద్ధరామయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ తరఫున సీఎం కేసీఆర్, కాంగ్రెస్ తరఫున రేవంత్‌రెడ్డి రెండు చోట్ల పోటీ చేస్తున్నారని, రెండు చోట్ల రేవంత్ విజయం సాధిస్తారని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని, కేసీఆర్‌ను ఇంటికి పంపించడానికి ప్రజలు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కామారెడ్డిలో శుక్రవారం రేవంత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో కర్నాటక సీఎం సిద్ధ రామయ్య హాజరై ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం ...6లో

బీసీ డిక్లరేషన్ ముఖ్యాంశాలు

- జనాభా, కులగణన ఆధారంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో వెనుకబడిన బీసీలకు బీసీ డిక్లరేషన్ అమలు
- ఐదేండ్లలో బీసీల అభివృద్ధి కోసం లక్ష కోట్లు కేటాయింపు
- వెనుకబడిన తరగతుల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీలకు రిజర్వేషన్ల పెంపు
- లోకల్ బాడీస్‌లో ఇప్పటివరకు 23 శాతం ఉన్న రిజర్వేషన్లు 42 శాతానికి పెంపు,
- ప్రభుత్వ ఉద్యోగాలు, పథకాల్లో 32 శాతం రిజర్వేషన్ కల్పన
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగా బీసీలకు మహాత్మా జ్యోతిబాఫూలే సబ్ ప్లాన్ ఏర్పాటు, ప్రతి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయింపు
- చేతివృత్తుల వారు అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి రూ.10 లక్షల లోన్, జిల్లా కేంద్రాల్లో వృత్తిబజార్ల పేరుతో 50 దుకాణాల సముదాయాలు ఏర్పాటు
- ప్రతి జిల్లాలో రూ.50 కోట్లతో ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో బీసీ ఐక్యవేదిక భవనాల నిర్మాణాలు
- ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో బీసీ గురుకులాలు
- కుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ప్రతి సంఘానికి రూ.10 లక్షలు అందజేత
- బీసీ కార్మికులకు 50 ఏండ్లకే వృద్ధాప్య పెన్షన్
- కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 1902, 2009 జీవోలని అమలు చేస్తూ బీసీ (డీ)లో ఉన్న ముదిరాజులను బీసీ-ఏ లోకి మార్పు
- మత్స్య కార్మికులకు తెలంగాణ ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ తరఫున చేపలు పెంచుకోవడానికి యూనిట్లకు 90 శాతం ఉచిత నిధులు

కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులు కుంగిపోతున్నాయి



- బీఆర్ఎస్ మునిగిపోయే నావ
- డిసెంబర్ 9న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం: కోదాడ కార్నర్ మీటింగ్‌లో కర్నాటక ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్

వివరాలు 15లో

రంగన్న వెంటే

ఎరుపెక్కిన మిర్యాలగూడ... కదంతొక్కిన పార్టీ శ్రేణులు...

- అడగడుగునా పూల వర్షం
- అశేష జనవాహినితో నామినేషన్ దాఖలు
- కమ్యునిస్టులను శాసనసభకు పంపాలి : సీపీఐ(ఎం) ఏపీ మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ పి మధు
- పోరాడే నాయకుడు రంగన్న : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- ఇది ధనబలం, జనబలం మధ్య పోరాటం : రంగన్న



నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడలో ఎర్రదండు కదిలింది. నియోజకవర్గ వ్యాప్తంగా స్వచ్ఛందంగా వేలాది మంది తరలివచ్చి నినాదాలు చేస్తూ పురవీధుల్లో కదంతొక్కారు. సీపీఐ(ఎం) అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి నామినేషన్ సందర్భంగా శుక్రవారం భారీ ర్యాలీ జరుగుతున్న సమయంలో కార్మికులు, హమాలీలు, పూలు, పండ్ల వ్యాపారులు పూలమాలలతో ఎదురెళ్లి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపించారు. జనాలతో ఇరువైపుల రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఐ(ఎం) ఏపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ పి. మధు మాట్లాడారు. దేశాన్ని దోచుకుతింటున్న మోడీకి వ్యతిరేకంగా, మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ...15లో



దేశ వినాశకశక్తి బీజేపీ

పొత్తుల విచ్ఛిన్నానికి బీఆర్ఎస్, కాంగ్రెస్‌దే బాధ్యత

- ఎర్రజెండాపై విశ్వాసంతో ముందుకెళ్దాం : సీపీఐ (ఎం) వైరా, మధిర నియోజకవర్గాల అభ్యర్థులు భూక్యా వీరభద్రం, పాలడుగు భాస్కర్ నామినేషన్ల సందర్భంగా బహిరంగ సభల్లో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వివరాలు 2లో

ఆకలి కేకలు ఒప్పుకున్న మోడీ

అందుకే 5 ఏండ్లు ఉచిత రేషన్ హామీ

- పెరిగిన నిరుద్యోగం
- అట్టడుగున ఆర్థికాభివృద్ధి
- అయినా ఓటర్లపై 'గ్యారంటీ'ల వర్షం

న్యూఢిల్లీ : దేశంలోని 80 కోట్ల మంది పేదలకు మరో ఐదు సంవత్సరాల పాటు ఉచితంగా ఆహార ధాన్యాలు సరఫరా చేస్తామని ప్రధాని మోడీ ఛత్తీస్‌గఢ్‌లో ప్రకటించారు. ఇది మోడీ ఇస్తున్న గ్యారంటీ అంటూ గొప్పలు పోయారు. భారత్‌ను ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేస్తానని మోడీ మరో గ్యారంటీ ఇచ్చారు. అయితే ఇక్కడ మోడీ ఓ విషయాన్ని దాస్తున్నారు. అదేమంటే దేశం ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తూ, 2028 నాటికి మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన పక్షంలో 80 కోట్ల మందికి ఉచితంగా ఆహారాన్ని అందించాల్సిన అవసరం ఏముందన్నది మాత్రం ఆయన చెప్పడం లేదు. దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ అమృతకాలంలో ప్రవేశిస్తుంటే మరో ఐదు సంవత్సరాల పాటు ఉచిత రేషన్ ఇవ్వాల్సిన అవసరం ఏముందన్నదే ఇక్కడ ప్రశ్న.

దాంబికాల ప్రచారం

శాసనసభ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ప్రచారం హోరెత్తుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ హామీలు గుప్పిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానిగా మోడీ పాలన సుమారు పది సంవత్సరాల పాటు కొనసాగింది. అభివృద్ధి, ఉపాధి, పొదుపు రేటు, ప్రైవేటు పెట్టుబడులు, విదేశీ పెట్టుబడులు, ఎగుమతులు వంటి విషయాలలో మంచి ఫలితాలు రాబట్టడానికి ఈ పది సంవత్సరాల సమయం చాలా ఎక్కువే. అయితే ఈ అంశాల్లో వాస్తవ ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. ప్రభుత్వ పనితీరు పేలవంగా ఉంది. అయినప్పటికీ మోడీ, ఆయన అనుచర గణం మాత్రం మీడియాలోనూ, ఇతర సామాజిక మాధ్యమాలలోనూ దేశం ఆశ్చర్యకరమైన పురోభివృద్ధి సాధించిందని డాంబికాలు పలుకుతున్నారు. ఎన్నికల సమయంలో ఈ ప్రచారం మరింత ...15లో



భారత్ వేగంగా అభివృద్ధి చెందుతూ ఉంటే దాని స్థానం ప్రపంచ ఆకలి సూచికలో ఎందుకు పడిపోతోంది? 2023వ సంవత్సరపు ప్రపంచ ఆకలి సూచికలో మన దేశం నాలుగు స్థానాలు దిగజారి మొత్తం 125 దేశాల్లో 111వ స్థానంలో నిలిచింది. ఈ సూచికను మోడీ ప్రభుత్వం తోసిపుచ్చింది. అయితే మరో విధంగా దానిని అంగీకరించింది. అందుకే ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ యోజన పథకం కింద ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగించింది. వాస్తవ చిత్రం ఇలా ఉంటే దేశం అమృతకాలపు స్వర్ణ యుగంలో ప్రవేశించిందని మోడీ చెబుతున్నారు. మరి ఇలాంటి సమయంలో 80 కోట్ల మంది ప్రజలు ఆహార ధాన్యాలు ఎందుకు కొనలేకపోతున్నారన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పగలరా?

బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు

ఈటల, రేవంత్, రాజాసింగ్ ఓటమి ఖాయం

- కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్‌లో కుట్ర : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే ఎన్నికల్లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డితో సహా, బీజేపీ అభ్యర్థులు ఈటల రాజేందర్, రాజాసింగ్ లు ఓడిపోవడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై ఆటలాడుతున్నాయని విమర్శించారు. బీజేపీ ముఖ్య నేతల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టిందని ఆరోపించారు. రేవంత్ టికెట్లు అమ్ముకున్నారని ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారని చెప్పారు. ఆయన ఎంత ఎక్కువగా మాట్లాడితే బీఆర్ఎస్‌కు అంత లాభమని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన మైనార్టీ డిక్లరేషన్‌లో కుట్ర ఉందనీ, బీసీ, మైనార్టీల మధ్య పంచాయతీ పెట్టేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు.

మైనార్టీల విషయంలో కాంగ్రెస్, బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆలోచనలు ఒకే రకంగా ఉన్నాయని ఆయన దుయ్యబట్టారు. మైనార్టీల కులగణన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. వారిని బీసీల్లో చేరిస్తే మైనార్టీలకు అందించే సంక్షేమం ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మైనార్టీ మంత్రిత్వశాఖ, కార్పొరేషన్, ప్రత్యేక హోదా కోల్పోతారని తెలిపారు. 2004 నుంచి 2014 వరకు పదేళ అధికారంలో ఉన్న కాంగ్రెస్ వారి కోసం ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. ఆ కాలంలో వారి సంక్షేమానికి హస్తం పార్టీ రూ.930 కోట్లు కేటాయిస్తే, గత పదేండ్లలో బీఆర్ఎస్ రూ.10 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. జనాభా గణన చేయాలంటే బీసీల లెక్కలు ముందు తేల్చాలనీ, బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వారి విషయంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

అత్యధికంగా గజ్వేల్‌లోనే...

- బరిలో అన్ని పార్టీల అధినేతలు
- ఇజ్జత్ పోద్దని పోటీ చేయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
- రాత్రి 7 గంటల తర్వాతా నామినేషన్ల స్వీకరణ
- 426 కేసులు నమోదు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. పలుచోట్ల పార్టీ కార్యకర్తల మధ్య కొట్లాటలు, పోలీసుల లాఠీచార్జీలతో ఉద్రిక్తతలు నెలకొన్నా, మొత్తానికి ప్రశాంతంగా తొలి దశ ఘట్టం పూర్తయ్యింది. ఈనెల 13వ తేదీ వరకు నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 15వ తేదీలోపు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. 30వ తేదీ పోలింగ్, డిసెంబర్ 3వ తేదీ ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి జరుగుతుంది. గురువారంనాటికి 119 నియోజకవర్గాల్లో 1,133 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల దాఖలుకు చివరి గడువు కావడంతో అన్ని నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. మధ్యాహ్నం 3 గంటల లోపు ...6లో

దళిత ఇంజినీర్‌పై దాడి చేసిన వ్యక్తికి

టికెట్ ఎలా కేటాయిస్తారు?

రాజస్థాన్‌లో దళిత సంఘాల ఆగ్రహం

- ప్రధానికి, బీజేపీకి బహిరంగ లేఖ



(ఫైల్)

జైపూర్: రాజస్థాన్‌లో బీజేపీ తీరు అక్కడి దళితులను ఆగ్రహానికి గురిచేసింది. ధోల్‌పూర్‌లోని బారీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టిక్కెట్ నిరాకరించడంతో గిర్‌రాజ్ సింగ్ మలింగను బీజేపీ అక్కున చేర్చుకున్నది. ఆయనకు టికెట్ కేటాయించింది. ఇది ఇప్పుడు అక్కడి దళిత సంఘాలలో ఆగ్రహానికి కారణమైంది.

దళిత ఇంజినీర్‌పై దాడి

2022, మార్చి 28న రాజస్థాన్ పవర్ బోర్డ్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తున్న హర్షాధిపతి (28)పై వాల్మీకిపై మలింగ దాడికి పాల్పడ్డాడు. ఒక గ్రామానికి విద్యుత్ ...15లో

ఏపీలో యాప్‌తో కుల గణన

- 27 నుండి ప్రారంభం
- చేసేది సచివాలయ సిబ్బందే!
- చట్టబద్ధత ఊసు లేకుండా సర్క్యులర్ జారీ
- యాంకర్లతో సదస్సులు



అమరావతి : డిజిటల్ విధానంలో, మొబైల్ యాప్ ద్వారా కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బిసి సంక్షేమశాఖ తాజాగా జారీ చేసిన సర్క్యులర్‌లో ఈ విషయాన్ని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27వ తేది నుండే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్దేశించింది. దానికి ముందే జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో సదస్సులు నిర్వహించాలని, వీటి నిర్వహణ బాధ్యత సమర్ధవంతమైన యాంకర్లకు, మోడరేటర్లకు అప్పగించాలని పేర్కొంది. దీనికోసం వారికి నగదు పారితోషకం చెల్లించాలని కూడా సూచించింది. దాదాపు మూడు పేజీలున్న ఈ సర్క్యులర్‌లో వివిధ అంశాలను పేర్కొన్నప్పటికీ కీలకమైన చట్టబద్ధత గురించి ఒక పదం కూడా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

సీఎం కార్యాలయ సూచనలతో..

కులగణన కేవలం వ్యక్తుల కులానికి మాత్రమే పరిమితం కాదు. వారి సామాజిక, విద్య, ఆర్థిక తదితర అంశాలపై కూడా వివరాలు సేకరించాలి. గతంలో జరిగిన కులగణనలతోపాటు, ఇటీవల బీహార్‌లో జరిగిన కులగణన కూడా ఇదే విధంగా జరిగింది. దీనికోసం వివరాలను పూర్తిస్థాయిలో, పక్కాగా సేకరించాల్సి ఉంటుంది.

ఈ వివరాలను ఒకటికి, రెండుసార్లు సంబంధిత వ్యక్తి చేత ధృవీకరించిన తరువాతే నమోదు చేయల్సి ఉంటుంది. అప్పుడే కచ్చితమైన డేటా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి కొంత శ్రమయైనప్పటికీ మాన్యువల్ విధానమైతే మేలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, సిఎం కార్యాలయ సూచనలతో యాప్ ద్వారా కులగణన చేయాలని నిర్ణయించినట్లు సర్క్యులర్‌లో పేర్కొ న్నారు. దీంతో వివరాలు నమోదు చేసుకోవడం, సరిచూసుకోవడం, ధృవీకరించడం వంటి పనులన్నీ మొబైల్ యాప్‌లో చేయాలి. ఏ మాత్ర పొరపాటు జరిగినా తప్పుడు సమాచారం నమోదయ్యే అవకాశం ఉంది. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ (జిఎస్‌డబ్ల్యుఎస్) శాఖ సిబ్బంది చేత ఈ సర్వే నిర్వహించనున్నట్లు సర్క్యులర్‌లో పేర్కొనడంతో వాలంటీర్లను కూడా దీనికోసం వినియోగించే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ తరహాలో నిర్వహించిన కొన్ని సర్వేల సమాచారం అంతగా ఉపయోగకరంగా లేదని అధికారవర్గాలే చెబుతున్నాయి. దీంతో కులగణన కచ్చితత్వంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విస్తృతంగా సదస్సులు

కులగణన సన్నాహాల్లో భాగంగా ఈ నెల 15, 16 తేదీలల్లో జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆ తరువాత రాష్ట్రంలోని ఐదు చోట్ల ప్రాంతీయ స్థాయి సమావేశాలు జరపున్నారు. 17వ తేదీన రాజమహేంద్రవరంలో (తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల) ప్రాంతీయ సదస్సు జరగనుంది. అదే తేదీన కర్నూలులో (కర్నూలు, అనంతపురం), 20వ తేదీన విశాఖపట్నం (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం), విజయవాడ (కృష్ణ, గుంటూరు, ప్రకాశం) 24వ తేదిన తిరుపతి (నెల్లూరు. చిత్తూరు, వైఎస్ఆర్ కడప)లలో ప్రాంతీయ సదస్సులు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలను దృష్టిలో ఉంచుకుని ఈ షెడ్యూల్ రూపొందించినట్లు, ప్రాంతీయ సదస్సులు ఉన్న చోట్ల జిల్లాసదస్సులు జరపనవసరం లేదని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

వక్తల ఎంపిక బాధ్యత కమిటీలకు

జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో నిర్వహించనున్న ఈ సదస్సుల్లో (రౌండ్‌టేబుల్- సమావేశాలు) పలువురిని భాగస్వామ్యం చేయనున్నారు. ప్రజాప్రతినిధులు, బిసి, ఇతర శాఖలకు చెందిన 56 కార్పొరేషన్ల డైరెక్టర్లు, మేధావులు, కుల సంఘాలకు చెందిన ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలను కూడా సదస్సులో పాలుపంచుకునేలా చూడాలని పేర్కొన్నారు. అయితే, వక్తలను ఎంపిక చేసే బాధ్యత మాత్రం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన కమిటీకి అప్పగించారు. ఆ కమిటీ ఎంపిక చేసిన వారికి మాత్రమే సదస్సుల్లో మాట్లాడే అవకాశం ఉంటుంది.

యాంకర్లు చాలా ముఖ్యం!

ఈ సదస్సులను నిర్వహించడానికి యాంకర్లు లేదా మోడరేటర్లను ముందుగానే గుర్తించి ఎంపిక చేయడం చాలా ముఖ్యమని సర్క్యులర్‌లో పేర్కొనడం విశేషం. అందుకోసం వీరికి నగదు పారితోషకం చెల్లించాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సదస్సును ఆకర్షణీయంగా నిర్వహించడంతోపాటు, నిర్దేశించిన అంశానికి పరిమితమయ్యేలా చూడటంలో యాంకర్లు కీలకపాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.

వేములవాడ, సంగారెడ్డి సీట్ల మార్పుపై తెలీదు

తాము అధికారంలోకి వస్తే జనాభా ఆధారంగా బడ్జెట్ : డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వేములవాడ, సంగారెడ్డి నియోజకవర్గాల అభ్యర్థులను చివరి నిమిషంలో ఏ కారణాలతో మార్చారో తనకు తెలియదని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయింపులుంటాయని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌లో ఏమాత్రం పసలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీని సీఎం చేస్తామని ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోని రెడ్లు ఎవరివారు తామే సీఎం అభ్యర్థులమని ప్రకటించుకున్నారని విమర్శించారు. బీసీలు కేవలం పించన్లకే అర్హులా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సిద్ధ రామయ్య బీసీ ముసుగులో ఉండి కుల గణాంక విషయాలు బయట పెట్టలేదని విమర్శించారు. బీజేపీయేతర రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తున్నారని చెప్పారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో తెలంగాణలో ఉన్న ఉత్తరాంధ్రకు చెందిన 26బీసీ కులాల ఊసేదని ప్రశ్నించారు.బీసీ సబ్ ప్లాన్ కు చట్టబద్ధత, బీసీ కమిషన్ కు రాజ్యాంగ హెూదా కల్పిస్తామన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకుమార్గదర్శకాలను సర్క్యులేట్ చేయండి

- దర్యాప్తు సంస్థల ద్వారా డిజిటల్ పరికరాల స్వాధీనంపై సుప్రీంకోర్టు
- సీనియర్ అడ్వకేట్‌కు ఆదేశాలు

న్యూఢిల్లీ : దర్యాప్తు సంస్థల ద్వారా ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు వంటి డిజిటల్ పరికరాల స్వాధీనంపై భారత సర్వోన్నత న్యాయస్థానం సీనియర్ న్యాయవాది నిత్యా రామకృష్ణన్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంలో మార్గదర్శకాలను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు సర్క్యులేట్ చేయాలని తెలిపింది. రామ్ రామస్వామి అండ్ ఓర్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా ఓర్స్ పిల్‌లో ఐదుగురు విద్యావేత్తలు ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించి సమర్పించిన తర్వాత సుప్రీంకోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది. అక్టోబరు 3న ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ న్యూస్ పోర్టల్ చైనా నుంచి నిధులు పొందిందన్న ఆరోపణలపై న్యూస్‌క్లిక్ కార్యాలయం మరియు ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లోని దాని జర్నలిస్టులు, ఉద్యోగులు, కన్సల్టెంట్లు, కంట్రిబ్యూటర్ల ఇండ్లపై దాడి చేసి వారి ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుంది. న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సుధాన్షు ధులియాలతో కూడిన ధర్మాసనం ఈ పిల్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఈ మార్గదర్శకాలను ప్రసారం చేయాలని రామకష్ణన్‌ను ఆదేశించింది.

ఉద్యోగుల డీఏ చెల్లింపునకు ఈసీ బ్రేక్

నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల డీఏ చెల్లింపునకు ఈసీ బ్రేకులు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, డీఏ చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఈ మధ్య ప్రభుత్వం ఈసీకి లేఖ రాసింది. ఇందులో 2022 జులై నెలకు చెందిన డీఏను ఇచ్చేందుకు రెడీ అయింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన లేఖపై కేంద్రనిఘా సంస్థల ద్వారా పూర్వాపరాలు తెలుసుకున్న ఎన్నికల సంఘం ఏడాదిగా పెండింగ్‌లో పెట్టిన డీఏను ఇప్పుడే ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించింది. ఎన్నికలు అయ్యేవరకు మూడు వారాల పాటు ఆగాలని ఆదేశించింది.

ఫైబర్‌నెట్ కేసులో

పిటి వారెంటుపై విచారణ ఒకటికి వాయిదా



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో టిడిపి అధినేత చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారని సిఐడి నమోదుచేసిన కేసులో విజయవాడలోని ఎసిబి కోర్టులో శుక్రవారం పిటి వారెంటు విచారణకు వచ్చింది. దీనిపై సిఐడి తరపున న్యాయవాది మెమో దాఖలు చేశారు. ఈ నెల 30 వరకు చంద్రబాబును అరెస్టు చేయొద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు తేల్చి చెప్పినందున ఈ పిటి వారెంటు విచారణను ఎసిబి కోర్టు డిసెంబరు ఒకటికి వాయిదా వేసింది. ఇదే ఫైబర్‌నెట్ కేసులో టెరాసాఫ్ట్ ఆస్తులను అటాచ్ చేయాలని సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌పైనా కోర్టు విచారణ జరిపింది. పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబరు 17కు వాయిదా వేసింది.



పంచతంత్రం-2023

బరిలో మహిళా అభ్యర్థులు తక్కువే

- 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలేది?
- బరిలో బీజేపీ నుంచి 20, కాంగ్రెస్ నుంచి 28 మంది అభ్యర్థులు
- ఇరు పార్టీల బుద్ధి బట్టబయలు



జైపూర్: లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఇటీవలే పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. రాష్ట్రపతి సంతకం తర్వాత ఇది చట్టంగా మారింది. అయితే మహిళలకు రిజర్వేషన్ కల్పించడంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొంది. మహిళాశక్తికి రిజర్వేషన్ కల్పించి గౌరవించామని బీజేపీ నేతలు అంటున్నారు. మరోవైపు పంచాయతీరాజ్‌లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజీవ్‌గాంధీ మహిళలకు సాధికారత కల్పించారని కాంగ్రెస్ చెబుతోంది. కాంగ్రెస్ నేతల అభిప్రాయం ప్రకారం.. మహిళా రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ ఎప్పటి నుంచో వాదిస్తోంది. కానీ ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల బుద్ధి బట్టబయలైంది. 2023 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 20 మంది (10 శాతం) మహిళా అభ్యర్థులకు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశమిచ్చింది. కాంగ్రెస్ 28 మంది (14 శాతం) మహిళా అభ్యర్థులను మాత్రమే నిలబెట్టింది. 33 శాతం మహిళా రిజర్వేషన్లకు మద్దతిస్తామని ప్రగల్భాలు పలికిన ఈ రెండు పార్టీలు ఎన్నికల్లో మహిళా అభ్యర్థులను నిలబెట్టడంలో తమ బుద్ధిని చూపించాయి. కాంగ్రెస్ 28 మంది మహిళలకు టిక్కెట్లు ఇచ్చింది. జోధ్‌పూర్ నుంచి మనీషా పన్వర్, ఒసియన్ నుంచి దివ్య మదెర్నా, షేర్‌ఘర్ నుంచి మీనా కన్వర్, జలోర్ నుంచి రమీలా మేఘ్వాల్, అహెూర్ నుంచి సరోజ్ చౌదరి, బగ్రు నుంచి గంగా దేవి, చౌమున్ నుంచి శిఖా మైలే బరాలా, మాల్వీయా నగర్ నుంచి డాక్టర్ అర్చన శర్మ, మమతా భూపేశ్ నుంచి కాంగ్రెస్ పోటీ చేసింది. సిక్రాయ్. , ఖేత్రీ నుండి మనీషా గుర్జర్, మండవా నుంచి రీటా చౌదరి, బన్సూర్ నుంచి శకుంతలా రావత్, వల్లభఘర్ నుంచి ప్రీతి శక్తావత్, కతుమార్ నుంచి సంజన జాతవ్, కుషల్‌గఢ్ నుంచి రమీలా ఖాదియా, పుష్కర్ నుండి నసీమ్ అక్తర్ ఇన్సాఫ్, పుష్కర్ నుంచి నసీమ్ అక్తర్ ఇన్సాఫ్, రఖా గౌత్ నుంచి రఖా గౌత్, దూది నుంచి రఖా దూది నిర్మలా సహారియా నుండి కిషన్‌గంజ్, బమన్వాస్ నుంచి ఇందిరా మీనా, ధోల్పూర్ నుంచి శోభారాణి కుష్వాహా, భోపాల్‌గఢ్ నుంచి గీతా బర్వాద్, అజ్మీర్ సౌత్ నుంచి ద్రౌపది కోలి, జయాల్ నుంచి మంజు మేఘ్వాల్, అనుప్‌గఢ్ నుంచి సిమ్లా నాయక్, సదుల్పూర్ నుంచి కృష్ణ పూనియా, సదుల్పూర్ నుంచి హెచ్ ఖాన్రావ్ ఖాన్రావ్, జాహితాన్ జాహిదా అభ్యర్థులుగా నిల్చున్నారు. బీజేపీ కేవలం 20 మంది మహిళా అభ్యర్థులను బరిలో నిలిపింది. విద్యాధర్ నగర్ నుంచి దియా కుమారి, సూరజ్‌గఢ్ నుంచి సంతోష్ అహ్లావత్, బాగిదౌరా నుంచి కష్ణ కటారా, రాజ్‌సమంద్ నుంచి దీప్తి మహేశ్వరి, నాగౌర్ నుంచి జ్యోతి మిర్ధా, మక్రానా నుంచి సుమిత్రా భించర్, బికనీర్ ఈస్ట్ నుంచి సిద్ధి కుమారి, సుజన్‌గఢ్ నుంచి సంతోష్, లాడ్‌పురా నుంచి కల్పనా దేవి పోటీ చేశారు. వసుంధర రాజే, కేశోరాయ్‌పటన్ నుండి చంద్రకాంత మేఘవాల్, భోపాల్‌గఢ్ నుండి కంస మేఘ్వాల్, సోజత్ నుండి శోభా చౌహాన్, రాజ్‌ఖేడా నుండి నీర్జా శర్మ, అజ్మీర్ సౌత్ నుండి అనితా భడేల్, జయల్ నుండి డాక్టర్ మంజు, అనుప్‌గఢ్ నుంచి సంతోష్ బాబ్రీ, సదుల్ కహమ్‌మాన్ నుంచి సుమిత్రా పూనియా, సదుల్ కమాన్ నుంచి సుమిత్రా పూనియా , రాజ్‌కుమారి జాతవ్‌కి హిండౌన్ నుంచి టిక్కెట్ ఇచ్చింది.

ఉద్యోగం వచ్చినపుడే దీపావళి

- మధ్యప్రదేశ్‌లో నిరుద్యోగుల నిరీక్షణ

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని యువతరాన్ని చూడగానే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భాంజీ (మేనకోడలు) లేదా భాంజా (మేనల్లుడు) అని సంబోధిస్తారు. తను మామ (మావయ్య) వలె.. ప్రవర్తిస్తుంటారు." మీకు అండగా ఉంటా.. ఉద్యోగాలిస్తానంటూ హామీలిచ్చారు" కానీ ఆ హామీలు నీటమూటలయ్యాయి. అయితే మరోపక్క ఈ నిరుద్యోగ యువతే మాకు ఉద్యోగం వచ్చినపుడే మాకు దీపావళి అని అంటున్నారు. మార్చిలో అసెంబ్లీ జరిగినపుడు బీజేపీ ప్రభుత్వం స్వయంగా అంగీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా నమోదు చేసుకున్న 39 లక్షల మంది నిరుద్యోగ యువకులలో, గత మూడేండ్లలో కేవలం 21 మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. అదనంగా, అనేక రిక్రూట్‌మెంట్ పరీక్షలకు మాల్‌ప్రాక్టీస్ ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయి . వీటికి తోడు అనేక ఇతర పరీక్షల ఫలితాలు ఆలస్యమయ్యాయి.

మౌన పోరాటం

- రాజస్థాన్ ఎన్నికల నేపథ్యంలో న్యాయం చేస్తామని ఆయా పార్టీల నాయకుల హామీలు
- ఇవి భన్వరీ దేవి 30 ఏండ్ల బాధను పోగొట్టగలవా?





జైపూర్ : జైపూర్‌లోని ఒక చిన్న గదిలో భన్వారీ దేవి ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్నారు. బిగ్గరగా మాట్లాడకూడదని డాక్టర్ ఆమెకు గట్టి సూచనలు చేశారు. కానీ మీరు ఆమె ముందు 1992 గురించి ప్రస్తావిస్తే, ఆమెకు కోపం వస్తుంది. ఆ సంవత్సరం ఆమె జీవితాన్ని మార్చడమే కాక కార్యాలయంలో లైంగిక వేధింపుల అవగాహనను కూడా మార్చేసింది. ఇది భారతదేశంలో లైంగిక వేధింపుల చట్టాలకు దారితీసింది. తనకే న్యాయం జరగకపోవడం ఆశ్చర్యకరం. అది కూడా పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు సంబంధించి సుప్రీం కోర్టు మార్గదర్శకాలను సైతం జారీ చేసింది.కానీ దేవి పడిన బాధ తర్వాతే మార్గదర్శకాలు అమలు చేయబడ్డాయి. హాస్యాస్పదమేమిటంటే ఆమె తన విజ్ఞప్తిని వినడానికి కొత్త తేదీ కోసం వేచి ఉంది. రాజస్థాన్‌లో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి, ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కసారిగా భన్వారీ దేవిపై ఆసక్తి పెరిగింది, నాయకులు ముందుకు వచ్చి ఆమెకు న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నారు.

1992లో ఏం జరిగింది?

1992లో జైపూర్‌కి 50 కిలోమీటర్ల దూరంలోని భతేరి గ్రామంలో దేవి తన భర్తతో కలిసి సాయంత్రం తమ పొలాల్లో పని చేస్తోంది. ఆకస్మాత్తుగా ఐదుగురు వ్యక్తులు వచ్చి ఆమె భర్తను కొట్టి ఆ తర్వాత ఒకరి తర్వాత ఒకరు ఆమెపై అషారుుత్యం చేశారు.మూడేండ్లలో గ్రామస్తులు, ఆమె కుటుంబంలోని చాలా మంది ఆమెను బహిష్కరించడంతో దేవి జీవితం నరకంగా మారింది. 1995 నాటికి నిందితులందరూ లైంగికదాడి ఆరోపణల నుంచి విముక్తి పొందడం ఆమెకు అతిపెద్ద షాక్. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం కింద బాల్య వివాహాలను ఆపడానికి దేవి ప్రయత్నిస్తున్నారని గుజ్జర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.దేవీ కండ్లల్లో కోపం, ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తోంది. "నేనేం చేశాను.. నేను ఎవరి దగ్గరా ఏమీ లాక్కోలేదు.. ఆడపిల్లల ప్రాణాలు కాపాడాలనే నా ప్రయత్నం.. నేనూ బాల్య వివాహాల బారిన పడ్డాను.. నాపై లైంగికదాడికి పాల్పడ్డ ఆ నిందితుల సంగతేంటి? ఎవరైనా వారిని ఎందుకు నిందించరు. మీ వేలు ఎత్తండి?" అని పిలుపునిస్తోంది.రానున్న ఎన్నికల్లో మహిళా సాధికారతపై ఆమె ఎక్కువ దష్టి సారిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంతో వారిలో ఆశలు చిగురించాయి.నిందితులను నిర్దోషిగా విడుదల చేయడంపై రాజస్థాన్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసిన ఆయన కేసు ఇంకా పెండింగ్‌లో ఉంది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారులు కూడా ఆయనను కలిసేందుకు వచ్చారు."రేప్ గురించి కచ్చితంగా తెలుసా అని వారిలో ఒకరు నన్ను అడిగారు. మరొకరు " వద్దులు మిమ్మల్ని ఎలా రేప్ చేస్తారు?" అని అడిగారు అని ఆమె చెప్పింది.మహిళా హక్కుల ఎన్‌జీవో కోసం పనిచేస్తున్న ఆమె కుమారుడు ముకేశ్ మాట్లాడుతూ "ఇది 30 సంవత్సరాలకు పైగా ఉండవచ్చు, కానీ న్యాయం స్వాగతం. నా తల్లి వైఖరి సరైనదని నిరూపించబడాలని నేను కోరుకుంటున్నా"

భతేరి గ్రామంలోని పురుషుల వాదన విరుద్ధంగా ఉంది. సంఘటన జరిగిన సమయంలో వారు అదే ప్రాంతంలో ఉన్నారు. ఈ ఘటన జరిగిన గ్రామం ఇదే.దేవి ఓబీసీ కేటగిరీలో ఉన్న 'కుమ్హర్' కమ్యూనిటీకి చెందినవారు. తనకు న్యాయం జరిగేలా రాజకీయ ఒత్తిళ్లు రావచ్చని దేవి అభిప్రాయపడ్డారు. దాడి చేసినవారు రాష్ట్ర ఓటర్లలో దాదాపు 10 శాతం ఉన్న గుజ్జర్లు. కిటికీలోంచి బయటకు చూస్తూ ఆమె "నేను మౌనంగా ఉండను. మనమందరం మాట్లాడాలి. మీరు కూడా మాట్లాడాలి"..అని కోరారు. భన్వరీ దేవి న్యాయం కోసం చాలాకాలం వేచి ఉండాల్సి వచ్చింది. చివరకు ఆమె అప్పీల్ విచారణకు వస్తుందో? లేదో వేచి చూడాలి.

దొందు దొందే...

రాజస్థాన్‌లో సీట్ల కేటాయింపులో బీజేపీ, కాంగ్రెస్ ఒకటే



జైపూర్ :రాజస్థాన్‌లో పార్టీ టిక్కెట్ల కేటాయింపులో బీజేపీ, కాంగ్రెస్ దొందు దొందే అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలపై సెంటిమెంట్‌లు కనిపిస్తున్నప్పటికీ, మరింత మంది కొత్త ముఖాలకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లు ఇచ్చే ధైర్యం చేయలేదు. కాంగ్రెస్ 100 మంది ఎమ్మెల్యేలలో 86 శాతం మందిని ఈసారి పునరావతం చేసింది, అలాగే బీజేపీ కూడా ఆ ధోరణిలోనే ఉంది. అయితే, డేటా పరిశీలిస్తే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ ఎమ్మెల్యేల విజయం 2003లో 60 శాతం, 2013లో 82 శాతం. కాంగ్రెస్ ఎమ్మెల్యేల విజయం 2008లో 47 శాతం, 2018లో 84 శాతం.రెండు పార్టీలు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు అనుకూలంగా ఉండటానికి రెండు ప్రధాన కారణాలను ఎన్నికల నిపుణులు జాబితా చేస్తున్నారు: వారి అభ్యర్థిత్వాన్ని తిరస్కరించినట్లయితే ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసే అవకాశం , సంపద సష్టిపైనే ప్రధాన దష్టి అని స్పష్టమవుతోంది.. ఏది ఏమైనప్పటికీ, రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఎన్నుకోవడంలో "గెలుపు" అనేది ఏకైక నిర్ణయాత్మక అంశం."సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వకపోతే వారు తిరుగుబాటు చేస్తారని, స్వతంత్రంగా పోటీ చేస్తారని లేదా బీఎస్పీ, ఆర్‌ఎల్పీ, ఆప్ లేదా మజ్లిస్ వంటి చిన్న పార్టీలలో చేరవచ్చని రాజకీయ పార్టీలలో భయం ఉంది. మరొక అంశం ఆర్థిక వనరులు. అధికారంలో ఉండగా కొందరు ఎమ్మెల్యేలు కొంత సంపదను కూడబెట్టుకుంటారు. వారు అధికారంలో ఉన్నారా అనేది పట్టింపు లేదు. ఈ విధంగా, పార్టీ అభ్యర్థిపై ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు, "అని సంజయ్ లోధా అన్నారు. రెండు పార్టీల ధనబలం విషయానికొస్తే కాంగ్రెస్ కంటే బీజేపీకి ఐదు రెట్లు ఎక్కువ విరాళాలు వచ్చాయి. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్, ఎన్నికల రాజకీయాలలో డబ్బు , కండబలంపై దష్టి సారించే పార్టీ రహిత సంస్థ ప్రకారం 2016-17 , 2021-22 మధ్య కాలంలో బీజేపీకి రూ. 5,271.97 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌లు వచ్చాయి, కాంగ్రెస్‌కు రూ. 952.29 కోట్లు. అయితే ధనబలం ఒక్కటే ఓటర్ల ఆగ్రహాన్ని, అణగదొక్కబడిన ఎమ్మెల్యేల తిరుగుబాటును తట్టుకోదు. ఏడుగురు ఎంపీలతో సహా 39 మంది తాజా ముఖాలు ఉన్న 41 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితా తర్వాత బీజేపీ ఈసారి కష్టతరమైన మార్గాన్ని నేర్చుకుంది. 10కి పైగా స్థానాల్లో బీజేపీని బెంచ్‌పై కూర్చోబెట్టడంపై విధేయులు నిరసన వ్యక్తం చేశారు."ఈ ఎన్నికలు రెండు వైపుల నుంచి ఒకరిపై ఒకరికి, పార్టీపై వ్యక్తిగత అహంకారానికి సంబంధించినవి. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తన ప్రభుత్వాన్ని కాపాడినందుకే (2020లో) కొందరికి టిక్కెట్లు పంపిణీ చేశారు. గెహ్లాట్ మాట్లాడుతూ "నా ప్రభుత్వాన్ని కాపాడినందున వారికి టిక్కెట్లు ఇవ్వాలి" కదా అంటున్నారు. "బీజేపీ మొదటి జాబితాలో చాలా మార్పులు చేసింది. పెద్ద రియాక్షనే వచ్చింది. ఆ తర్వాతి జాబితాల్లో బీజేపీ మళ్లీ విధేయులుగా మారిపోయింది. అప్పుడు బీజేపీ మరిన్ని కొత్త ముఖాలను తీసుకువచ్చింది, " అని రాజకీయ విశ్లేషకుడు , జర్నలిస్ట్ అవినాష్ కల్లా అన్నారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో కోటరీకే పరిమితమైందని ఆయన అన్నారు. హిందూత్వ సంస్థలు, మత రాజకీయాలు బీజేపీకి నిలుస్తున్నాయని చెబుతుంటారు. మరొక అంశం వనరుల లభ్యత పుష్కలంగా ఉండటంతో.. బీజేపీ, కాంగ్రెస్ మధ్య టఫ్ ఫైట్ కనిపిస్తోంది

రూ. 100 కోట్లు తరలించాలి...

- మధ్యప్రదేశ్‌లో కేంద్రమంత్రి కుమారుడి వీడియో వైరల్
- మనీలాండరింగ్ కేసు నమోదు చేయాలి: కాంగ్రెస్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర వ్యవసాయ మంత్రి, మధ్యప్రదేశ్ బీజేపీ నాయకుడు నరేంద్ర సింగ్ తోమర్ కుమారుడు దేవేంద్ర ప్రతాప్ సింగ్ తోమర్ కోట్లాది లావాదేవీలపై చర్చిస్తున్నట్లు ఆరోపించిన వీడియో రాష్ట్రంలో ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పెద్ద వివాదానికి దారితీసింది. దేవేంద్ర తోమర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా గుర్తు తెలియని వ్యక్తిపై ఈ కేసు నమోదైంది. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇది తన ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రచారం చేసిందని ఆయన ఆరోపించారు. ఆ వీడియో క్లిప్‌లో దేవేంద్ర ప్రతాప్ సింగ్ తోమర్ ఒక వ్యక్తితో వీడియో కాల్ ద్వారా మాట్లాడుతున్నట్లు, రూ.100 కోట్ల విలువైన నిధులను "తరలించడం" గురించి చర్చిస్తున్నట్టు కనిపిస్తుంది. మరో కాల్ రికార్డింగ్‌లో "తన రూ.18 కోట్లు" నాలుగు వేర్వేరు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని ఒక వ్యక్తి తోమర్‌కి చెప్పడం వినిపిస్తుంది.

మధ్యప్రదేశ్‌లో నవంబర్ 17న జరిగే ఎన్నికలకు నరేంద్ర సింగ్ తోమర్ దిమాని అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్న సందర్భంగా ముందుగా ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దేవేంద్ర ప్రతాప్ సింగ్ తోమర్ తన ఫిర్యాదులో "నేను కోట్ల విలువైన లావాదేవీలు నిర్వహించినట్టు తప్పుడు ప్రచారంతో వైరల్ వీడియో బయటపడింది. ఈ కల్పిత వీడియో నాపై దుష్ప్రచారం, ప్రతికూల అభిప్రాయాన్ని సృష్టించే కుట్రలో భాగం. నకిలీ వీడియో క్లిప్‌లు నా పబ్లిక్ ఇమేజ్, ప్రతిష్టను దెబ్బతీసే దురుద్దేశంతో వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారం చేయబడుతున్నాయి" అని పేర్కొన్నారు. తనకు గానీ, తన కుటుంబం నుంచి గానీ, సన్నిహితుల నుంచి గానీ ఎవరికీ వారి బ్యాంకు ఖాతాల్లో ఇంత పెద్ద మొత్తంలో డబ్బు రాలేదని, ఆ ఆరోపణలు అబద్ధమని, కల్పితమని అన్నారు. కుట్రపై క్షుణ్ణంగా విచారణ జరిపి, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కూడా ఆయన కోరారు. గుర్తు తెలియని వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కేంద్రమంత్రి నరేంద్ర తోమర్‌ను బర్తరఫ్ చేయాలి

వీడియోపై న్యాయ విచారణకు పిలుపునిచ్చిన కాంగ్రెస్, దర్యాప్తు పూర్తయ్యే వరకు కేంద్రమంత్రి నరేంద్ర తోమర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసింది. "నరేంద్ర సింగ్ తోమర్ ఢిల్లీలోనే కాదు, మధ్యప్రదేశ్‌లో కూడా శక్తివంతమైన వ్యక్తి. ఆయన కుమారుడిని అరెస్టు చేసే వరకు స్వేచ్ఛగా, న్యాయమైన విచారణ సాధ్యం కాదు" అని కాంగ్రెస్‌కు చెందిన సుప్రియా శ్రీనాట్ అన్నారు. మనీలాండరింగ్ కేసు నమోదు చేయాలని కూడా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ మీడియా సలహాదారు పీయూష్ బాబేలే ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఆదాయపన్ను శాఖ తమ ప్రామాణికతను ధ్రువీకరించాలని కోరారు.

మధ్యప్రదేశ్‌లో దారుణం

- మూడేండ్లలో రెండు లక్షల మంది మహిళల అదృశ్యం
- మొదటిస్థానంలో గిరిజన జిల్లా అలిరాజ్‌పూర్
- దుర్భర వలసలు, అధిక పేదరికం, తక్కువ స్థాయి విద్య తదితరాలు
- ఇవన్నీ అదృశ్యం కేసులకు దారితీస్తున్న కారణాలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మధ్యప్రదేశ్‌లో దారుణాలు చోటు చేసుకున్నాయి. ఈ రాష్ట్రంలో మూడేండ్ల కాలంలో దాదాపు రెండు లక్షల మంది మహిళలు, చిన్నారులు అదృశ్యమయ్యారు. అలాగే ఇక్కడ ఆకలి, దుర్భర వలసలు, అధిక పేదరికం, వాతావరణ మార్పులతో పాటు రాజకీయం కూడా కారణంగా ఉన్నది.

2022 ఏప్రిల్‌లో 12 ఏండ్ల రష్మీ తన తల్లి దేవికి అలీరాజ్‌పూర్ నగరంలోని ఒక భవనంలో నిర్మాణ కార్మికురాలిగా తాను ప్రయత్నిస్తానని చెప్పింది. చుట్టుపక్కల ప్రతి గ్రామంలాగే వారి గ్రామమైన ఛక్తాలాలో పెరుగుతున్న ఏ పిల్లలకైనా ఇది కోర్సుకు సమానంగా ఉంటుంది.

దేవి ఓ వితంతువు. ఆమెకు తన నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలను పెంచుతూ కాలం గడిపేది. ఆమెకు ఇక్కడ కొద్దిపాటి భూమి ఉంది. దానిపై ఆధారపడి జీవిస్తుంది. కానీ తొమ్మిది మంది కుటుంబానికి ఆ భూమి ఎంత అందించగలదు? దీంతో ఆమె "కుటుంబంలోని ప్రతి ఒక్కరూ పని చేయాలి. ఇది ఇక్కడ ఆచారం" అని చెప్పారు.దీనికి సరిగ్గా ఏడాది ముందు, తన కూతురు రష్మిని గుజరాత్‌లోని కతియావార్‌కు పంపారు. అక్కడ ఆమె మూడు నెలలు కూలీగా పని చేసింది. రష్మీ తన ఉద్యోగ వేట ప్రారంభించే ముందు సమీపంలోని మార్కెట్ నుండి బట్టలు కొనడానికి తన తల్లిని రూ. 200 అడిగింది. ఆ రోజు, మరుసటి రోజు రష్మీ ఇంటికి తిరిగి రాలేదు. దేవి ఆమె కోసం మార్కెట్‌లో వెతకడానికి వెళ్ళింది. వారి ఇంటికి 10 కిలోమీటర్ల దూరంలో మైదానం మార్కెట్ మధ్యలో ఉంది. కాని ఆమె దొరకలేదు. బంధువులు, ఇతర గ్రామస్తులు వెతకడం ప్రారంభించారు.ఈ ప్రాంతంలో బాల కార్మికులు పనిచేయడం ఎంత సాధారణమైన విషయమో, అదే విధంగా ఇక్కడ చిన్నారులూ తప్పిపోతుండడం సాధారణమైపోయింది. మధ్యప్రదేశ్‌లో చిన్నారులు, బాలికలు తప్పిపోయిన కేసులు దేశంలోనే అత్యధికం.

ఎన్సీఆర్బీ డేటాలోనూ..

2019-2021 మధ్య మధ్యప్రదేశ్ నుంచి దాదాపు 2 లక్షల మంది మహిళలు, బాలికలు అదృశ్యమయ్యారని, ఈ ఏడాది జులైలో పార్లమెంటులో హెూం మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) డేటా తెలిపింది. మరే రాష్ట్రంలోనూ ఇన్ని తప్పిపోయిన మహిళలు, బాలికల కేసులు లేవు. 2022లో మధ్యప్రదేశ్‌లో ప్రతిరోజూ 32 మంది పిల్లలు అదృశ్యమవుతున్నారు. అందులో 24 మంది బాలికలు (75 శాతం)ని చైల్డ్ రైట్స్ అండ్ యు (సి ఆర్ వై) ఎన్జీఓ ద్వారా సేకరించిన సమాచారాన్ని సమాచార హక్కు (ఆర్టీఐ) నివేదిక తెలిపింది.

అదృశ్యమైన మహిళలు, పిల్లల కేసులు ఎక్కువగా కనిపించే గిరిజన లేదా ఆదివాసీ జిల్లాలే అని కూడా డేటా స్పష్టం చేస్తుంది. తప్పిపోయిన మహిళల సూచికలో అత్యధిక ర్యాంక్‌లో గిరిజన జిల్లా అలిరాజ్‌పూర్ ఉంది. అదృశ్యమైన వారిలో కొందరిని గుర్తించారు. మరికొందరు కనిపించలేదు. ఈ తప్పిపోయిన కేసుల్లో పెద్ద సంఖ్యలో దుర్భర వలసలు, ఉద్యోగ అవకాశాల కొరత, వాతావరణ మార్పు, అధిక పేదరికం, తక్కువ స్థాయి విద్య, పరిమిత స్వేచ్ఛలు, వ్యవస్థలోని పక్షపాతాలతో ముడిపడి ఉన్నాయి. ఇవన్నీ సమిష్టిగా అదృశ్యం కేసుల సంఖ్యకు దారితీస్తున్నాయి. అందులో రష్మీ కేసు ఒకటి మాత్రమే.


అన్ని సభలకూ వారే...

ప్రచారాలకు అడ్డా కార్మికులు, వ్యవసాయ కూలీలు

- పైసలిచ్చి ప్రచారానికి తీసుకెళ్తున్న వైనం
- కూలీల కొరత తీవ్రం.. నిలిచిపోతున్న పనులు
- 30 దాకా ఇదే తంతు
- దీనిపై దృష్టి పెట్టని ఈసీ

పండు ముసలి నుంచి పసిపోరడి దాకా పార్టీల ప్రచారాలు, సభల బాట పడుతున్నారు. ఏ పార్టీ సభలు చూసినా ఆ జనమే కనబడుతున్నారు. ఓటు ఎవరికేస్తారు? అంటే 'ఓట్లనాడు నచ్చినోళ్లకు వేస్తాం. ఇప్పుడు ఏ పార్టోళ్లు పిలిచినా ప్రచారానికెళ్తాం' అంటూ చెప్పేస్తున్నారు. కూలీలు లేబర్ అడ్డాల వైపే చూస్తలేరు. పొద్దుగాల..పొద్దుగూకంత రెండు పూటలా ప్రచార పర్వంలో మునిగిపోతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులకూ కూలోళ్లు దొరుకుతలేరు. ఇటు పట్నంలో నిర్మాణ, ఇతర రంగాల్లో, అటు గ్రామాల్లో వ్యవసాయ పనులకు కూలోళ్లు దొరక్క ఎక్కడికక్కడే పనులు ఆగిపోతున్నాయి. ఈ నెల 30 దాకా రాష్ట్రంలో ఇదే పరిస్థితి ఉండబోతున్నది.





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఏ ఊరికెళ్లినా..ఏ రైతును పలుకరించినా కూలీల కొరత స్పష్టంగా కనబడుతున్నది. గ్రామాల్లో పత్తి ఏరడం, కలుపు తీయడం, ఇతరత్రా వ్యవసాయ పనులకు వెళ్తే రోజుకూలి రూ.300 నుంచి రూ.400 దాకా ఇస్తున్నారు. అదే రాజకీయ పార్టీల ప్రచారాలకు వెళ్తే దానికి రెట్టింపు స్థాయిలో ఇస్తున్నారు. దీంతో ప్రచార కూలీలుగా వెళ్లేందుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఏ ఇద్దరు కలిసినా ఈ రోజు ఏ పార్టోళ్లపిలిచారు? ఎంత ఇస్తామన్నారు? దూరమెంత? తుఫాన్ పెట్టారా? బస్సు పెట్టారా? పైసలు ఫస్టే ఎవరిస్తున్నారు? ఇలా అన్ని అంశాలనూ బేరీజు వేసుకుని మరీ ప్రచార పర్వంలోకి దూకుతున్నారు. బీజేపీ ఇటీవల హైదరాబాద్‌లో ప్రధాని మోడీ సభ తెలిసిందే. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి నాలుగైదు బస్సులు పెట్టి తీసుకెళ్లారు. అదే నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి అదే కాలనీవాసులు గుంపులు గుంపులుగా వెళ్లారు. కాంగ్రెస్ ప్రచారంలోనూ వారే కనిపించారు. ఇదే విషయంపై ఈ వయస్సులో ఎందుకమ్మా అని ఓ ముసలామెను పలుకరిస్తే 'ఊకె గూసుంటే ఏమొస్తది బిడ్డా. అట్ల రెండు గంటలు మొఖం చూపించి వస్తే రూ.500 ఇస్తున్నరు. బువ్వపెట్టిస్తున్నరు. ఎవ్వరు పిలిచినా పోతం బిడ్డా. ఓటేసేటప్పుడు మాకిష్టమునోళ్లకు వేసుకుంటం' అని తటపటాయించకుండా చెప్పేసింది. హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో ఉదయం పూట ప్రచారానికి వెళ్లే టిఫిన్‌తో పాటు మధ్యాహ్నం భోజనం పెట్టి రూ.500 నుంచి రూ.700 దాకా ఇస్తున్నారు. అదే సాయంత్రం పూట ప్రచారానికి వెళ్తే రూ.500 ఇవ్వడంతో పాటు రాత్రి భోజనం పెట్టిస్తున్నారు. ఉదయం నాలుగు గంటలు, సాయంత్రం నాలుగు గంటలు ప్రచారానికి పోతే రూ.1000 దక్కుతుండటంతో హైదరాబాదర్ నగరంలో లేబర్ అడ్డాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర పనులు చేయించుకోవాలనుకునే వారు కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అయితే మగోళ్లకు, ఆడోళ్లకు వేర్వేరుగా పైసలిస్తున్నారు. భార్యభర్తలు జంటగా మోటార్ సైకిలుపై వెళ్తే బండిలో పెట్రోలు పోయిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం పెట్టిస్తున్నారు.

దీంతో పాటు రోజువారీ కూలీగా పార్టీలను బట్టి ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.1000 దాకా ఇస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని మునుగోడు నియోజకవర్గంలో ఒకే రోజు నాలుగు పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసి సభలు పెట్టడంతో ప్రచార కూలీలు దొరక్క నేతలు ఇబ్బంది పడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మనిషికి రూ.500 +బండిలో పెట్రోల్+ భోజనం వంటి సౌకర్యాలను కల్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వారితో సమానంగా తమకూ జనం ఉన్నారని చూపించుకునేందుకు బీజేపీ నేత అయితే మనిషికి రూ.1000, బండిలో పెట్రోల్ పోయించి తీసికెళ్లినట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో ఒక్క వామపక్షాలు మినహా అన్ని పార్టీలు ఎక్కువగా కూలోళ్లతోనే ప్రచారం చేయిస్తున్నారు.

తమ నేతల ప్రచారంలో వీలైనంత మేరకు ఎక్కువ మంది ఉండేలా చూసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్న విషయమే. అయితే, పార్టీలు మాత్రం తమ అభ్యర్థుల కోసం ప్రజలంతా స్వచ్ఛందంగా తరలొస్తున్నారని గొప్పలకు పోతున్నాయి. దీనిపై ఎలక్షన్ కమిషన్ దృష్టిసారించాల్సిన అవసరముంది.

సంపాదకీయం

జనం నుండి.. జనం కోసం..

బ్రిటన్ సామ్రాజ్యవాదుల్ని మన దేశం నుండి తరిమేయడం కోసం వ్యక్తిగత సౌఖ్యాలు వదులుకున్న అల్లూరి, భగత్‌సింగ్ వారసులు వారు. సంతానం కలిగితే ప్రజా ఉద్యమాల్లో స్వార్థం తొంగి చూడొచ్చనుకుని కష్టజీవులకు అండగానే కాదు, తండ్రిగానూ నిలిచిన సుందరయ్య వారసత్వంలో పెరిగిన 'కామ్రేడ్లు' వారు. వీళ్ల కాళ్లు జనంలోనే ఉంటాయి. వాళు జనం కోసమే ఉంటారు. స్టాలిన్ ఉదహరించిన హెర్క్యులిస్‌లు కాదు. గాల్లోకి ఎగరేసి చంపడానికి! వాళ్ల డబ్బుకి బానిసలు కాదు. లక్ష్యశుద్ధి ఉన్నవారు. లక్షలతో వారిని కొనలేరు. చిటారు కొమ్మనున్న పక్షి కన్ను మాత్రమే కనపడే అర్జునులు ఆ పందొమ్మిది మంది. శాసనసభ పోసుకోలు కబుర్లు చెప్పుకునే 'గాసిప్ క్లబ్' గా కాకుండా ప్రజా సమస్యలపై చర్చలు చేసే వేదికగా ఉండాలంటే తెలంగాణ శాసనసభకు సీపీఐ(ఎం) అభ్యర్థులు ఎన్నిక కావాలి. రాష్ట్రంలో గిరిజనోద్యమాల నుండి కార్మిక పోరాటాల వరకు ప్రజా సమస్యలే వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

వాళ్లకు కోట్ల రూపాయల్లేవు. నోట్లు వాళ్లు పంచరు. ఎన్నికలంటేనే డబ్బుమయమైన వేళ, వారు చేసిన పోరాటాలే పెట్టుబడిగా ఎన్నికల రంగంలోకి దూకిన ప్రజల మనుషులు వాళ్లు. కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు ఉద్యమాల్లో పాల్గొని ప్రజల కోసం జైళ్లపాలైనవాళ్లు. ప్రజల కోసం లాఠీ దెబ్బలు తిన్నవారు, మహిళా హక్కులకై నిలిచిన వారు, కుల వివక్షతో పాటు, సామాజిక అణచివేతలపై పోరాడుతున్నవారు ఆ పార్టీ అభ్యర్థులు.

నిన్నటితో నామినేషన్ల ప్రక్రియ ముగిసి పోయింది. అటు విజయ భేరీలు, ఇటు ఆశీర్వాద సభలు రాజకీయ విమర్శలు దాటి తిట్ల పురాణాల్లోకి జారుతున్నాయి. ముందు, ముందు బూతుల పంచాంగాలు విప్పినా ఆశ్చర్యం లేదు. బీజేపీ ఎలానూ గూడలు జారేసింది. తెలంగాణలో తన పప్పులుడికేలా లేవని ప్లాన్-బి కి తెరలేపింది. బీఆర్ఎస్‌ని మెల్లిగ తన నిఘంటువులో నుండి పక్కకు జరిపింది. మొన్న కష్టపడి ఎల్బీ స్టేడియంలో సభ పెట్టిన మోడీ, కేసీఆర్‌ను పల్లెత్తు మాటనలేదు. 'డొక్క చించేస్తాం, డోలు కట్టేస్తాం' అన్న డైలాగులు లేకుండా ఆయన సందేశం చప్పగా సాగే సరికి బీజేపీ కార్యకర్తలే ఇదేం మతలబోనని బుగ్గలు నొక్కుకున్నారు. ఇప్పుడు నడిచేవి 'క్విడ్‌ప్రోకో' రాజకీయాలు కాబట్టి మొన్న రామగుండం సభలో కేసీఆర్ కోలిండియాలో నూట అరవయ్యొక్క బ్లాకులను వేలానికి పెట్టిన బీజేపీని, ముఖ్యంగా మన సింగరేణిలో ఐదు బ్లాకులను అమ్మేసిన బీజేపీని కాకుండా కాంగ్రెస్‌ని విమర్శించడం ఆయనకి రాజకీయంగా ఉపయోగపడచ్చు గాని వాస్తవమైతే కాదు.



దేశంలో సంఘ్ పరివార్ దుర్మార్గాలు అన్నీ, ఇన్నీ కావు. భారత సమాజాన్ని నిలువునా చీలుస్తున్నది. వర్ణాశ్రమ ధర్మాన్ని పున:ప్రతిష్ట చేసే ప్రయత్నంలో ఉంది 'పరివార్'. 1930వ దశకంలో యూదుల్ని ఊచకోత కోసిన హిట్లర్ ఆర్ఎస్ఎస్‌కు ఆరాధ్య దైవం. ప్రస్తుతం పాలస్తీనాపై నరమేధం సాగిస్తున్న 'యూదు సామ్రాజ్యం' దానికి దిశానిర్దేశం చేసే తోక చుక్క. అందుకే బీజేపీని తెలంగాణ రాష్ట్రంలో ఐపు, అజా లేకుండా చేయాలి. అపుడే మన రాష్ట్రం ప్రశాంతంగా ఉంటుంది. కాంగ్రెస్ నుండి వయా బీఆర్ఎస్ నేడు బీజేపీ అభ్యర్థిగా నిలిచిన ఒక పెద్ద మనిషి బుల్డోజర్ల రాజ్యం కోసం బుల్డోజర్ల ప్రదర్శనతో మొన్న నామినేషన్ వేయడం ఒక చిన్న మచ్చు తునక.


బీఆర్ఎస్‌పై వివిధ వర్గాల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని మైక్రాన్ల స్థాయి వరకు సున్నితపు త్రాసులో ఎప్పటి కప్పుడు జోకి చూసిన వామపక్షాలు తప్పనిసరై మునుగోడులో బీఆర్ఎస్‌నే బలపరిచాయి. కారణం బీజేపీని ఓడించి తెలంగాణ సమాజాన్ని ఐక్యంగా పరిరక్షించుకోవాలన్న తపనే తప్ప వేరే కాదు. అది ఎంత సరైందో ఆ తర్వాతి పరిణామాలు తెలియ చేస్తున్నాయి. బీజేపీ గ్రాఫును అది అద: పాతాళంలోకి తొక్కేసింది. ఈ నేపథ్యంలో నుంచి ప్రస్తుత ఎన్నికలను చూడాలి. అభ్యర్థులే దొరకక, నాయకుల సమన్వయం లేక, వచ్చిన వారందరూ ఎవరిదారి వారు వెతుక్కుని పోతుండగా "మేమంటూ అధికారంలోకొస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామన"డం నవ్వుకోవడానికి తప్ప నమ్మడానికి ఉపయోగపడదు. పైగా కులగణనపై నోరిప్పని పార్టీ నోట్లోంచి ఈ వాగ్దానం రావడం ఎనిమిదవ వింతే.

ఈ స్థితిలో వామపక్షాల దారెటు? అని కొందరు సందేహాలు వెలిబుచ్చినా గౌరవ ప్రదమైన మార్గమెంచుకుంది సీపీఐ(ఎం). కాంగ్రెస్ ఎరలకు చిక్కకుండా గత అనేక ఏండ్లుగా ఉద్యమాలు చేస్తూ తనకంటూ శక్తి ఉందని భావించిన స్థానాల్లో పోటీకి దిగింది. బీజేపీ బలమున్న నియోజకవర్గాల్లో దాన్ని ఓడించే శక్తి కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల్లో ఎవరికుంటే వారిని బలపరచాలని నిర్ణయించడం ఈ ఎన్నికల్లో కీలక పరిణామం. ఈ రాష్ట్రంలో బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కనీయరాదని ఆ పార్టీ అభిప్రాయం.

ఈ నేపథ్యంలో ప్రజాపోరాటాల్లో రాటుదేలిన వ్యక్తులు దాని అభ్యర్థులు. వాళ్లకు కోట్ల రూపాయల్లేవు. నోట్లు వాళు పంచరు. ఎన్నికలంటేనే డబ్బుమయమైన వేళ, వారు చేసిన పోరాటాలే పెట్టుబడిగా ఎన్నికల రంగంలోకి దూకిన ప్రజల మనుషులు వాళ్లు. కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు ఉద్యమాల్లో పాల్గొని ప్రజల కోసం జైళ్లపాలైనవాళ్లు. ప్రజల కోసం లాఠీ దెబ్బలు తిన్నవారు, మహిళా హక్కులకై నిలిచిన వారు, కుల వివక్షతో పాటు, సామాజిక అణచివేతలపై పోరాడుతున్నవారు ఆ పార్టీ అభ్యర్థులు.

అన్యాయం జరిగేటపుడు నువ్వు తటస్థంగా ఉంటే పీడకుల పక్షం వహించిన వాడివి అవుతావన్న డెస్మెండ్ టుటు మాటలు వారికి శిరోధార్యం. "ఉక్కు బాహువుల వీరులు తుఫానులు ఊదుతున్నారు. పాత లోకాన్ని భస్మం చేస్తున్నారు. కొత్త లోకాన్ని సృష్టిస్తున్నారు. కర్మాగారపు కొలిమిలో " అని గుంటూరు శేషేంద్ర శర్మ చెప్పింది సరిగ్గా నప్పేది వారికే!

కష్టజీవులకు అండ కమ్యూనిస్టులే...


ఎస్ వీరయ్య

రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. అధికారం కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు నువ్వానేనా? అన్నట్టు తలపడుతున్నాయి. నేనున్నానని చెప్పుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. గత ఐదేండ్లుగా రాష్ట్ర ప్రజలు కమ్యూనిస్టులు లేని శాసనసభను చూసారు. ఎర్రజెండా ప్రతినిధులు లేని లోటు స్పష్టంగా కనిపించింది.

శాసనసభ ప్రజాసమస్యలు చర్చించి పరిష్కార మార్గం వెతికే వేదిక కావాలి. ప్రభుత్వ విధానాల మీద లోతైన, విమర్శనాత్మక చర్చ జరగాలి. శాసనసభకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలి. తెలంగాణ శాసనసభకు జరిగిన తొలి ఎన్నికల తర్వాత, శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్ళిన సీపీఐ(ఎం) నాయకత్వ బృందంతో మాట్లాడుతూ, శాసనసభలో సుందరయ్య నెలకొల్పిన సంప్రదాయం పునరుద్ధరిస్తానని కేసీఆర్ అన్నారు. కానీ తర్వాత అందుకు పూర్తి విరుద్ధంగా జరిగింది. గత ఐదేండ్లలో ప్రజా ప్రయోజనాల ఊసే నామమాత్రమైంది. స్వార్థ రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలే ప్రధానమవుతున్నాయి. ఒకప్పుడు 30-40 రోజులు జరిగే బడ్జెట్ సమావేశాలు కూడా పట్టుమని పదిరోజులు కూడా జరగటంలేదు. తంతుగా మారింది. పదవులు, సంపాదనే లక్ష్యాలుగా ఫిరాయింపులు సర్వ సాధారణమైనాయి. పదవుల కోసం ఏ గడ్డి గరవడానికైనా సిద్ధపడే ధోరణి బలపడింది. విలువల వలువలూడుతున్న కాలం. కోట్లు ఖర్చు చేయగల్గినవారే పోటీ చేయగలరన్న స్థితి ఏర్పడింది. పేదలపక్షం నిలబడే కమ్యూనిస్టులకు ఇది పెద్ద ఆటంకం. ఫలితంగా ప్రజల పట్ల నిబద్ధత లేనివారు వ్యాపార ప్రయోజనాల కోసం శాసన సభ్యులవుతున్నారు. అధికార, ప్రతిపక్ష శాసనసభ్యుల మధ్య పరస్పర నిందారోపణలు, తిట్ల దండకాలకు శాసనసభ వేదికగా మారింది. వ్యక్తిగత విషయాలు బజారుకీడ్చే బజారు రాజకీయాలు నడుస్తున్నాయి. అధికార, ప్రతిపక్షాలన్న తేడా లేదు. ప్రతిపక్షం బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బతుకుతుందని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రతిపక్షం తన పాత్ర పోషించాలన్నా కమ్యూనిస్టులు ఉండాలి. అందుకే ఈసారి ప్రజలు తమ అభ్యర్థులను శాసనసభకు పంపాలని సీపీఐ(ఎం) కోరింది.

సహజంగానే కమ్యూనిస్టులు పేదల పోరాటాలకు అండగా ఉంటారు. నిరంతరం పేదల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారు. ఏడాదిన్నర కాలంగా, 19 జిల్లాలలో, 69 కేంద్రాలలో లక్షకు పైగా కుటుంబాలు ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్నారు. పట్టాల కోసం, ఇంటి నిర్మాణానికి సహాయం కోసం, డబల్ బెడ్రూం ఇండ్ల కోసం సీపీఐ(ఎం) నాయకత్వంలో పోరాడుతున్నారు. అంతేకాదు... మహబూబాబాద్‌లో శంకర్ నాయక్, వరంగల్ తూర్పులో నరేందర్ లాంటి శాసనసభ్యులు బహిరంగంగానే పేదల మీద దాడులు చేస్తున్నప్పటికీ, గుడిసెవాసులకు ఎర్రజెండానే అండగా ఉన్నది. ఈ కాలంలో జరిగిన వివిధ రంగాల కార్మిక పోరాటాలలో అత్యధికం కమ్యూనిస్టుల అండతోనేనన్న విషయం కూడా తెలిసిందే. బహుశా అందుకే ఇతర పార్టీలకు సీపీఐ(ఎం) మీద గుర్రుగా కూడా ఉండవచ్చు. కమ్యూనిస్టు శాసనసభ్యులే ఉంటే పోరాడే ప్రజలకు మరింత అండ దొరుకుతుంది. ప్రజా ఉద్యమాన్ని బలపరచే అభ్యర్థులను ఎన్నుకోవటం అవసరం. అంతేకాదు... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, చివరకు ధర్నాచౌక్ రక్షణ కోసం కూడా కమ్యూనిస్టులే పోరాడవల్సి వచ్చింది కదా!

బెంగాల్‌లో 34ఏండ్ల పాలన తర్వాత లెఫ్ట్ ఫ్రంట్ ఓడిపోయిన సందర్భంగా మీడియాలో విస్తృతంగా చర్చ జరిగింది. కమ్యూనిస్టు వ్యతిరేకులతో సహా ఎవ్వరూ ఆ ఫలితాలను జీర్ణించుకోలేకపోయారు. కమ్యూనిస్టులు బలహీనపడటం దేశానికి నష్టమని బహిరంగంగానే చెప్పారు. జాతీయ పత్రికలు విశ్లేషణలు కూడా చేసాయి. కమ్యూనిస్టులు బలంగా ఉన్నపుడే ఇతరులు కూడా, ఎంతోకొంత పేదల కోసం పని చేస్తారన్నారు. కమ్యూనిస్టులు బలహీనపడితే పేదల సమస్యలు పట్టించుకునే వారుండరనీ, విలువలు దిగజారుతాయనీ ఆవేదన చెందారు. ఇప్పుడదే జరుగుతున్నది. ఆర్థిక వ్యవస్థను బలంగా నిలిపిన ప్రభుత్వరంగ సంస్థలు, ప్రజాస్వామ్యం, జాతీయ సమగ్రత, మత సామరస్యం, లౌకిక విలువలు, రాష్ట్రాల హక్కులు ఈమాత్రమైనా ఉన్నాయంటే మూడు రాష్ట్రాలలో వామపక్ష ప్రభుత్వాలు, బలమైన కమ్యూనిస్టు ఉద్యమం ఉండటమే కారణమని నిర్ధారించారు. ప్రజానుకూల విధానాల ప్రాతిపదికమీద అనేక పార్టీలు కలిసి ఐక్య సంఘటన ఏర్పడితే సుదీర్ఘ కాలం సుస్థిర పాలన అందించవచ్చని కూడా వామపక్ష ప్రభుత్వాలు రుజువు చేసాయి. మెరుగైన ప్రత్యామ్నాయ విధానాలు ఆచరించి చూపాయి. ఇప్పటికీ దేశానికి కేరళ వామపక్ష ప్రభుత్వం వేగుచుక్కగా నిలిచింది. అందుకే మన రాష్ట్ర శాసనసభలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం అవసరం.

ఆర్థిక అసమానతలు, పేదరికం ఉన్న దేశంలో సంక్షేమ పథకాలు అనివార్యం. కానీ ఆ పేరుతో ప్రజలను మభ్యపెట్టి, అధికారం చేపట్టగానే పట్టించుకోకపోవటం అలవాటుగా మారింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని సంక్షేమ పథకాలు అమలు జరిపినప్పటికీ, పేదల జీవితాలమీద దీర్ఘకాలిక ప్రభావం చూపే దళితులకు మూడెకరాల సాగుభూమి, ఖాళీ పోస్టుల భర్తీ, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి, ఇండ్లు, ఇండ్లస్థలాలు వంటి వాగ్దానాలు అమలు చేయలేదు. కాంగ్రెసైనా, బీఆర్ఎస్ అయినా వీటిని ఓట్ల పథకాలుగా మార్చివేసారు. ఇక బీజేపీకి సంక్షేమ పథకాలే గిట్టవు. మతాన్ని ప్రయోగించి ఓట్లు దండుకోవచ్చని వారి నమ్మకం. అందుకే ఉచితాల పేరుతో సంక్షేమ పథకాలకు వ్యతిరేకంగా బీజేపీ నాయకుడే కేసు వేసారు. మోడీ ప్రభుత్వం కూడా దానినే సమర్థించింది.




దేశంలో బీజేపీ, మతోన్మాదాన్ని ఓడించాలన్నది వామపక్షాల ప్రధాన లక్ష్యం. ఇది అందరికీ తెలిసిందే. రాష్ట్రంలో కూడా బీజేపీ బలపడకుండా చూడాలన్న లక్ష్యంతోనే బీఆర్ఎస్‌తో సర్దుబాట్లకు ప్రయత్నించాయి. బీఆర్ఎస్ అవకాశవాద, ఏకపక్ష ధోరణితో సాధ్యపడలేదు. తర్వాత కాంగ్రెస్ అఖిలభారత నాయకత్వం కోరినమేరకు కాంగ్రెసుతో సర్దుబాట్లకు సిద్ధపడ్డాయి. కానీ చివరినిమిషం దాకా తేలకుండా నాన్చింది. తామే అంగీకరించిన వాటి నుంచి వెనక్కిపోయింది. సీపీఐ, సీపీఐ(ఎం)లను ఒక్కొక్క సీటుకు పరిమితం చేయాలని ప్రయత్నించింది. అందువల్ల సీపీఐ(ఎం) ఒంటరి పోరుకు సిద్ధపడింది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు రాష్ట్ర శాసనసభకు కమ్యూనిస్టు ప్రతినిధులను పంపించడం ఎంతైనా అవసరం.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, తెలంగాణలో కూడా బలపడాలని ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం అడ్డదారులు తొక్కడానికి వెనుకాడటం లేదు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపింది. బీఆర్ఎస్ శాసనసభ్యులను టోకుగా కొనుగోలు చేసి, ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నిందని రాష్ట్ర ప్రభుత్వం బట్టబయలు చేసింది. బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ఎరవేస్తున్నది. తానే బీసీనన్న మోడీ, ప్రధానమంత్రి అయి కూడా కులగణనను ఎందుకు నిరాకరిస్తున్నారో జవాబు లేదు. దేశంలో కార్మిక చట్టాలు రద్దు చేసారు. మూడు రైతు వ్యతిరేక చట్టాలు రుద్దేందుకు విఫలయత్నం చేసారు. ప్రజలమీద ధరాభారం మోపారు. ఆర్టీసీని ధ్వంసం చేసే విధంగా కేంద్రంలో రవాణా సవరణ చట్టం చేసారు. నిరుద్యోగం, మహిళలమీద దాడులు, కుల దురహంకార దాడులు మోడీ పాలనలో పరాకాష్టకు చేరాయి. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలన్న వాగ్దానం గాలికొదిలేసారు. అవినీతిని చట్టబద్ధం చేసారు. అదానీ, అంబానీల ప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలు పణంగా పెడుతున్నారు. సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు మతపరమైన విభజనను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. ఈ మధ్యనే రాష్ట్రంలో ఒక బహిరంగసభలో మాట్లాడుతూ, ఇక్కడ తాము అధికారంలోకి వస్తే ముస్లిం బీసీ రిజర్వేషన్లు రద్దు చేసి, హిందువులలోని బీసీలకు పంచుతామని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా రెచ్చగొట్టారు. బండి సంజయ్ పాదయాత్రను చార్మినార్ దగ్గర వివాదాస్పద స్థలం నుంచి ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్ రైలు ప్రారంభిస్తూ ప్రధాని మోడీ వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు. బీజేపీ శాసనసభ్యుడు ప్రముఖ కళాకారుడి ప్రదర్శన విషయంలో మతపరమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసారు. సినీరంగంలోని మహిళల వ్యక్తిగత జీవితాల గురించి అవమానకరంగా మాట్లాడారు. దుబ్బాక ఉప ఎన్నిక సందర్భంగా మతపరమైన భావోద్వేగాలు సృష్టించి ఓట్లు దండుకున్నారు. త్వరలో రజాకార్ ఫైల్స్ పేరుతో సినిమా విడుదల చేసి మతచిచ్చు రేపే ప్రయత్నంలో ఉన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తున్నారు.

రాష్ట్రంలో సున్నిత పరిస్థితులు తెలిసిందే. గతంలో మత ఘర్షణలు జరిగిన ప్రాంతాలున్న రాష్ట్రం మనది. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న జనజీవనంలో తమ గెలుపు కోసం బీజేపీ మత చిచ్చు పెట్టేందుకు సిద్ధపడుతున్నది. రాష్ట్రంలో ఏమాత్రం బీజేపీ బలపడినా, రాష్ట్ర ప్రజలకు, రాష్ట్ర ప్రయోజనాలకూ హాని జరుగుతుంది. అందుకే వారు ఏ ఒక్క స్థానంలోనూ గెలవకుండా చూడటం అవసరం. సీట్లే కాదు... ఓట్లు పడినా ప్రమాదమే. ఇప్పుడు తమ పార్టీ గెలవదని వారికి కూడా తెలుసు. అందుకే ఈ శాసనసభ ఎన్నికల్లో ఓట్లు చూపి, తర్వాత జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేయాలనుకుంటున్నారు. అది దేశ ప్రయోజనాలకు కూడా హానికరమే!

దేశంలో బీజేపీ, మతోన్మాదాన్ని ఓడించాలన్నది వామపక్షాల ప్రధాన లక్ష్యం. ఇది అందరికీ తెలిసిందే. రాష్ట్రంలో కూడా బీజేపీ బలపడకుండా చూడాలన్న లక్ష్యంతోనే బీఆర్ఎస్‌తో సర్దుబాట్లకు ప్రయత్నించాయి. బీఆర్ఎస్ అవకాశవాద, ఏకపక్ష ధోరణితో సాధ్యపడలేదు. తర్వాత కాంగ్రెస్ అఖిలభారత నాయకత్వం కోరినమేరకు కాంగ్రెసుతో సర్దుబాట్లకు సిద్ధపడ్డాయి. కానీ చివరినిమిషం దాకా తేలకుండా నాన్చింది. తామే అంగీకరించిన వాటి నుంచి వెనక్కిపోయింది. సీపీఐ, సీపీఐ(ఎం)లను ఒక్కొక్క సీటుకు పరిమితం చేయాలని ప్రయత్నించింది. అందువల్ల సీపీఐ(ఎం) ఒంటరి పోరుకు సిద్ధపడింది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు రాష్ట్ర శాసనసభకు కమ్యూనిస్టు ప్రతినిధులను పంపించడం ఎంతైనా అవసరం. సీపీఐ(ఎం) పోటీ చేస్తున్న స్థానాల్లో ఆ పార్టీని గెలిపించడం రాష్ట్ర ప్రయోజనాలకు అవసరం. అదే సమయంలో మతోన్మాద బీజేపీని, దాని మిత్రపక్షమైన జనసేన అభ్యర్థులను తెలంగాణ ప్రజలు తిరస్కరించాలి. ఇందుకోసం సీపీఐ(ఎం) పోటీచేయని మిగిలిన స్థానాలలో వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక, లౌకిక పోరాట శక్తులను గెలిపించాలి. ఇది తెలంగాణ భవిష్యత్తుకు కీలకమైన అంశం.

ఆర్థిక అసమానతలు, పేదరికం ఉన్న దేశంలో సంక్షేమ పథకాలు అనివార్యం. కానీ ఆ పేరుతో ప్రజలను మభ్యపెట్టి, అధికారం చేపట్టగానే పట్టించుకోకపోవటం అలవాటుగా మారింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని సంక్షేమ పథకాలు అమలు జరిపినప్పటికీ, పేదల జీవితాలమీద దీర్ఘకాలిక ప్రభావం చూపే దళితులకు మూడెకరాల సాగుభూమి, ఖాళీపోస్టుల భర్తీ, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి, ఇండ్లు, ఇండ్లస్థలాలు వంటి వాగ్దానాలు అమలు చేయలేదు. కాంగ్రెసైనా, బీఆర్ఎస్ అయినా వీటిని ఓట్ల పథకాలుగా మార్చివేసారు. ఇక బీజేపీకి సంక్షేమ పథకాలే గిట్టవు. మతాన్ని ప్రయోగించి ఓట్లు దండుకోవచ్చని వారి నమ్మకం. అందుకే ఉచితాల పేరుతో సంక్షేమ పథకాలకు వ్యతిరేకంగా బీజేపీ నాయకుడే కేసు వేసారు. మోడీ ప్రభుత్వం కూడా దానినే సమర్థించింది.



'చరిత్ర' ఎందుకిలా డీలా?

'ఎక్కడైతే చరిత్ర విస్మరించబడుతుందో...ఆ సమాజానికి గతం, భవిష్యత్తు కూడా ఉండవు' అని ప్రసిద్ధ రచయిత హిన్లీన్ అన్నాడు. ఇది అక్షరాల సత్యం. శాస్త్రీయ విజ్ఞానం పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరు ఇప్పటికే వివాదాస్పదమవుతున్నది. ఈ నేపథ్యంలో దేశ అభివృద్ధికి మూలస్తంభమైన చరిత్రను నేడు విస్మరిస్తున్నదనే విమర్శ వస్తున్నది. దానికి సాక్ష్యం నేడు చరిత్ర డీలా పడటం. కేంద్ర మానవ వనరుల శాఖ నేతత్వంలో ఎన్‌సిఇఆర్‌టి (జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలి) 1961 నుంచి దేశంలో అన్ని రాష్ట్రాల్లో మిగతా సబ్జెక్టులతో పాటు చరిత్రకీ ఉన్నత స్థానాన్ని కల్పించి బోధన సాగిస్తోంది. ఎన్‌సిఇఆర్‌టి సూచనల మేరకు ఆయా రాష్ట్రాల్లో ఎస్‌సిఇఆర్‌టి (రాష్ట్ర విద్యా శోధన, శిక్షణ సంస్థ)లు సిలబస్ తయారు చేసుకుని చరిత్రను బోధిస్తున్నాయి. ఆరంభంలో అన్ని కళాశాలలో చరిత్ర మెయిన్‌గా ఉండే హెచ్‌ఇసి గ్రూపులు విద్యార్థులతో కళకళలాడుతుండేవి. సైన్స్ కంటే ఎక్కువ విద్యార్థులు హిస్టరీ ఉన్న ఆర్ట్స్ గ్రూపుల్లోనే చేరేవారు. గతంలో 'లా' చదవాలంటే కచ్చితంగా హిస్టరీ గ్రూప్ నుంచి వెళ్లేవారు. ఇప్పుడు సైన్స్ గ్రూపుల నుంచి ఎక్కువమంది 'లా' చదువుతున్నారు. సివిల్స్, గ్రూప్స్ వంటి పరీక్షలు హిస్టరీ చదివిన వాళ్ళు ఎక్కువ ఉండేవారు. ఇప్పుడు సర్వం ఇంజనీరింగ్‌గా మారుతోంది. ఐసిహెచ్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రీసెర్చ్) సంస్థ మన దేశంలో జాతీయ స్థాయిలో చరిత్రను పరిశోధిస్తూ కొన్ని ఆధునిక విషయాలను ఎన్‌సిఇఆర్‌టి ద్వారా ఎస్‌సిఇఆర్‌టిలకు అందిస్తూ వుంటుంది. ఇది కూడా కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లో కీలుబొమ్మై రాజకీయ రంగు పులుముకుంటోందని తీవ్ర స్థాయిలో విమర్శలు రావడం మనం చూస్తూ ఉన్నాం. అలాగే ఎన్‌సిఇఆర్‌టి చరిత్రలో కొన్ని కీలక పాఠ్యాంశాలు తొలగించడం ఇటీవల దేశవ్యాప్తంగా విమర్శలకు, నిరసనలకు దారితీసింది. ఇక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చరిత్ర బోధన మీద శీతకన్ను వేస్తూనే ఉన్నాయి.

ఈ గందరగోళాల నేపథ్యంలో చరిత్ర బోధన ప్రాబల్యం కోల్పోతూ వస్తోంది. రోజురోజుకి చరిత్ర గ్రూప్ చదివే విద్యార్థుల సంఖ్య తరిగిపోతోంది. ఇప్పటికే చాలా కళాశాలల్లో చరిత్ర చదివే విద్యార్థులు లేక హిస్టరీ గ్రూపుని మూసేశారు. రాబోయే పరిణామాలను పసిగట్టిన అప్పటి కేంద్ర ప్రభుత్వం 1986లో డిగ్రీ చదివే విద్యార్థులందరికీ రెండు కంపల్సరీ సబ్జెక్టులను ప్రవేశపెట్టింది. సైన్స్ విద్యార్థులకు ఆర్ట్స్ పట్ల, ఆర్ట్స్ విద్యార్థులకు సైన్స్ పట్ల కనీస అవగాహన కోసం ఐహెచ్‌సి (భారతీయ సంస్కృతీ వారసత్వం), సైన్స్ అండ్ సివిలైజేషన్ (విజ్ఞానము, పౌరస్మృతి) సబ్జెక్టులు కచ్చితంగా బోధించి తీరాలని నిబంధన పెట్టింది. 2020 తర్వాత నుంచి ఇది 'ఇండియన్ కల్చర్ అండ్ సైన్స్' పేరిట ఏక సబ్జెక్టుగా మారింది. ఇంతవరకు బానే ఉంది. దీన్ని ఐచ్ఛిక సబ్జెక్టుగా పరిగణించడంతో కొందరే ఈ సబ్జెక్ట్‌ని ఎంచుకుంటున్నారు. దీంతో హిస్టరీ ఉనికిపై మరో రాయి పడింది. సాఫ్ట్‌వేర్ మోజులో విద్యార్థులు సాధారణ డిగ్రీల కంటే బిటెక్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో ఇంజనీరింగ్ చదువుల ముందు చరిత్ర డీలా పడుతోంది. సైన్సు, ఆర్ట్స్, ఇంజనీరింగ్ ఇలా చదువుకునే వారందరికీ చరిత్ర పరిజ్ఞానం చేరాలంటే... తెలుగు, ఇంగ్లీష్ లాంగ్వేజ్ మాదిరిగా హిస్టరీని కూడా ఒక కంపల్సరీ సబ్జెక్టుగా నేర్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆధునిక సాంకేతిక యాంత్రిక యుగంలో మానవుడు చంద్రుడు మీదకు సైతం దూసుకుని వెళ్తూ ఉంటే జరిగిపోయిన గతాన్ని తవ్వుకుంటూ చరిత్ర ఎందుకు? అనే విమర్శలు లేకపోలేదు. ఒకవైపు పెత్తందారులు, కార్పొరేట్ సంస్థలు, దళారులు చేతికి అందింది దోచుకుంటున్నారు. ఎంత కష్టపడ్డా రైతులకు, శ్రామికులకు పూట గడవడం కష్టంగా మారిపోతుంది. సమాజంలో అంతరాలు పోయి సమ సమాజ స్థాపన జరగాలి అంటే దానికి చరిత్ర ఒక సాధనం. సాంఘిక శాస్త్రాన్ని (సోషల్ సైన్సెస్) చదవడం వల్ల, తెలుసుకోవడం వల్ల ఒక పరిణితి గల సమాజం ఏర్పడుతుంది. అమెరికన్ ప్రముఖ రచయిత్రి పెరల్.ఎస్.బక్ ఏమన్నారంటే... 'ఇవాళ్టి గురించి నీవు అన్వేషించాలనుకుంటే కచ్చితంగా నీవు నిన్నటి గురించి తెలుసుకుని ఉండాలి'. గతం అంటే... చరిత్ర ఎప్పుడూ కూడా గొప్పదే. 'గతం పునాదుల మీదే వర్తమానం నడుస్తుంది, భవిష్యత్తు నిర్మితమవుతుంది'. ఇదే చరిత్ర మూల సిద్ధాంతం.

భవిష్యత్ సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూర్చే చరిత్ర సబ్జెక్టుకు కళాశాలల్లో పూర్వ వైభవం దక్కాలంటే ప్రభుత్వాలు కచ్చితంగా ప్రత్యేకదష్టి సారించాలి. చరిత్ర చదువుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలి. పురావస్తు శాఖ, పర్యాటకం, అటవీ శాఖ, పోలీసు శాఖ తదితర రంగాల్లో హిస్టరీ విద్యార్థులకు ప్రాధాన్యత కల్పించాలి. కాంట్రాక్ట్, ప్రైవేట్ బోధకులతో కాకుండా నిష్ణాతులైన రెగ్యులర్ లెక్చరర్లను నియమించి కళాశాలల్లో వారితో పాఠ్యాంశాలు బోధించేటట్టు చూడాలి. ప్రభుత్వ కళాశాలల్లో హిస్టరీ గ్రూప్ నడుపుతూ వాటిలో విద్యార్థులు చేరేలా ప్రభుత్వం ప్రచారం కల్పించాలి. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల్లో కూడా కచ్చితంగా హిస్టరీ గ్రూపులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. హిస్టరీ స్కాలర్లని కూడా పెంచాలి. హిస్టరీ, సైన్స్ సబ్జెక్టుల కాంబినేషన్‌తో కొత్త గ్రూపులు ఏర్పాటుచేసి విద్యార్థులకు దగ్గర చేయాలి. హిస్టరీ ప్రాభవాన్ని, అవసరాన్ని తెలిపి విద్యార్థుల్లో చరిత్ర చదవడానికి ఆసక్తి రేకెత్తించాలి.

- చిలుకూరి శ్రీనివాసరావు
సెల్: 8985945506



ఎర్రి మెదల్లు మానై

అల్లు రాజ్యమేల అదుకున్నట్లు నటిస్తే
మన మీద పెద్దిరికం చేయ్య
ఒకొడు కాకపోతే ఇంకొకడికి
గులాం జేయ్య సిద్ధమయ్యే బతుకులు మానై

అల్లా తియ్యటి మాటలకు
పెదాల మీద ఆడిచ్చే సూక్తులకు
తడి బట్టలతో గొంతు గోసుకున
లైండ్లు కట్టే పోకడలు మానై

బజ్జీలు జోకి గడ్డి గోరిగిన
మనల్ని అధికార గుమ్మం అవల్నే
నిల్బుండ పెడుతున్న
అయినా అల్లకోసామే
మన జాతుల్ని అంగవెట్టే ఆత్రుతలు మానై
పొసే పెగ్గులకు, పడేసే బొక్కలకు
తోకడిచ్చే రీతులు మానై

అల్లా టైం పాస్ మాటల యుద్ధాలకు
అడ్డం పొడులు సుపిచ్చుకుంటు
తొడలు గోట్టి
తన్నుకు సచ్చే పౌరుషలు మానై

అల్లా సుఖలకోసం
మనకే తెలకుంట
మన రక్తమాంసాలు అండుకోని తింటున్న
నాంజుకోవడనికి
మనోల్లా మెదడుని కాల్సి దొల్లల ఏసి ఇచ్చే
పీస మనుసులు మానై

మన ఎర్రి మెదల్లకు ఇగురం అచ్చే దాక
సోయిదప్పి పన్న చైతన్యానికి చలనం
అచ్చేదాక
బాంచెన్ బతుకుల్లో మార్పులు జార్గై

- జి.యం.నాగేష్ యాదవ్
9494893625

అదానీ బొగ్గు కుంభకోణం-మోడీ మౌనపాత్ర

గత రెండు దశాబ్దాలుగా, బొగ్గు సంబంధిత అవినీతి కథనాలను భారతదేశం చూసింది. 2014లో యుపిఎ-2 ప్రభుత్వం పతనం కావడానికి, బీజేపీ ప్రభుత్వం ఏర్పడడానికి ప్రధాన కారణం బొగ్గు గనుల కుంభకోణం. ఇప్పుడు మోడీ ప్రభుత్వ హయాంలో మరో బొగ్గు కుంభకోణం బయటపడింది. మోడీకి అత్యంత నమ్మకస్తుడైన గౌతమ్ అదానీ దిగుమతి చేసుకున్న బొగ్గు ధరను అత్యంత ఎక్కువగా చూపించి...వేల కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడిన కథనాన్ని 'ఫైనాన్షియల్ టైమ్స్' వార్తాపత్రిక బయటపెట్టింది.

అదానీ దిగుమతి చేసుకున్న బొగ్గును వాస్తవ మార్కెట్ ధర కంటే రెండింతలు పెంచి దేశంలోని థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు అధిక ధరలకు విక్రయించడం వెనుక ఉన్న వాస్తవాలను ఈ పత్రిక వెల్లడించింది. భారతీయ కస్టమ్స్ పత్రాలలో పేర్కొన్న వివరణాత్మక విశ్లేషణను ప్రచురించింది. ఫైనాన్షియల్ టైమ్స్ ప్రకారం, భారత దేశంలో విద్యుత్ వినియోగదారుల నుండి అధిక చార్జీలు వసూలు చేయడం వల్ల కలిగే నష్టం రూ.12వేల కోట్లు దాటుతుంది. అయితే అదానీ గ్రూప్ దీనిని ఎప్పటిలానే కొట్టిపారేసింది. ఇక, భారత దేశంలోని మీడియా అయితే అలాంటి వార్తాపత్రిక ఒకటి వున్నదన్న విషయమే తెలియదన్నట్లుగా వ్యవహరించింది.

అదానీ గ్రూప్ గత ఏడేళ్లుగా ఇండొనేషియా నుంచి పెద్ద మొత్తంలో బొగ్గును దిగుమతి చేసుకుంటోంది. దుబాయ్, తైవాన్, సింగపూర్‌లోని మధ్యవర్తుల ద్వారా బొగ్గు దిగుమతి అవుతుంది. 2019 నుండి 2021 వరకు జరిగిన 30 రవాణా రికార్డులను ఆ పత్రిక పరిశీలించింది. ఇండొనేషియా నుంచి కొనుగోలు చేసిన వాస్తవ ధర కంటే మూడింతలు ఎక్కువ ధరకు భారత ఓడరేవుల్లో దింపినట్లు స్పష్టమవుతోంది. ఈ రవాణా రికార్డుల విషయమే తీసుకుంటే....అదానీకి ఏడు కోట్ల డాలర్ల అదనపు లాభం వచ్చిందని స్పష్టమవుతోంది. అంటే టన్నుకు 25-30 డాలర్ల చొప్పున ఇండొనేషియాలో లోడ్ చేసిన బొగ్గును భారత నౌకాశ్రయాలలో దించాక...65 నుంచి 80 డాలర్ల మధ్య ఉన్నట్లు చూపారు. అదానీ కంపెనీ బొగ్గును ఆ ధరకు భారతదేశంలోని ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలోని థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, ఇతర కంపెనీలకు విక్రయించింది. దీనివల్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఉత్పత్తి వ్యయం పెరిగి... సరఫరా చేసే విద్యుత్ రేటు కూడా వాటికనుగుణంగా పెరగాల్సి ఉంది. అదానీ ఖజానాకు కోట్లాది రూపాయలు వచ్చాయిగానీ విద్యుత్ వినియోగదారులు మాత్రం దారుణంగా దోపిడీకి గురయ్యారు.



అదానీ గ్రూప్ గత ఏడేళ్లుగా ఇండొనేషియా నుంచి పెద్ద మొత్తంలో బొగ్గును దిగుమతి చేసుకుంటోంది. దుబాయ్, తైవాన్, సింగపూర్‌లోని మధ్యవర్తుల ద్వారా బొగ్గు దిగుమతి అవుతుంది. 2019 నుండి 2021 వరకు జరిగిన 30 రవాణా రికార్డులను ఆ పత్రిక పరిశీలించింది. ఇండొనేషియా నుంచి కొనుగోలు చేసిన వాస్తవ ధర కంటే మూడింతలు ఎక్కువ ధరకు భారత ఓడరేవుల్లో దింపినట్లు స్పష్టమవుతోంది. ఈ రవాణా రికార్డుల విషయమే తీసుకుంటే... అదానీకి ఏడు కోట్ల డాలర్ల అదనపు లాభం వచ్చిందని స్పష్టమవుతోంది.

ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, ఈ విషయంలో ఫిర్యాదు రావడంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) 2016లో దర్యాప్తు ప్రారంభించింది. విచారణలో భాగంగా డిఆర్ఐ పలు కంపెనీలకు నోటీసులు జారీ చేయగా.. 50 నుంచి 100 శాతం మేర ధరలు పెంచినట్లు గుర్తించారు. ఈ కుంభకోణం జరిగిన పద్ధతి ఏమిటంటే, అధిక ధర కలిగిన ఇన్‌వాయిస్‌లను సిద్ధం చేసి, ఇండొనేషియా నుండి బొగ్గును భారతదేశానికి డెలివరీ చేయడం, అది మూడవ దేశంలోని ఏజెన్సీ ద్వారా వచ్చినట్లు చూపడం. అయితే, ధర లెక్కింపు విషయంలో సుప్రీంకోర్టు తమకు అనుకూలమైన తీర్పు నిచ్చిందని అదానీ గ్రూప్ పేర్కొంది. ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక ఒక సంఘటనను స్పష్టంగా వివరిస్తుంది. జనవరి 2019లో 74,820 టన్నుల బొగ్గుతో ఇండొనేషియా నుండి ఓడ బయలుదేరింది. ఇండొ నేషియాలో దీనిధర 1.9 మిలియన్ డాలర్లు. అయితే, ఈ నౌక గుజరాత్‌లోని ముంద్రాలో ఉన్న అదానీ సొంత ఓడ రేవుకు చేరుకోగానే చూపిన ధర 4.3 కోట్ల డాలర్లు! బొగ్గును డిఎల్ అకాసియాలో తీసుకొచ్చారు. ఫైనాన్షియల్ టైమ్స్ ప్రకారం, ఆ సంవత్సరంలో అటువంటి సరుకు రవాణా 30సార్లు జరిగినట్లు రికార్డులు చూపిస్తున్నాయి. బీమా, ఇతర నిర్వహణ ఖర్చులతో సహా మొత్తం దాని విలువ 142 మిలియన్ డాలర్లు. అయితే, భారత కస్టమ్స్‌కు సమర్పించిన పత్రాల్లో చూపించిన ధర 215 మిలియన్ డాలర్లు. ఆ విధంగా అదానీ గ్రూప్ భారత్‌లో బొగ్గును అత్యధిక ధరకు విక్రయించి లబ్ది పొందుతోంది.

తైపీలోని 'హై లింగోస్', దుబాయ్‌లోని 'తారస్ కమోడిటీస్ జనరల్ ట్రేడింగ్', సింగపూర్‌లోని 'పాన్ ఆసియా ట్రేడ్ లింక్' ఈ వ్యాపారంలో అదానీ గ్రూప్‌కు మధ్యవర్తులుగా వ్యవహరించాయి. వీటిలో కొన్ని కంపెనీలు అదానీ గ్రూప్‌కి చెందిన బినామీ కంపెనీలని వార్తలు వచ్చాయి. దుబాయ్‌లో ఉన్న ఈ కంపెనీలను గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నడిపాడు. అతని రహస్య కార్యకలాపాలను హిండెన్‌బర్గ్ నివేదిక కూడా ప్రస్తావించింది. కస్టమ్స్ రికార్డుల ప్రకారం, అదానీ గ్రూప్ సెప్టెంబర్ 2021 నుండి జులై 2023 వరకు 2,000 నౌకల బొగ్గును దిగుమతి చేసుకుంది. ఈ పద్ధతిలో 7.3 కోట్ల టన్నుల బొగ్గు భారతదేశానికి చేరుకుందని కస్టమ్స్ పేర్కొంది. కస్టమ్స్‌కు అదానీ అందించిన పత్రాల ప్రకారం టన్నుకు సగటున 130 డాలర్ల చొప్పున బట్వాడా చేసినట్లు వెల్లడవుతోందని ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. విదేశాల్లో దీని సగటు ధర 60-65 డాలర్లు మాత్రమే.


2016లో ఈ విధంగా రూ.30వేల కోట్లు పెంచినట్లు డిఆర్ఐ అంచనా వేసింది. అప్పటి నుంచి ఆ దిశగా పెద్దగా పరిశోధనలు జరగలేదు. కస్టమ్స్ పత్రాలు, అనేక రకాల సమాచారాల ఆధారంగా జర్నలిస్టులు డాన్ మాక్రామ్, డేవిడ్ షెపర్డ్, మాక్ హార్లో రూపొందించిన కథనం అక్టోబర్ 12న ఫైనాన్షియల్ టైమ్స్‌లో ప్రచురితమైంది. వాస్తవానికి, ఈ నివేదిక వెల్లడించింది గోరంత మాత్రమే. ఏండ్ల తరబడి మోడీ నీడలో అదానీ సాగిస్తున్న ఈ వ్యాపారంలో లక్షల కోట్ల రూపాయల లావాదేవీలు దాగి ఉన్నాయి. ఈ వార్త వెలువడినప్పుడు, అదానీ గ్రూప్ సరైన సమాధానం ఇవ్వకుండా, అందులో పేర్కొన్న ఆరోపణలను తిరస్కరిస్తూ పత్రికా ప్రకటనను మాత్రమే విడుదల చేసింది. నరేంద్ర మోడీ మామూలుగా మౌన బాబా పాత్ర పోషిస్తున్నారు.

- జార్జ్ జోసెఫ్

ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్

ఈ ఏడాది జనవరిలో ఎన్నికల బాండ్ల విక్రయం వాయిదా

- ఆర్టీఐ కింద కేంద్రం వ్యవహార శైలి బహిర్గతం



న్యూఢిల్లీ : షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది జనవరిలో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎలక్టోరల్ బాండ్ల విక్రయాన్ని వాయిదా వేసింది. సాధారణ నెల మొదటి సగం నుంచి రెండవ సగం వరకు బాండ్ల విక్రయం జరగాలి. అయితే, బాండ్ల అమ్మకం మూడు ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నికలకు దగ్గరగా ఉంచాలనే లక్ష్యంతోనే కేంద్రం ఇలా చేసిందని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద వెల్లడైంది. త్రిపురలో ఫిబ్రవరి 16న, మేఘాలయ, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27న ఎన్నికలు జరిగాయి. ఎలక్టోరల్ బాండ్ల పథకం జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్‌లలో ఒక్కొక్కటి 10-రోజుల విండోలను కలిగి ఉంటుంది. అలాగే అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల సంవత్సరంలో వరుసగా 15, 30 రోజుల అదనపు విండోలను కలిగి ఉంటుంది. నవంబర్ 7న పారదర్శకత ప్రచారకర్త కమోడోర్ లోకేశ్ కె. బాత్రా (రిటైర్డ్) పొందిన ఆర్థిక వ్యవహారాల శాఖ ఫైళ్ల ప్రకారం.. ఈ ఏడాది కూడా అధికారులు మొదటగా "ప్రస్తుత పద్ధతి" ప్రకారం జనవరి 1-10 మధ్య విక్రయాలను ప్రతిపాదించారు.డిసెంబరు 21, 2022న డిప్యూటీ డైరెక్టర్ మమత ప్రకారం.. "ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం, త్రైమాసికంలో మొదటి 10 రోజులలో సాధారణంగా ఎలక్టోరల్ బాండ్‌ల జారీకి విండో అందుబాటులో ఉంటుంది. అయినప్పటికీ నోటిఫికేషన్‌లో జారీ తేదీలు పేర్కొనబడలేదు" అని వివరించబడింది. "మూడు ఈశాన్య రాష్ట్రాల రాష్ట్ర శాసనసభలకు ఫిబ్రవరిలో ఎన్నికలు జరగవచ్చు. జనవరి మొదటి 10 రోజుల్లో ఎన్నికల బాండ్లను జారీ చేయడానికి బదులుగా బాండ్లను జనవరి 19 నుంచి 28 జనవరి వరకు జారీ చేయవచ్చు. అంటే, ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు దగ్గరగా.." అని ఆర్థిక వ్యవహారాల సెక్రెటరీ అజయ్ సేథ్ వ్రాసి, ఆమోదం కోసం ఫైలును కేంద్ర ఆర్థిక మంత్రికి సమర్పించారని సమాచారం. అందుకు అనుగుణంగానే సేల్ విండో చివరికి జనవరి 19 నుంచి జనవరి 28 వరకు తెరవబడటం గమనార్హం. అలాగే, 2020 అక్టోబర్‌లో బీహార్ ఎన్నికలకు ప్రచారం జరుగుతున్నందున ఎలక్టోరల్ బాండ్ల విక్రయానికి విండో అక్టోబర్ 19-28కి జరపబడింది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 61,090	▲	330
22 క్యారెట్లు	- 56,000	▲	300
కిలో వెండి	- 77,000	▲	800



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 99
రిటైల్ (లైవ్)	రూ. 121
స్కిన్‌తో	రూ. 175
స్కిన్‌లెస్	రూ. 200



కోల్‌కతా: ఇజ్రాయిల్-హమాస్ వివాదం మధ్య పాలస్తీనియన్లకు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ నేషనల్ ఇంటెగ్రిటీ సభ్యులు సంఘీభావాన్ని తెలియజేస్తూ ర్యాలీ



పాట్నా: దీపావళి పండుగకు తమ స్వగ్రామాలకు వెళ్తుండగా కిక్కిరిసిన రైలు.



గాజా..ఇజ్రాయిల్ వైమానికదాడి అనంతరం విధ్వంసం



గౌతమ్ బుద్ధ నగర్: నగర్‌లోని ఫుట్‌పాత్‌లోని తన స్టాల్‌లో దండలు తయారు చేస్తున్న విక్రేత



ఖాట్మండు: 'ఫేస్‌బుక్‌లో కార్డియోవాస్కులర్ హెల్త్ అవేర్‌నెస్ లైవ్ స్ట్రీమ్ కోసం ఎక్కువ మంది వీక్షకులు' చూసిన వైద్యులుగా సీనియర్ కార్డియాలజిస్ట్ డా. ఓం మూర్తి అనిల్ కి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్.



టర్కీ దక్షిణ టర్కీలో యూఎస్ రాయబార కార్యాలయం వెలుపల పాలస్తీనియన్లకు తమ సంఘీభావాన్ని తెలియజేస్తూ భారీ నిరసన

హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ కూటమి జయకేతనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో ఎస్ఎఫ్ఐ జెండా రెపరెపలాడింది. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ-ఏఎస్ఏ-టీఎస్ఎఫ్ కూటమి జయకేతనం ఎగురవేసింది. ప్రగతిశీల శక్తులు, అభ్యుదయ భావాలకే విద్యార్థులు పట్టం కట్టారు. మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు నుంచి ఎస్ఎఫ్ఐ కూటమి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అన్ని పోస్టులనూ ఎస్ఎఫ్ఐ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో మతోన్మాద ఏబీవీపీకి ఘోర పరాభవం ఎదురైంది. విశ్వవిద్యాలయాల్లో మతోన్మాద రాజకీయాలకు తావులేదని విద్యార్థులు మరోసారి నిరూపించారు. ఎన్ఎస్‌యూఐ, డీఎస్‌యూ కూటములు ప్రభావాన్ని చూపలేకపోయాయి. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షునిగా ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి అతీక్ అహ్మద్ ఘనవిజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా జె ఆకాశ్, ప్రధాన కార్యదర్శిగా దీపక్ కుమార్ ఆర్య, సంయుక్త కార్యదర్శిగా లావుడి బాల ఆంజనేయులు, సాంస్కృతిక కార్యదర్శిగా సమీన్ అక్తర్, క్రీడల కార్యదర్శిగా అతుల్ గెలుపొందారు. ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థులందరూ ఘనవిజయం సాధించడంతో అక్కడ సంబురాలు అంబరాన్నంటాయి. అతీక్ అహ్మద్‌తోపాటు గెలిచిన ఇతర అభ్యర్థులను విద్యార్థులు ఎత్తుకుని హెచ్‌సీయూ ప్రాంగణమంతా నినాదాలతో ఊరేగించారు. ఈ సమయంలో ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏ, టీఎస్ఎఫ్ జెండాలు రెపరెపలాడాయి. డప్పు, బ్యాండ్ బాజాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. 'ఇంక్విలాబ్ జిందాబాద్, ఎస్ఎఫ్ఐ జిందాబాద్, ఏబీవీపీ ముర్దాబాద్, విశాల భారతదేశమంతటా ఎస్ఎఫ్ఐదే విజయబావుటా'అన్న నినాదాలతో ఆ ప్రాంగణమంతా మార్మోగిపోయింది.

అతీక్ అహ్మద్‌కు 471 ఓట్ల మెజార్టీ

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి నుంచి అధ్యక్షునిగా పోటీ చేసిన అతీక్ అహ్మద్‌కు 1880 ఓట్లు వచ్చాయి. ఏబీవీపీ కూటమి నుంచి అధ్యక్షునిగా పోటీ చేసిన షేక్ ఆయేషాకు 1409 ఓట్లు, డీఎస్‌యూ నుంచి పోటీ చేసిన ఉమేష్ అంబేద్కర్‌కు 424 ఓట్లు, ఎన్ఎస్‌యూఐ నుంచి పోటీ చేసిన అమల్ జోస్ ఫిలిప్‌కు 345 ఓట్లొచ్చాయి. దీంతో ఏబీవీపీ కూటమి అభ్యర్థి ఆయేషాపై ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి అతీక్ అహ్మద్ 471 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. ఎస్ఎఫ్ఐ-ఏఎస్ఏ-టీఎస్ఎఫ్ కూటమి నుంచి ఉపాధ్యక్షునిగా పోటీ చేసిన జల్లి ఆకాశ్‌కు 1,671 ఓట్లు, ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన దీపక్ కుమార్ ఆర్యకు 1,765 ఓట్లు, సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసిన లావుడి బాల ఆంజనేయులుకు 1,775 ఓట్లు, సాంస్కృతిక కార్యదర్శి షమీమ్ అక్తర్ షేక్‌కు 1,656 ఓట్లు, క్రీడల కార్యదర్శిగా పోటీ చేసిన అతుల్‌కు 1,642 ఓట్లు వచ్చాయి. వారంతా ఏబీవీపీ కూటమి అభ్యర్థులపై గెలుపొందారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ హర్షం

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏ, టీఎస్ఎఫ్ కూటమి అభ్యర్థులందరూ ఘన విజయం సాధించడం పట్ల ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. గెలుపొందిన వారికి అభినందనలు తెలిపింది. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో మతోన్మాద ఏబీవీపీ కూటమిని విద్యార్థులు మట్టికరిపించారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. ఈ విజయం కోసం కృషి చేసిన విద్యార్థులకు ధన్యవాదాలు ప్రకటించారు. ఈ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియను వారు అక్కడే ఉండి పర్యవేక్షించారు. విజయోత్సవంలో భాగస్వాములయ్యారు.

బీఆర్ఎస్‌లోకి వలసలు...

- కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల నుంచి చేరికలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్‌లో వివిధ పార్టీల నుంచి నాయకులు చేరారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ మానవతా రాయ్, నాయకులు నోముల ప్రకాష్ రావు, జగదీశ్వర్, ప్రవీణ్ లాలా, యండీ షాకీర్ (కుత్బుల్లాపూర్) బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్థన్ రెడ్డి (మెదక్), బీయస్పీ దేవరకొండ ఇన్‌ఛార్జి రమావత్ రమేష్ నాయక్, పీఏ పల్లి మండలం అధ్యక్షులు ధర్మపురం శ్రీనివాస్ గులాబీ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అరాచక రాజకీయం జరుగుతోందనీ, ఆర్థిక తీవ్రవాదం నడుస్తున్నదనీ, టికెట్లను అమ్ముకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ గొంతుక కేసీఆర్‌ను ఖతం చేసేందుకు ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గమనించాలని కోరారు. నేతన్నలకు అనేక పథకాలు తెచ్చామనీ, మళ్లీ అధికారంలోకి వచ్చాక వారికి మరింత అండగా ఉంటామని చెప్పారు.

దేశ వినాశకశక్తి బీజేపీ





నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న పాలడుగు భాస్కర్, భూక్యా వీరభద్రం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీ దేశ వినాశకర సిద్ధాంతాన్ని ఎదుర్కొనేందుకే బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధపడ్డాం కానీ అవేదో దేశ ఉద్ధారక పార్టీలు అని కాదని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల్లో మద్దతు ఇవ్వాల్సిందిగా కేసీఆర్ కోరితే బీజేపీని వ్యతిరేకించే శక్తులుగా సపోర్టు చేశామన్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ గెలిచి ఉంటే ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిన నాయకులంతా బీజేపీలో జాయిన్ అయ్యేవారన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) మధిర, వైరా నియోజకవర్గాల అభ్యర్థులు పాలడుగు భాస్కర్, భూక్యా వీరభద్రం నామినేషన్ల సందర్భంగా నిర్వహించిన ర్యాలీలతో మధిర, వైరా పట్టణాలు ఎరుపెక్కాయి.

వేలాదిమంది స్వచ్ఛందం గా తరలివచ్చి ప్రదర్శనలో భాగమయ్యారు. భారీ జన సందోహంతో వెళ్లి పాలడుగు భాస్కర్, భూక్యా వీరభద్రం నామినేషన్లు సమర్పించారు. ఈ సందర్భ ంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో తమ్మినేని మాట్లాడారు. ఇప్పుడు బలమైన నాయకుడిగా కాంగ్రెస్ చెబుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎర్రజెండా భిక్షతోనే బలపడిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎర్రజెండాదే మళ్లీ.. అనే విశ్వాసంతో ముం దుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రధాని పదవినే కాలిగోటితో సమానంగా చూసిన సీపీఐ (ఎం)కు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవులు ఇస్తామనడం హాస్యాస్పదమన్నారు. విఫలమైన పొత్తులకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లే బాధ్యత వహించాలని సూచించారు. రాజ్యాంగాన్ని, సకల ఆస్తులను బీజేపీ కాంటాల్లో పెట్టి అమ్మేస్తుందని విమర్శించారు. బోడేపూడి వెంకటేశ్వరరావు, కట్టా వెంకట నరసయ్య వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ వైరా, మధిర సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

దేశం గురించి మాట్లాడే ఏకైక జెండా ఎర్రజెండా : బి. వెంకట్

దేశం గురించి మాట్లాడే ఏకైక జెండా ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. తెలంగాణలో ఒక్క అసెంబ్లీ స్థానంలో కూడా బీజేపీని గెలవనీయమని ప్రతినబూనాలని తెలిపారు. బోడేపూడి నిర్మించిన మధిరలో సీపీఐ(ఎం) బలమేంటో చూపించాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాలో ఎర్రజెండాలు లేకుండా చేయాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్లు, అవకాశవాదులు, డబ్బు సంచులతో వచ్చే వారికి ఎర్రజెండాలు అంటే ఏమిటో చూపిస్తామన్నారు.

కాంగ్రెస్, టీఆర్ఎస్ అవకాశవాద పార్టీలు: సాయిబాబు

కేసీఆర్ హ్యాట్రిక్ కోసం, కాంగ్రెస్ ఒకసారి అవకాశం ఇవ్వమంటూ వేడుకుంటున్నాయని.. ఈ అవకాశవాద పార్టీలకు బుద్ధి చెప్పేలా ఎన్నికల్లో ఎర్రజెండాలను గెలిపించాలని సీపీఐ(ఎం) జాతీయ నాయకులు సాయిబాబు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటాల్లో సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క ఎక్కడున్నాడని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇవ్వని, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించని బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు.

30 ఏండ్ల ముందే బోడేపూడి సుజల ప్రవంతి: పోతినేని సుదర్శన్

కేసీఆర్ మిషన్ భగీరథ కంటే 30 ఏండ్ల ముందే బోడేపూడి సుజల ప్రవంతి పథకంతో వైరా, మధిర నియోజకవర్గాల్లోని 106 గ్రామాలకు మంచి నీటిని పంపిణీ చేసిన ఘనత సీపీఐ(ఎం)దేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తెలిపారు. 2.5 ఎకరాల సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు ఉంటే దానిలో లక్ష ఎకరాల చివరి భూములకు బోడేపూడి కృషి ఫలితంగా నీరందిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా అభివృద్ధి చేసి చూపించామన్నారు.

కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, రాష్ట్ర నాయకులు జె. వెంకటేష్, మధు, రాజారావు, వంగూరి రాములు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐలూ రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, కల్యాణం వెంకటేశ్వర్లు, చింతల చెరువు కోటేశ్వరరావు, నాయకులు బండి పద్మ, వాసిరెడ్డి వరప్రసాద్, మండవ ఫణీంద్ర, భట్టు పురుషోత్తం, ఎర్ర శ్రీనివాస్, విష్ణు, దివ్వెల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల విరాళాలు

కష్టజీవులు చెమట చుక్కలతో తడిసిన డబ్బులను సీపీఐ(ఎం) ఎన్నికల నిధికి విరాళంగా ఇచ్చారు. కార్మిక ఉద్యమనేత పాలడుగు భాస్కర్‌కు రూ.3 లక్షల వరకు కష్టజీవులు విరాళంగా ఇచ్చారు. ఓ యాచకురాలు సైతం తన రోజు సంపాదన రూ. 100ను విరాళంగా ఇవ్వటం గమనార్హం. అనేక ట్రేడ్ యూనియన్లు, అసంఘటిత రంగ కార్మికులు, సీపీఐ (ఎం) శాఖలు, ఇలా వందలాది మంది ఒక్కొక్కరు రూ.100 నుంచి రూ.50 వేల వరకు విరాళంగా ఇచ్చారు.

కేసీఆర్ ఇంటికే..

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన తొమ్మిదన్నర ఏండ్లలో రూ.125 లక్షల కోట్ల అప్పుచేసి దేశాన్ని దివాళా తీయించారని విమర్శించారు. బీజేపీ నాయకులు మోడీని నమ్ముకొని ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, మోడీ చరిష్మా ఎక్కడా పని చేయదన్నారు. కర్నాటక ఎన్నికల సమయంలో బీజేపీ.. 40 బహిరంగ సభలు, భారీ ర్యాలీలు.. ఎక్కడెక్కడ నిర్వహించిందో.. అక్కడ కాంగ్రెస్ పార్టీకి అధిక ఓట్లు వచ్చాయని గుర్తుచేశారు. నాలుగు రాష్ట్రాల్లో బీసీలను ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ తరపున ఇచ్చిన 5 గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసి చూపిస్తామని స్పష్టంచేశారు.

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కామారెడ్డికి బూచోడు వస్తున్నాడని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. గెలిపిస్తే కామారెడ్డిని బంగారు తునక చేస్తానని కేసీఆర్ అంటున్నారని, బంగారం చేయడం కాదు కదా పచ్చని పొలాలున్న భూములను లాక్కుంటాడని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తనను నోటుకు ఓటు కేసులో ఇరికిచ్చి జైలు పాలు చేసింది కేసీఆర్ అని, అలాంటి వ్యక్తిని ఎవరూ నమ్మొద్దని తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలోని కోనాపూర్ తాను పుట్టిన ఊరన్న సంగతి ఎన్నికల సమయంలోనే కేసీఆర్‌కు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ తనను మూడోసారి సీఎం చేయమని అడుగుతున్నారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చినందుకా, 17 సార్లు పరీక్షలు నిర్వహించి పేపర్ లీకేజీ చేసినందుకా, భూములను కబ్జాలు చేస్తున్నందుకా, ఇసుక మాఫియాను నడిపిస్తున్నందుకా.. దేనికోసమని ప్రశ్నించారు. కామారెడ్డి నుండి కేసీఆర్ గెలిస్తే కామారెడ్డి ప్రజలు నష్టపోతారని ఆలోచించిన షబ్బీర్ అలీ, కాంగ్రెస్ అధిష్టానం నన్ను కామారెడ్డి నుంచి పోటీ చేయమని కోరితే ఇక్కడికి వచ్చానని తెలిపారు. కేసీఆర్‌కు పోటీ చేయాలనుకుంటే బీసీ వ్యక్తి గంప గోవర్ధన్ ఉన్న కామారెడ్డి నియోజకవర్గమే కనిపించిందా? కొడుకు ఉన్న సిరిసిల్ల, అల్లుడు ఉన్న సిద్దిపేట కనిపించలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కాళేశ్వరం 21, 22 ప్యాకేజీలను తొందరగా పూర్తి చేసి 3.60 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామన్నారు.

రేవంత్ రెడ్డి నామినేషన్‌కు కేసీఆర్ పూర్వీకుల గ్రామస్తుల విరాళం

నవతెలంగాణ - హైదరాబాద్

కేసీఆర్ పూర్వీకుల గ్రామమైన కొనాపూర్‌కు చెందిన ప్రజలు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కోసం విరాళాలు అందచేశారు. ఈ విరాళాన్ని రేవంత్ రెడ్డి తన నామినేషన్ పత్రాల సమర్పణకు వినియోగించటం విశేషం.

ముగిసిన నామినేషన్ల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

రిటర్నింగ్ కార్యాలయాల ఆవరణలో ఉన్న అభ్యర్థులందరి నామినేషన్లను స్వీకరించారు. దీనితో కొన్ని నియోజకవర్గాల్లో రాత్రి 7 గంటల తర్వాత కూడా నామినేషన్ల స్వీకరణ జరుగుతూనే ఉంది. దీనికి సంబంధించిన తుది సమాచారం రావడానికి మరింత సమయం పడుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ రాత్రి పది గంటల సమయంలో మీడియాకు తెలిపారు.

గజ్వేల్‌లోనే అత్యధికం...

ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. 'ధరణి' వల్ల నష్టపోయిన ఇక్కడి రైతులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు కేసీఆర్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. గురువారంనాటికే ఇక్కడ 43 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం మరికొందరు ఇదే కారణంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పసుపు బోర్డు కోరుతూ సీఎం కేసీఆర్ కుమార్తె, ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వ్యతిరేకంగా 178 మంది రైతులు ఇక్కడి నుంచి నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే. దీనితో అక్కడి నుంచి కవిత ఓటమిపాలయ్యారు. ఇప్పుడు సీఎం కేసీఆర్‌పై కూడా ఇదే తరహాలో ప్రజలు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. నిజామాబాద్ అనుభవంతో గజ్వేల్‌లో తేడా వస్తుందని భావించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుచూపుతో కామారెడ్డి నుంచి కూడా పోటీచేస్తున్న విషయం తెలిసిందే.

426 కేసులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం అభ్యర్థులపై 426 కేసులు నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. ఈ కేసులన్నింటిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామనీ, దోషులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పరువుపోద్దని...

ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ మినహా అన్నిపార్టీల అధినేతలు పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీచేస్తుండగా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పాటు కామారెడ్డి నుంచీ పోటీచేస్తున్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నుంచి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచీ పోటీచేస్తున్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ స్థానం నుంచి బరిలో ఉన్నారు. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెనకడుగు వేశారు. ఆయన స్వంత నియోజకవర్గం అంబర్‌పేట నుంచి మాజీ మంత్రి, నకిలీ స్టాంప్‌పేపర్ల కుంభకోణంలో జైలు శిక్ష అనుభవించి వచ్చిన సీ కృష్ణయాదవ్‌ను బరిలో నిలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతే ఆ ప్రభావం దేశవ్యాప్తంగా పడుతుందనే భయంతో ఆయన పోటీకి దూరంగా ఉన్నట్టు సమాచారం.

రూ.538.23 కోట్ల సొత్తు స్వాధీనం

ఎన్నికల షెడ్యూల్ ప్రకటన అనంతరం అక్టోబర్ 9 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.538.23 కోట్ల సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

వీటిలో నగదుతో పాటు బంగారం, వజ్రాలు, ప్లాటినంతో పాటు కుక్కర్లు, క్రీడాసామాగ్రి, చీరలు, బియ్యం, అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు వంటివి ఉన్నాయి. నామినేషన్లు ముగియడంతో కేంద్ర బలగాల సారథ్యంలో తనిఖీలను మరింత ముమ్మరం చేయనున్నట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చే హామీలన్నీ అబద్ధాలే

- కేంద్ర ఐటీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ఇస్తున్న హామీలన్నీ అబద్ధాలేనని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం హోటల్ క్షత్రియాలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని చెప్పారు. కర్నాటకలో రూ.3 వేల పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉచిత బియ్యం, గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాలను కూడా సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ ను కాంగ్రెస్ కు ఏటీఎం కానివ్వబోమని చెప్పారు. యువతకు ఉద్యోగాలిస్తామని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పరిశ్రమలు రావనీ, అభివద్ధి జరగదని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే బీజేపీ మూల సిద్ధాంతమన్నారు. దేశవ్యాప్తంగా బీసీ లీడర్‌షిప్‌ను తమ పార్టీ ప్రోత్సహిస్తోందన్నారు.

విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యమే లక్ష్యం !

- భారత్, అమెరికా విదేశీ, రక్షణ మంత్రుల ముఖాముఖి భేటీ
- ఇండో-పసిఫిక్ సహా పలు కీలక అంశాలపై చర్చలు
- కెనడాలో ఖలిస్తానీ శక్తుల కార్యకలాపాలపై ఇండియా ఆందోళన



న్యూఢిల్లీ : వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించుకునేందుకై భారత్, అమెరికా విదేశీ, రక్షణ మంత్రులు శుక్రవారం ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఇండో-పసిఫిక్ అంశాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్ళు చర్చకు వచ్చాయి. రక్షణ పారిశ్రామిక సంబంధాలను మరింతగా విస్తరించుకోవాలని భావిస్తున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కార్యకలాపాలను పెంచాలని, కీలకమైన ఖనిజాలు, అత్యున్నత సాంకేతికత వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఆకాంక్షించారు. భారత తరుపున విదేశాంగ మంత్రి జై శంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు పాల్గొనగా, అమెరికా తరపున ఆంటోనీ బ్లింకెన్, లాయిడ్ ఆస్టిన్‌లు పాల్గొన్నారు. ముందస్తు దృక్పథం గల భాగస్వామ్యాన్ని నిర్మించి, అంతర్జాతీయ ఎజెండాను రూపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ల దార్శనికతను మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు ఈ చర్చలు ఒక అవకాశాన్ని కల్పిస్తాయని సమావేశం ప్రారంభానికి ముందు జై శంకర్ వ్యాఖ్యానించారు. కీలకమైన సాంకేతికతలు, ముఖ్యమైన ఖనిజాల రంగంలో, పౌర రోదసీ రంగంలో సహకారం వంటి కొత్త రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారానికి గల అవకాశాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. రక్షణ సహకారాన్ని మరింత పెంచుకోవడానికి ఇరు దేశాలు ఆసక్తిగా వున్నాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు అత్యంత కీలకమైన మూల స్తంభాల్లో రక్షణ సహకారం ఒకటిగా వుందన్నారు. అమెరికాతో అన్ని రంగాల్లో కలిసి సన్నిహితంగా పనిచేయడానికి ఎదురుచూస్తున్నామని చెప్పారు.

క్వాడ్ ద్వారా అమెరికా-భారత్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటూ స్వేచ్ఛా, పారదర్శకమైన, సుసంపన్నమైన, భద్రత కలిగిన ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని పెంచి పోషించడానికి ఇరు పక్షాలు కృషి చేస్తున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ చెప్పారు. నిబంధనల ఆధారిత వ్యవస్థను పెంపొందించేందుకు కృషి చేస్తూ, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్య సూత్రాలను పరిరక్షిస్తూ, అంతర్జాతీయ శాంతి, భద్రతా రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచి పోషించడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.

అత్యవసరమైన అంతర్జాతీయ సవాళ్ళను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రపంచంలోని రెండు పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేయడం, అభిప్రాయాలు పంచుకోవడం, ఉమ్మడి లక్ష్యాలను కనుగొనడం, వాటి ఫలాలను మన ప్రజలకు అందించడం చాలా ముఖ్యమని అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ తెలిపారు. ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలు మరింత భద్రతతో కూడిన ప్రపంచం దిశగా మనకు ఆశను కలిగిస్తాయన్నారు. కెనడాలో ఖలిస్తానీ అనుకూల శక్తుల కార్యకలాపాల పట్ల భారత్ తన ఆందోళనను అమెరికాకు తెలియచేసిందని విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా సమావేశంలో చెప్పారు.

కులతత్వాన్ని పెంచి పోషిస్తోన్న మోడీ

- నేడు ఏపీ బీజేపీ కార్యాలయాల ముట్టడి : అరుణ్‌కుమార్

గుంటూరు : ఇప్పటి వరకు మతతత్వ పార్టీగా ఉన్న బీజేపీ ఇప్పుడు కులతత్వాన్ని పెంచి పోషించే పార్టీగా మారిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ విమర్శించారు. హైదరాబాదులో జరిగే మాదిగల విశ్వరూప సభకు ప్రధాని ముఖ్య అతిథిగా హాజరవ్వడం మాల, మాదిగల మధ్య వైరాన్ని పెంచడమేనని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా హైదరాబాద్‌లో సభకు మోడీ హాజరు కావడం సరికాదన్నారు. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ జెఎసి పిలుపు మేరకు రాష్ట్రంలో బీజేపీ కార్యాలయాలను శనివారం ముట్టడించాలని కోరారు. మాలల సత్తా తెలియజేసేందుకు జనవరిలో లక్షలాది మందితో విజయవాడలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ మాలమహానాడు అధ్యక్షులు తాళ్లపల్లి రవి మాట్లాడుతూ.. తెలంగాణలోనూ మోడీ పర్యటనకు వ్యతిరేకంగా బిజెపి ఆఫీసు ఎదుట ఆందోళన చేస్తామని తెలిపారు.

ఢిల్లీవాసులకు స్వల్ప ఊరట



న్యూఢిల్లీ: రోజురోజుకీ పెరిగిపోతున్న వాయు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఢిల్లీ వాసులకు శుక్రవారం స్వల్ప ఊరట కలిగింది. ఢిల్లీతో సహ నోయిడా, గురుగ్రామ్, ఎన్సీఆర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి ఓ మోస్తారు వాన పడింది. దీంతో ఇక్కడి వాతావరణంలో కొంత మార్పుకు దారితీసింది. గాలిలో ఉన్న విషపూరిత వాయులు కొంత వరకు క్లీన్ అయ్యాయి. గాలి నాణ్యత సూచి కూడా స్వల్పంగా మెరుగుపడింది.

శుక్రవారం ఉదయంనాటికి ఢిల్లీలో సగటు గాలి నాణ్యత సూచీ 408కి తగ్గింది. గురువారం సాయంత్రం ఇది 437గా నమోదైంది. శుక్రవారం కూడా కర్తవ్య పథ్, ఐటిఐ, ఢిల్లీ-నోయిడా సరిహద్దు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షం కురిసింది. కాగా, ఢిల్లీ, ఎన్సిఆర్ (దేశ రాజధాని ప్రాంతం)లో గత వారం రోజులుగా కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిన విషయం తెలిసిందే. వాయు కాలుష్యం పెరగడం, గాలి నాణ్యత సూచీ పడిపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏడేళ్ళ తర్వాత కాలుష్యం దెబ్బతో స్కూళ్ళు మూతబడ్డాయి. ఇప్పటికే ఆఫీసులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రవేశ పెట్టారు. దట్టమైన పొగ నిండిన రోడ్లతో, గాలి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతూ, ముక్కులకు మాస్కులు తగిలించుకొని సాహసించి జనం బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది.

ఢిల్లీ సమీపంలోని రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడంతోపాటు, వాహనాల నుంచి వెలవడే పొగ ఢిల్లీలో వాయు కాలుష్యానికి ప్రధాన కారణంగా నిపుణులు చెబుతున్నారు. కాలుష్య నియంత్రణకు ఈ నెల 13 నుంచి సరి - బేసి విధానం పాటిస్తామని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. అలాగే కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు, గాలి నాణ్యతను పెంచేందుకు కృత్రిమ వర్షం కురిపించాలనే ఆలోచన కూడా చేసింది. ఈ నల 20 నుంచి 21 వరకు రెండు రోజుల పాటు ఢిల్లీలో ఈ కృత్రిమ వర్షం కురిపించాలని నిర్ణయించింది. అయితే ఈలోగానే వర్షాలు కురుస్తుండటం ప్రజలు, ప్రభుత్వానికి కాస్త ఉపశమనం లభించినట్లైంది.

ప్రయివేట్ సంస్థ లాకర్లలో సోదాలు

- లక్షల్లో నోట్ల కట్టలు



జైపూర్: ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన లాకర్లలో ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించి, లక్షల్లో డబ్బులు కనుగొన్నారు. మరో లాకర్‌లో భారీ సంఖ్యలో నోట్ల కట్టలతో ఉన్న సంచిని గుర్తించారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఈ సంఘటన జరిగింది. టీచర్ రిక్రూట్‌మెంట్ పేపర్ లీక్ ద్వారా సంపాదించిన అక్రమ ధనాన్ని జైపూర్‌లోని గణపతి ప్లాజాలోని ప్రైవేట్ లాకర్లలో ఉంచారని బిజెపి ఎంపి కిరోరి లాల్ మీనా గత నెలలో ఆరోపించారు. ఈ నేపథ్యంలో గణపతి ప్లాజాలో ఉన్న సుమారు 1,100 లాకర్లపై ఐటీ అధికారులు శుక్రవారం సోదాలు జరిపారు. గత నెల 17న మూడు లాకర్ల నుంచి సుమారు రూ.30 లక్షలు, గత నెల 21న మరికొన్ని లాకర్ల నుంచి రూ.2.46 కోట్ల నగదును ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.గతేడాది డిసెంబర్‌లో గ్రేడ్ 2 టీచర్ రిక్రూట్‌మెంట్ పేపర్ లీక్ అయ్యింది. దీంతో ఆ పరీక్షను రాజస్థాన్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పేపర్ లీక్ కేసుకు సంబంధించి 37 మంది అభ్యర్థులు సహా 55 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.60 లక్షలకు పేపర్‌ను లీక్ చేసినట్లు విచారణలో రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు బాబులాల్ కటారా అంగీకరించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసింది.

కేజ్రీవాల్‌పై బీజేపీ కుట్ర

ఆప్ నేత సంజయ్ సింగ్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం కుంభకోణంలో ఇరికించేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు కుట్రకు తెరలేపారని ఆప్ నాయకులు సంజయ్ సింగ్ శుక్రవారం ఆరోపించారు. ప్రస్తుతం సంజయ్ సింగ్ జైలులో ఉన్నారు. ఎక్సైజ్ పాలసీ కేసులో అరెస్టు చేసిన సంజయ్ సింగ్‌ను ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టులో శుక్రవారం పోలీసులు హాజరు పరిచారు. అనంతరం సంజయ్ సింగ్ విలేకరులతో మాట్లాడారు. కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు భారీ కుట్ర జరుగుతోంది.. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడమే కాకుండా ఆయనకు హాని తలపెట్టేందుకు బీజేపీ నాయకులు పెద్ద స్కెచ్ వేస్తున్నారు' అని సంజయ్ సింగ్ పేర్కొన్నారు. మద్యం స్కామ్‌కు సంబంధించి గత నెలలో సంజయ్ సింగ్‌ను ఆయన నివాసంలో ఇడి సుదీర్ఘంగా ప్రశ్నించిన అనంతరం అదుపులోకి తీసుకుంది.లిక్కర్ స్కామ్‌కు సంబంధించి మనీల్యాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు కేజ్రీవాల్‌కు ఈడీ ఇటీవల సమన్లు జారీ చేసిన నేపథ్యంలో సంజయ్ సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కేంద్రంలోని అధికార బీజేపీ కనుసన్నల్లోనే ఈడీ తనకు సమన్లు జారీ చేసిందని కేజ్రీవాల్ కూడా ఆరోపించారు. ఇదే కేసులో ఢిల్లీ మంత్రి మనీష్ సిసోడియా జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

మేం రోజుకు 15 గంటలు పని చేస్తున్నాం



- కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ

న్యూఢిల్లీ : భారత్ శక్తివంతమైన దేశంగా ఎదగాలంటే యువత వారానికి కనీసం 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి వ్యాఖ్యపై కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. కొంతమంది నారాయణమూర్తిని సమర్థిస్తుంటే మరికొందరు వ్యతిరేకిస్తున్నారు.

తాజాగా, నారాయణమూర్తి సలహాను సమర్థిస్తున్నవారి జాబితాలోకి కాంగ్రెస్ నాయకులు, ఎంపీ మనీష్ తివారి చేరారు. నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలో తప్పేముందని ప్రశ్నించారు. దీనిపై ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. మా లాంటి ప్రజాప్రతినిధులు రోజుకు 15 గంటల వరకూ పని చేస్తున్నామని తెలిపారు.

ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. 'వారానికి 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలపై ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నారు.. అందులో తప్పేముంది? ఓ వైపు ప్రజా జీవితం, మరో వైపు వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేసుకుంటూనే మా లాంటి ప్రజా ప్రతినిధులు రోజుకు 12 నుంచి 15 గంటలు వరకూ పనిచేస్తున్నాం. నేను చివరగా ఎప్పుడు ఆదివారం సెలవు తీసుకున్నానో నాకు గుర్తే లేదు. గెలిచినా, ఓడిపోయిన ప్రజా జీవితంలో ఉన్నవారికి ఆదివారం సెలవు అనేది ఉండదు. వారానికి 70 గంటలు పని, ఒక రోజు సెలవు, సంవత్సరానికి 15 రోజులు విరామం అనేది తప్పనిసరి నియమం కావాలి' అని మనీష్ తివారి ట్వీట్ చేశారు.

టోల్‌ప్లాజా వద్ద కారు బీభత్సం

ముగ్గురి మృతి, ఆరుగురికి గాయాలు

ముంబయి: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. అతి వేగంతో దూసుకొచ్చిన ఓ కారు.. టోల్‌ప్లాజా వద్ద క్యూ లైన్‌లో ఉన్న వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ముంబయిలోని వర్లీ ప్రాంతంలో గురువారం రాత్రి టోల్ ప్లాజా వద్ద ఆగి ఉన్న పలు వాహనాలను అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు ఢీకొట్టింది. వర్లీ నుంచి బాంద్రావైపు వెళ్తున్న ఒక ఇన్నోవా కారు పలు వాహనాలను బలంగా ఢీకొంది. టోల్ ప్లాజాకు 100 మీటర్ల ముందు మొదట మెర్సిడెస్ కారును ఢీకొట్టిందని, ఆ తర్వాత మరో మూడు వాహనాలను ఢీకొట్టిందని డిసిపి కృష్ణకాంత్ ఉపాధ్యాయ వెల్లడించారు.

ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారని చెప్పారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మరో నలుగురి పరిస్థితి నిలకడగానే ఉందని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

మోడీ మాటలు ఒకలా..చేతలు ఇంకోలా..

మావోయిస్టుల హింస నియంత్రణపై ప్రధాని విరుద్ధ ప్రకటనలు

- వెల్లడిస్తున్న ప్రభుత్వ గణాంకాలు
- కాంగ్రెస్ పాలన కంటే బీజేపీ పాలనలోనే హింస అధికం



న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడల్లా ఉగ్రవాదం, మావోయిస్టు హింసాత్మక సంఘటనలు పెరుగుతాయని ఆరోపించారు. మావోయిస్టుల హింసను అరికట్టడంలో ఆ పార్టీ విఫలమైందని అన్నారు. అయితే, ఛత్తీస్‌గఢ్ విషయంలో కేంద్ర గణాంకాలు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. కేంద్రం గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్రంలో మావోయిస్టుల హింస తగ్గింది. అయితే, ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాత్రం ఆ క్రెడిట్‌ను తన పార్టీకి ఇచ్చుకున్నారు.

కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. 2010 నుంచి లెఫ్ట్ వింగ్ తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యూఈ) చేత చంపబడిన పౌరుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. పౌర మరణాలు గత కొన్ని సంవత్సరాలుగా స్థిరంగా తగ్గాయి, 2010లో 722 నుంచి 2022లో 82కి పడిపోయాయి. ఆర్థిక మౌలిక సదుపాయాలపై దాడుల పరంగా 2010 నుంచి సంఘటనలు లేదా దాడుల సంఖ్య కూడా తగ్గింది. దాడులు 2010లో 365 నుంచి 2021, 2022లో వరుసగా 42కి తగ్గాయి. రాజ్యసభలో కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ వెల్లడించిన సమాచారం ప్రకారం.. 2018 నుంచి ఎల్‌డబ్ల్యూఈ సంఘటనలు, మరణాలు క్రమంగా తగ్గాయి. 2018లో ఎల్‌డబ్ల్యూఈ ఘటనలు 833గా ఉండగా.. మరణాలు 240గా నమోదయ్యాయి. 2023 జులై నాటికి ఎల్‌డబ్ల్యూఈ ఘటనలు 273కు.. మరణాలు 79కి పడిపోవటం గమనార్హం.


ఛత్తీస్‌గఢ్ విషయంలో చూసుకుంటే.. 2018 వరకు రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నది. 2018 ఎన్నికల్లో విజయంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎల్‌డబ్ల్యూఈ ద్వారా హింసాత్మక ఘటనలు, భద్రతా దళాలతో ప్రారంభించబడిన సంఘటనలు, భద్రతా సిబ్బంది, పౌరుల, ఎల్‌డబ్ల్యూఈ మరణాలు 2018 నుంచి తగ్గుముఖం పట్టాయి. 2018లో ఎల్‌డబ్ల్యూఈ హింసాత్మక ఘటనలు 275గా ఉన్నాయి. భద్రతా సిబ్బంది 55 మంది, పౌరులు 98 మంది, ఎల్‌డబ్ల్యూఈ వ్యక్తుల 125 మంది మరణించారు. అది 2023 ఫిబ్రవరి 28 నాటికి ఎల్‌డబ్ల్యూఈ హింసాత్మక ఘటనలు 37కు పడిపోయాయి. భద్రతా సిబ్బంది ఏడుగురు, పౌరులు పది మంది మాత్రమే మరణించారు.

ఛత్తీస్‌గఢ్‌లో 2018కి ముందు బీజేపీ పాలనలో ఉన్న పరిస్థితితో పోల్చుకుంటే.. ప్రస్తుత ఐదేండ్ల కాంగ్రెస్ పాలనలో మావోయిస్టు హింసాత్మక ఘటనలు, పౌరుల మరణాలు తగ్గాయి. అయితే, మోడీ మాత్రం ఈ విషయంలో కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయటం గమనార్హం. మోడీ చేసిన విరుద్ధ ప్రకటనలు కేవలం రాజకీయంగా లబ్ది పొందటానికి చేసినవేననీ, సాక్షాత్తూ కేంద్ర గణాంకాలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

మోడీ డిగ్రీ కేసులో..

- కేజ్రీవాల్ రివ్యూ పిటిషన్ తిరస్కరించిన గుజరాత్ హైకోర్టు

గాంధీనగర్ : ప్రధాని మోడీ విద్యార్హతలకు సంబంధించిన ఉత్తర్వులను సమీక్షించాలని కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు తిరస్కరించింది. మార్చి 31న కేజ్రీవాల్‌కు మోడీ డిగ్రీలకు సంబంధించిన వివరాలను అందించాలని గుజరాత్ యూనివర్సిటీని కోరుతూ కేంద్ర సమాచార కమిషన్ 2016లో ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ఒకరి "బాధ్యతా రహితమైన చిన్నపిల్లల ఉత్సుకత"



ప్రజా ప్రయోజనాలకు సంబంధించినదిగా భావించలేమని గుజరాత్ విశ్వవిద్యాలయం హైకోర్టులో ఈ ఉత్తర్వును వ్యతిరేకించింది. యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మార్చిలో ప్రధాని డిగ్రీలకు సంబంధించిన సమాచారం పబ్లిక్ డొమైన్‌లో ఉన్నందున దాచడానికి ఏమీ లేదని తెలిపారు. అయితే, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేయబడలేదనీ, ఆఫీస్ రిజిస్టర్ అని సూచించబడిన పత్రం మాత్రమే ప్రదర్శించబడుతుందని కేజ్రీవాల్ రివ్యూ పిటిషన్ వాదించిందని వివరించారు. మోడీకి 1978లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ, 1983లో గుజరాత్ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ లభించిందని బీజేపీ అంటున్నది.

సీఎం నితీశ్ కుమార్ ఆహారంలో విషం


- మాంజీ సంచలన ఆరోపణలు



పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తినే ఆహారంలో విషం కలుపుతున్నారని ఆ రాష్ట్ర మాజీ సీఎం, హిందుస్థానీ అవామీ మోర్చా చీఫ్ జితన్ రాం మాంజీ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కారణంతోనే నితీష్ మానసిక ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి పీఠం కోసమే ఈ పనిచేస్తున్నారని మాంజీ పేర్కొన్నారు. పాట్నా అసెంబ్లీ బయట శుక్రవారం మాంజీ ఈ ఆరోపణలు చేశారు. మానసిక ఆరోగ్యం క్షీణించడం వల్లే నితీష్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి తరువాత మళ్లీ క్షమాపణలు చెప్పాల్సి వచ్చిందన్నారు. అంతేగాక పెద్దవాన్ని అని చూడకుండా అసెంబ్లీలో తనను కూడా నితీష్ తిట్టారని మాంజీ తెలిపారు.నితీష్ కుమార్‌కు ఇస్తున ఆహారంపై ఉన్నతస్థాయి విచారణ చేయాల్సిందిగా గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తానని మాంజీ ఈ సందర్భంగా తెలిపారు.అలాగే రాష్ట్రంలో కొన్ని రోజులుగా నెలకొన్న దారుణ పరిస్థితులపైనా వివరిస్తాని తెలిపారు. ఇటీవలే రిజర్వేషన్లు పెంచుతూ బీహార్ అసెంబ్లీ పాస్ చేసిన బిల్లుపై డౌట్లు లేవనెత్తినందుకుగాను మాంజీపై అసెంబ్లీలో సీఎం నితీష్ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే..

అన్ని ప్రసారాల సేవలకూ ఒకే చట్టం

బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ బిల్లును తీసుకువచ్చిన కేంద్రం



న్యూఢిల్లీ : ఓటీటీ కంటెంట్, డిజిటల్ న్యూస్‌తో సహా బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసులను క్రమబద్ధీకరించేందుకు సమగ్ర చట్రపరిధిని అందించే బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్(నియంత్రణ) బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతమున్న కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (క్రమబద్ధీకరణ) చట్టం, 1995, అలాగే దేశంలో ప్రస్తుతం బ్రాడ్‌కాస్టింగ్ రంగాన్ని శాసిస్తున్న ఇతర విధానపరమైన మార్గదర్శకాల స్థానే ఈ బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది.

డొమైన్ నిపుణులు, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ ప్రొవైడర్లు, సాధారణ ప్రజానీకం సహా సంబంధిత అన్ని వర్గాలు, పక్షాలు రాబోయే 30 రోజుల్లో ఈ బిల్లుపై స్పందించి తమ ప్రతిస్పందనలను, వ్యాఖ్యలను పంపాలంటూ మంత్రిత్వ శాఖ ఆహ్వానించింది.

ఓటీటీ కంటెంట్, డిజిటల్ న్యూస్‌ను కూడా కలుపుకుంటూ తన పరిధిని విస్తరించేందుకు, రెగ్యులేటరీ ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు, సమకాలీన నిర్వచనాలు, కొత్తగా ఆవిర్భవిస్తున్న సాంకేతికతల నిబంధనలను ప్రవేశపెట్టేందుకు ఈ బిల్లు ఉద్దేశించబడింది. వచ్చిన కంటెంట్‌ను సమీక్షించేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలని కూడా బిల్లు కోరుతోంది. అలాగే స్వీయ నియంత్రణకు బ్రాడ్‌కాస్ట్ సలహా మండలిని ఏర్పాటు చేయాలని కోరుతోంది. వివిధ బ్రాడ్‌కాస్ట్ నెట్‌వర్క్ ఆపరేటర్లకు వివిధ ప్రోగ్రామ్, అడ్వర్టయిజ్‌మెంట్ కోడ్‌లు ఇవ్వాలని బిల్లు కోరుతోంది. అలాగే వైకల్యాలతో బాధపడే వారికి మీడియాలో అవకాశం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, చట్టబద్ధమైన జరిమానాలు వుండాలని కోరుతోంది.

సూచనా एवं प्रसारण मंत्रालय MINISTRY OF INFORMATION AND BROADCASTING सत्यमेव जयते

ఒకే చట్టం కిందకు వివిధ బ్రాడ్‌కాస్టింగ్ సేవలను తీసుకురావడానికి రెగ్యులేటరీ నిబంధనలను సంఘటితపరిచి, ఆధునీకరించాల్సిన అవసరాన్ని బిల్లు పరిష్కరిస్తుందని కేంద్ర సమాచార శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. కొత్తగా అభివృద్ధి చెందుతున్న సేవలు, సాంకేతికతలకు అనుగుణంగా సమకాలీన ప్రసార నిబంధనలకు నిర్వచనాలను బిల్లు తీసుకువచ్చింది. కంటెంట్ ఎవాల్యుయేషన్ కమిటీలను ప్రవేశపెట్టడం ద్వారా స్వీయ నియంత్రణను పెంచుతోంది. ప్రస్తుతమున్న వివిధ విభాగాల ప్రతినిధులతో వేసే కమిటీని మరింత విస్తరించి, ప్రాతినిధ్యం పెంచి 'బ్రాడ్‌కాస్ట్ సలహా మండలి'గా రూపొందించనుంది.

ఆపరేటర్లకు, బ్రాడ్‌కాస్టర్లకు సలహాలు, సూచనలు, హెచ్చరికలు, అభిశంసనలు లేదా జరిమానాలు వంటి చట్టబద్ధమైన శిక్షలను కూడా ప్రవేశపెట్టింది. జైలు శిక్షలు లేదా జరిమానాలు విధించే నిబంధన వుంది. అయితే చాలా తీవ్రమైన నేరాలకు మాత్రమే ఇది వర్తిస్తుంది.

జమ్ముకాశ్మీర్‌లో భారీ హిమపాతం



- రవాణాకు తీవ్ర అంతరాయం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో రెండు రోజుల నుంచి భారీగా మంచు కురుస్తోంది. ఈ భారీ హిమపాతంతో కాశ్మీర్‌లోని అనేక ప్రాంతాలు పూర్తిగా మంచుతో కప్పుకుపోయాయి. కాశ్మీర్ లోయలోని ఎత్తైన ప్రాంతాలైన పిర్ కీ గలి, జోజిలా, గుల్‌మార్గ్‌లలో శుక్రవారం తొలి హిమపాతం నమోదైంది. కొండలపై నుంచి భారీగా మంచు గడ్డలు కిందకు పడుతున్నాయి. రహదారులపై మంచు పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మంచు కారణంగా నిలిచిపోయిన కొన్ని వాహనాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. స్థానిక వాతావరణ కార్యాలయ వివరాల ప్రకారం, శుక్రవారం రాత్రి మరింత భారీగా మంచు కురిసే అవకాశం ఉంది. కాబట్టి హైవే మూసి ఉంటుందని అధికారులు తెలిపారు. హిమపాతం ముగిసిన తర్వాతే హైవేను క్లియర్ చేసే పని ప్రారంభమవుతుందని వారు తెలిపారు. జమ్ముకాశ్మీర్‌లో అనేక ప్రాంతాల్లో రోడ్లపై విపరీతమైన మంచు పేరుకుపోవడంతో అధికారులు రహదారులను మూసేశారు. కాశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపే ప్రత్యామ్నాయ లింక్ అయిన మొఘల్ రోడ్‌ను హిమపాతం కారణంగా గురువారం వాహనాల రాకపోకలకు మూసివేసినట్లు అధికారులు తెలిపారు. పోషణ- పీర్ కి గలి మధ్య మంచు కురుస్తుండటంతో రహదారి మూసుకుపోయిందని పేర్కొన్నారు. ఈ రోడ్డు జమ్మూలోని పూంచ్, రాజౌరి జిల్లాలను దక్షిణ కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాతో కలుపుతుంది. రహదారులపై మంచు పేరుకుపోవడంతో దాన్ని తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్లపై పలు వాహనాలు నిలిచిపోయాయి.

తమిళనాడులో భారీ వర్షాలు



చెన్నై : ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడ స్థంభించిపోయింది. వరదలతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరోవైపు.. 12 జిల్లాల్లో శనివారం కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది.

తమిళనాడువ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. కోయంబత్తూరు, తిరువూర్, మధురై, థేనీ, దినిదిగుల్ జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో కుండపోత వాన కురిసింది. ఇక, నీలగిరి జిల్లాలోని ఐదు తాలుకాలను వర్షం ముంచెత్తింది. తంజావూర్, తిరువారూర్, నాగపట్నం, మైలదుత్తురై, పుదుకోట్టై, శివగంగై, రామనాథపురం, విరుదునగర్, తూత్తుకుడి, తెంకాసి, తిరునెల్వేలి, కన్యాకుమారి తదితర ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురిసాయి.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పాఠశాలలు, కాలేజీలకు సెలవులు ప్రకటించారు. భారీ వర్షాలు కారణంగా పలు రైళ్లను కూడా రద్దు చేశారు రైల్వే అధికారులు. నీలగిరి మౌంటైన్ రైల్వేలోని కల్లార్, కూనూర్ సెక్షన్ల మధ్య ట్రాక్‌పై కొండచరియలు, చెట్లు కూలిపడటంతో ఈ నెల 16 వరకు ఆ రూట్స్‌లో రైళ్ల రాకపోకలను రద్దు చేశారు. మెట్టుపాళయం నుంచి ఉదగమండలం వరకు నడిచే 06136, 06137 ప్యాసింజర్ ప్రత్యేక రైళ్లను శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దీపావళి సెలవు ఆదివారమే...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దీపావళి పండుగ సెలవును ఈనెల 12వ తేదీ ఆదివారమే ఇస్తున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయితే దీపావళి పండుగ సెలవు 13వ తేదీ సోమవారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం 13వ తేదీ వివిధ స్థాయిల్లో సమావేశాలు, శిక్షణా తరగతులు ఉన్నందున, సెలవు ప్రకటిస్తే ఆ కార్యక్రమాలు సజావుగా జరగవనీ, అందువల్ల రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పొరుగురాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం దీపావళి సెలవును అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

విద్వేషాలు రెచ్చగొట్టిన హోం మంత్రికి ఉద్వాసన పలకండి

- సునాక్‌పై అన్ని వైపుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి



లండన్: ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా వ్యాఖ్యలు చేసిన పచ్చి మితవాది, బ్రిటిష్ హోం మంత్రి సుయెల్లా బ్రేవర్‌మన్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రధాని రిషి సునాక్‌పై అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. గాజాలో కాల్పులు విరమించాలని కోరుతూ గత శనివారం ప్రదర్శన నిర్వహించిన శాంతి ఉద్యమ కార్యకర్తలపైన, ఆ ప్రదర్శనను అణచివేయనందుకు పోలీస్ అధికారులపైన ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ టైమ్స్ పత్రికలో వ్యాసం రాశారు. ఆమె రాసిన ఆ వ్యాసంతో తమకు సంబంధం లేదని ప్రధానమంత్రి నివాసమైన డౌన్‌స్ట్రీట్ నెంబర్ 10 తెలిపింది. ప్రదర్శకులపై నిర్బంధాన్ని ప్రయోగించకుండా పోలీసులు రాజకీయ పక్షపాతంతో వ్యవహరించారని ఆమె తన వ్యాసంలో పేర్కొనడంపై ప్రతిపక్షాల నుంచే కాదు, స్వపక్షం నుంచి కూడా తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. అధికార టోరి పార్టీకి చెందిన మాజీ సీనియర్ కేబినెట్ మంత్రి ఒకరు దీనిపై స్పందిస్తూ, ఆమె కేబినెట్ నుంచి ఉద్వాసన కోరుకున్నట్టుగా ఉంది. ఈ విషయంలో ఆమె ప్రయత్నం ఫలించాలని కోరుకుంటున్నానని వ్యంగ్యంగా అన్నారు. శాంతి భద్రతలను దెబ్బతీసేలా సాక్షాత్తూ హోం మంత్రే ఇలా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం బ్రిటన్ చరిత్రలో ఇదే మొదటిసారి అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు సర్ కీర్ స్టార్మర్ వ్యాఖ్యానిస్తూ మంత్రిని కూడా తొలగించలేని అచేతన స్థితిలో ప్రధాని ఉన్నారని విమర్శించారు. ప్రధాని రిషి సునాక్ మాత్రం తన సహచర మంత్రిపై విశ్వాసం ఉందని అన్నారు. టోరి జస్టిస్ కమిటీ చైర్మన్ బాబ్ నీల్ మాట్లాడుతూ, ఆమె వ్యాఖ్యలు మతిమాలినవి, దుర్బుద్ధితో కూడినవి, విద్వేషాలను రెచ్చగొటేలా ఉన్నాయన్నారు. హోం మంత్రి కమ్యూనిటీల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బహిరంగంగా యత్నించడం ప్రమాదకరమని అన్నారు. విద్వేష రాజకీయాలకు హోం మంత్రిత్వ శాఖ నెలవుగా మారడాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించరాదని, ఆమెను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని పలువురు ప్రతిపక్ష

గాజాలో తక్షణమే కాల్పులు విరమించాలి


న్యూయార్క్‌టైమ్స్ హెడ్‌క్వార్టర్స్ వద్ద మీడియా సిబ్బంది ధర్నా



న్యూయార్క్ : గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని కోరుతూ న్యూయార్క్ టైమ్స్ ప్రధాన కార్యాలయం వద్ద మీడియా సిబ్బంది గురువారం ధర్నా నిర్వహించారు. హమస్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక చర్యల కవరేజీ పట్ల మీడియాలో ఒక వర్గం పక్షపాతం వహిస్తోందంటూ వారు ఆరోపించారు. మాన్‌హటన్ హెడ్‌క్వార్టర్స్ వెలుపల జరిగిన ధర్నాలో వందలాదిమంది పాల్గొన్నారు. గాజాలో మరణించిన వేలాదిమంది పాలస్తీనియన్ల పేర్లను ప్రదర్శకులు చదివి వినిపించారు. యుద్ధం ఆరంభమైనప్పటి నుండి కనీసం 36మంది జర్నలిస్టులు మరణించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో కాల్పుల విరమణకు బహిరంగంగా మద్దతు ప్రకటించాలంటూ టైమ్స్ ఎడిటోరియల్ బోర్డును వారు కోరారు.

విచక్షణారహితంగా జరుగుతున్న మారణకాండలో ఒక పక్షం మీడియా కూడా కుమ్మక్కవుతోందని విమర్శించారు. న్యూయార్క్‌లో పలు చోట్ల పాలస్తీనియన్లకు మద్దతుగా జరిగిన కార్యాచరణలో భాగంగా ఈ ధర్నా జరిగింది. జూయిస్ వాయిస్ ఫర్ పీస్ గ్రూపు కార్యకర్తలు మంగళవారం స్టాట్యూ ఆఫ్ లిబర్టీని ఎక్కారు. కాల్పుల విరమణ తక్షణమే జరగాలని డిమాండ్ చేస్తూ గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్‌లో కమ్యూటింగ్ కేంద్రాన్ని మూసివేశారు.

శ్రీలంక బ్యాంకింగ్ రంగ సుస్థిరతకై ప్రపంచ బ్యాంక్ సాయం



కొలంబో : శ్రీలంక ఆర్థిక, వ్యవస్థాగత రంగాలను బలోపేతం చేసేందుకు ప్రపంచ బ్యాంక్ తాజాగా 150మిలియన్ల డాలర్ల ఆర్థిక సాయాన్ని ఆమోదించింది. ఈ విషయాన్ని శ్రీలంక సెంట్రల్ బ్యాంక్ శుక్రవారం తెలిపింది. "ఆర్థిక రంగానికి మద్దతుగా బలమైన భద్రతా వ్యవస్థల అవసరాన్ని శ్రీలంక ఆర్థిక సంక్షోభం ప్రముఖంగా తెలియచెప్పింది. ఆర్థిక వ్యవస్థ, వాణిజ్య సంస్థలు, వ్యక్తులు, చిన్న తరహా వ్యాపారాలు, నిరుపేద కుటుంబాలకు సుస్థిరమైన, విశ్వసనీయమైన బ్యాంకింగ్ రంగం చాలా అవసరం. " అని మాల్దీవులు, నేపాల్, శ్రీలంకలకు ప్రపంచ బ్యాంక్ కంట్రీ డైరెక్టర్ ఫరిస్ హదాద్ జెవోస్ పేర్కొన్నట్లు బ్యాంక్ తన ప్రకటనలో తెలిపింది. డిపాజిట్ బీమా పథకాలను బలోపేతం చేయడం మహిళలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలతో సహా చిన్న డిపాజిట్‌దారుల ఆదాయాలను పరిరక్షించేందుకు సహాయపడుతుందని ఫరిస్ పేర్కొన్నారు. అలాగే శ్రీలంక పునర్నిర్మాణంలో కీలకమైన ఆర్థిక వ్యవస్థలో విశ్వాసాన్ని నింపేందుకు కూడా ఇది సాయపడుతుందని అన్నారు. శ్రీలంక డిపాజిట్ బీమా పథకం (ఎస్‌ఎల్‌డిఐఎస్) ఆర్థిక, వ్యవస్థాగత సామర్ధ్యాన్ని మరింత పెంపొందించేందుకు ఆర్థిక రంగ భద్రతా వ్యవస్థ ప్రాజెక్టు రూపొందించబడింది. 2010లో ఈ డిపాజిట్ పథకాన్ని ఏర్పాటు చేశారు. నవంబరు 13న శ్రీలంక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి బెయిలవుట్ ప్యాకేజీ రెండవ విడత మొత్తం విడుదల కోసం శ్రీలంక ప్రస్తుతం ఎదురుచూస్తోంది.

కాప్ సదస్సుకు మోడీ ?

న్యూఢిల్లీ : నవంబరు నెలాఖరులో దుబాయ్‌లో జరగనున్న ఐక్యరాజ్య సమితి వాతావరణ సదస్సు (కాప్)కు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే అవకాశం వుంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు శుక్రవారం తెలిపారు. ఏటా జరిగే ఈ సమావేశం వాతావరణ మార్పుల వల్ల తలెత్తుతున్న సవాళ్ళను చర్చించే అత్యున్నత స్థాయి సదస్సు. ఈ వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రపంచ దేశాల పాత్ర, బాధ్యతలను ఈ సదస్సులో చర్చిస్తారు.

ఈ ఏడాది జులైలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రధాని మోడీ పర్యటించినపుడు కాప్-28 సదస్సు విజయవంతం కావడానికి కట్టుబడి వుంటామని సంయుక్త తీర్మానంపై సంతకాలు చేశారు. ఆ మేరకు ఆయన దుబాయ్ వెళ్లాల్సి వుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే అప్పటికి భారత్‌లో ఎన్నికల సీజను నడుస్తూ వుంటుంది.

డిసెంబరు 1న మోడీ సదస్సుకు హాజరు కావచ్చని ఆ వర్గాలు తెలిపాయి. నవంబరు 30న ప్రారంభమయ్యే ఈ సదస్సు డిసెంబరు 12వరకు సాగుతుంది. అలాగే వాయిస్ ఆఫ్ గ్లోబల్ సదస్సు, జి-20 సదస్సులకు కూడా మోడీ హాజరవనున్నారు. వాతావరణ మార్పుల వల్ల కలిగే పర్యవసానాలు, నష్టాలను ఎదుర్కొనేందుకు నిధిని ఏర్పాటు చేయడంపై చర్చలు జరుగుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ నష్టాన్ని ఎదుర్కొనే దేశాలకు ఆ పరిహారం అందచేయడంపై కూడా చర్చిస్తారు.

కాంగ్రెస్ అభ్యర్థిని ఓటు తొలగించాలని రిట్ దాఖలు

నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్

పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని ఓటు తొలగించాలని నాగర్ కర్నూల్ వాసి కె. దేవ వేసిన రిట్ పిటీషన్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ ఎన్.వి శ్రవణ్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. రంగారెడ్డి జిల్లా కొత్తపేటలో యశస్విని నివాసం. పాస్‌పోర్టు కూడా అదే అడ్రస్‌తో ఉందని, విదేశాల్లోనే ఎక్కువ కాలం ఉన్న ఆమెకు అచ్చంపేట నియోజకవర్గంలో ఓటు ఎలా ఉందని ఫిర్యాదు చేస్తే ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల లిస్ట్, సవరణ ఓటర్ల లిస్ట్, తుది ఓటర్ల లిస్ట్‌లను అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు, విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది.

స్థానిక నివాస పత్రం ఎలా ఇస్తారు?

ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏపీలో చదివినట్లుగా పిటిషనర్ వెన్నెల స్వయంగా చెబుతున్నారని, ఆమెకు తెలంగాణలో నివాసం ఉన్నట్లుగా ధ్రువీకరణ పత్రం ఎలా ఏ చట్ట నిబంధన ప్రకారం ఇచ్చారని గద్వాల ఎమ్మార్వోను హైకోర్టు ప్రశ్నించింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నివాస తనిఖీకి వెళ్లి ఇచ్చిన నివేదిక ప్రకారం ఇచ్చామని వ్యక్తిగతంగా విచారణకు హాజరైన ఎమ్మార్వో తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ వివరణతో సంతృప్తి చెందని కోర్టు వచ్చే నెల 4న జరిగే విచారణకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఎమ్మార్వోలు ఇద్దరూ స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ఆదేశించింది.

దర్శకుడు రాఘవేంద్రరావుకు నోటీసులు

హైదరాబాద్ బంజారాహిల్స్ ప్రాంతంలోని షేక్‌పేట్‌లో రెండు ఎకరాల భూమిని సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కేటాయిస్తే, దానిని సినీ దర్శకుడు కె రాఘవేంద్రరావు ఇతరులు సొంత అవసరాలకు వాడుకుంటున్నారనే పిల్‌పై హైకోర్టు స్పందించింది. రాఘవేంద్రరావు, ఆయన బంధువులకు మరోసారి నోటీసులు ఇచ్చింది. గత ఏడాది మార్చిలో ఇచ్చిన నోటీసులు అందినట్లుగా రికార్డుల్లో లేకపోవడంతో గురువారం మళ్లీ నోటీసుల్ని జారీ చేసింది. బంజారాహిల్స్ సర్వే నెం. 403/1లో రెండు ఎకరాల భూమిని వాణిజ్య అవసరాలకు వినియోగించడం నిబంధనలకు వ్యతిరేకమని పేర్కొంటూ మెదక్‌కు చెందిన బాలకిషన్ 2012లో పిల్ దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించి ప్రతివాదులైన రాఘవేంద్రరావు, ఆయన బంధువులు కె.కృష్ణమోహన్రావు, కె.ఎస్.చక్రవర్తి, కె.విజయలక్ష్మి, కె. అఖిలాండేశ్వరి, కె. లాలసదేవిలకు నోటీసులిచ్చింది. సినీ పరిశ్రమను హైదరాబాద్‌లో అభివృద్ధి చేసేందుకు 1984లో రెండు ఎకరాలను ప్రభుత్వం రాయితీ ధరకు కేటాయించింది. అయితే గత కొన్నేండ్లుగా నిబంధనలకు విరుద్ధంగా రాఘవేంద్రరావు ఇతరులు పబ్స్, బార్స్, థియేటర్ల కోసం వినియోగిస్తున్నారని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎవరు పట్టించుకోవడం లేదని పిటీషనర్ ఆరోపించారు. కేసును తదుపరి విచారణను జనవరి 18కి వాయిదా వేసింది.

జిల్లా జడ్జీలుగా పదోన్నతులు

సీనియర్ జడ్జీలు 16 మందికి జిల్లా జడ్జీలుగా హైకోర్టు ప్రమోషన్స్ ఇచ్చింది. ప్రమోషన్లో భాగంగా వీరిని ఇతర కోర్టులకు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా ఈ నెల 17లోగా కొత్త పోస్టుల్లో చేరాలని, ఈలోగా కేసుల విచారణ ముగించి రిజర్వులో పెట్టిన



కేసుల్లో తీర్పులు చెప్పాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

వాణిజ్య కోర్టుకు హెచ్‌సీఏ, విశాఖ ఇండస్ట్రీస్ వివాదం

4 వారాల్లోగా పరిష్కరించాలని కింది కోర్టుకు హైకోర్టు ఆదేశం

ఉప్పల్ స్టేడియం డెవలప్‌మెంట్ వర్క్స్ విషయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), విశాఖ ఇండస్ట్రీస్ మధ్య నెలకొన్న వివాదాన్ని తిరిగి వాణిజ్య కోర్టుకు పంపుతూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇద్దరి మధ్య తలెత్తిన ఆర్థిక లావాదేవీల వివాదాన్ని నాలుగు వారాల్లోగా పరిష్కరించాలని వాణిజ్య కోర్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాదే, జస్టిస్ ఎస్. వి. శ్రవణ్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలను జారీ చేసింది. వాణిజ్య వివాదానికి సంబంధించిన కేసులను పరిగణనలోకి తీసుకోకుండా తమ ఆస్తుల జప్తునకు వాణిజ్య వివాదాల కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందంటూ హెచ్‌సీఏ తరఫున అడ్మినిస్ట్రేటర్, జస్టిస్ లావు నాగేశ్వరరావు దాఖలు చేసిన పిటీషన్‌ను చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాదే, జస్టిస్ ఎస్.వి. శ్రవణ్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం విచారించింది.

2016 ఏడాది మార్చి 15న వెలువడిన ఆర్బిట్రేషన్ అవార్డును అమలు చేయక పోవడంతో గత ఏడాది అక్టోబర్ 6న స్టేడియం, ఆస్తుల ఎటాచ్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. అయినా హెచ్‌సీఏ పట్టించుకోక పోవడంతో హెచ్‌సీఏ ఆస్తులు, బ్యాంక్ ఖాతాల సీజ్ ఆర్డర్ వెలువడిందని విశాఖ ఇండస్ట్రీస్ హైకోర్టుకు తెలిపింది. హైకోర్టు.. హెచ్‌సీఏ రూ.17.5 కోట్లను ఆరువారాల్లోగా విశాఖ ఇండస్ట్రీస్‌కు చెల్లించాలని గత విచారణ సందర్భంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం అప్పీల్ విచారణ సందర్భంగా వివాదం వాణిజ్య కోర్టులో విచారణలో ఉన్నదని హెచ్‌సీఏ అభ్యర్థన మేరకు అదే కోర్టులో తేల్చుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారి చేసింది.

IN THE COURT OF HON'BLE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S. NO. 4536 OF 2022

BETWEEN :
ICICI BANK LIMITED ...Plaintiff
And
SRI MISHRI LAL ....Defendant
To
Sri Mishri Lal
S/o. Harji Ram
Resident of H.No. 120,
Naiyonkiohani, Narayanpura,
near Railway Bridge,
Kuchmancity, Nagaur, Rajasthan-341508.

Please take notice that the Plaintiff herein has filed the above suit against you for Recovery of money, before the court of the Hon'ble VII Junior Civil Judge, City Civil Court at Hyderabad and the same is posted for your appearance on 28-11-2023. Therefore you are hereby directed to appear before the said court on 28-11-2023, either in person or through an advocate at 10:30 AM or else the matter will be decided ex-parte

(BY ORDER OF THE COURT)
Sd/-
R.RAJENDRA PRASAD
Advocate

IN THE COURT OF HON'BLE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S. NO. 4534 OF 2022

BETWEEN :
ICICI BANK LIMITED ...Plaintiff
And
Sri Syed Arif Mohiuddin ...Defendant
To
Sri Syed Arif Mohiuddin, S/o. Syed Lateef Mohiuddin, R/o. H.No. 12-2-361/A, Asif Nagar, Near Iqbal Clinic, Asifnagar, Hyderabad - 500028 Telengana.

Please take notice that the Plaintiff herein has filed the above suit against you for Recovery of money, before the court of the Hon'ble VII Junior Civil Judge, City Civil Court at Hyderabad and the same is posted for your appearance on **28-11-2023.** Therefore you are hereby directed to appear before the said court on **28-11-2023,** either in person or through an advocate at **10:30 AM** or else the matter will be decided ex-parte.

(BY ORDER OF THE COURT)
Sd/-
R. RAJENDRA PRASAD
Advocate

B.N. RATHI SECURITIES LIMITED

Corporate Member: NSE, BSE & MCX
Corporate Office: # 6-3-652, IV Floor, "Kautilya", Amrutha Estates, Somajiguda, Hyderabad -82, **Tel: 040 - 40527777, 40727777, Fax: 040 - 40526283.**
e-mail: bnrsl@bnrsecurities.com www.bnrsecurities.com CIN: L65993TG1985PLC005838

30.09.2023తో ముగిసిన త్రైమాసికం/ కాలవ్యవధి కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు (స్టాండ్‌అలోన్ & కన్సాలిడేటెడ్) సారాంశం (రూ.లక్షల్లో)

వివరాలు	స్టాండ్‌అలోన్						కన్సాలిడేటెడ్					
	ముగిసిన త్రైమాసికం			ముగిసిన అర్థ సంవత్సరం		ముగిసిన సంవత్సరం	ముగిసిన త్రైమాసికం			ముగిసిన అర్థ సంవత్సరం		ముగిసిన సంవత్సరం
	30.09.2023 (Unaudited)	30.06.2023 (Unaudited)	30.09.2022 (Unaudited)	30.09.2023 (Unaudited)	30.09.2022 (Unaudited)	31.03.2023 (Audited)	30.09.2023 (Unaudited)	30.06.2023 (Unaudited)	30.09.2022 (Unaudited)	30.09.2023 (Unaudited)	30.09.2022 (Unaudited)	31.03.2023 (Audited)
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర)	1404.28	1215.34	1153.44	2619.62	2284.70	4646.06	1456.14	1242.05	1155.31	2698.18	2292.93	4679.83
పన్నుకు ముందు సాధారణ కార్యకలాపాల నుండి నికర లాభం/(నష్టం)	385.06	275.07	280.47	660.13	503.10	1044.68	422.27	295.47	284.85	718.19	504.70	1038.10
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (అసాధారణ ఐటంల తరువాత)	288.06	205.61	211.82	493.67	380.40	746.93	315.86	220.63	216.16	536.50	381.91	757.93
ఈక్విటీ వాటా మూలధనం	840.00	840.00	840.00	840.00	840.00	840.00	840.00	840.00	840.00	840.00	840.00	840.00
రిజర్వులు (గత సంవత్సరం యొక్క బ్యాలెన్స్ షీట్స్‌లో చూపినట్లుగా రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహాయించి)	-	-	-	-	-	-	-	-	-	-	-	-
వాటా ఒక్కింటికి రాబడి (అసాధారణ ఐటంలకు ముందు) (రూ.10/- చొప్పున) బేసిక్ మరియు డైల్యూటెడ్	-	-	-	-	-	-	-	-	-	-	-	-
వాటా ఒక్కింటికి రాబడి (అసాధారణ ఐటంల తరువాత) (రూ.10/- చొప్పున) బేసిక్ మరియు డైల్యూటెడ్	3.43	2.45	2.52	5.88	4.53	8.89	3.76	2.63	2.57	6.39	4.55	9.02

గమనికలు :

1. కంపెనీచే స్థిరంగా అనుసరించిన అకౌంటింగ్ విధానాలను అనుసరించి పై పేర్కొన్న ఫలితాలు ఉన్నాయి. (ఐఎన్‌డి ఏఎస్) మరియు భారతదేశంలో సాధారణంగా ఆమోదించిన ఇతర అకౌంటింగ్ విధానాలు మరియు సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ)చే జారీచేయబడిన మార్గదర్శకాలతో క్రింద జారీచేయబడిన సంబంధిత రూల్స్‌తో చదవబడే కంపెనీల చట్టం, 2013 (ది చట్టం) యొక్క సెక్షన్ 133 క్రింద ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను అనుసరించి ఈ ఫలితాలు కలవు.
2. పై ఆడిట్‌చేసిన స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు సిఫారసు చేయబడినవి మరియు సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్), రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 నియమాలను అనుసరించి 10 నవంబర్, 2023న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి. స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలపై పరిమిత సమీక్షను చట్టబద్ధమైన ఆడిటర్లు నిర్వహించారు మరియు దానిపై మార్పులులేని ముగింపును వ్యక్తపరిచారు.
3. కంపెనీ ప్రాథమికంగా ఈక్విటీ బ్రోకింగ్ మరియు సంబంధిత సర్వీసులను నిర్వహిస్తున్నది. 'ఆపరేటింగ్ సిస్టం'పై ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్ 108 నియమాలను అనుసరించి ఇతర రిపోర్టబుల్ సెగ్మెంట్లు లేవు.
4. కంపెనీకి పూర్తి స్వంతమైన సబ్సిడరీలు- బి.ఎన్.రాతి కంట్రోడ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి 30 సెప్టెంబర్, 2023తో ముగిసిన అర్థ సంవత్సరానికి రూ. 58,05,370 యొక్క పన్నుకు ముందు లాభం నమోదు చేసింది.
5. ప్రస్తుత కాలవ్యవధుల వర్గీకరణకు పోల్చుటకు వీలుగా గత కాలవ్యవధుల అంకెలు అవసరమైనచోట రీగ్రూప్/ రీఅరేంజ్‌చేయబడినవి.

త్రైమాసికం ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్: www.bseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.bnrsecurities.com పై అందుబాటులో ఉన్నాయి.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10-11-2023

for B N Rathi Securities Limited
సం/-
హరి నారాయణ్ రాఠి
మేనేజింగ్ డైరెక్టర్

CDG Petchem Limited

Chandanlara Dugar Group — CDG PETCHEM LIMITED

Regd. & Corp Office: Shyam Arihant, 1-8-304 to 307/10&11, Pattigadda Road, Secunderabad-500003
Telangana, India, Tel: 040-27909001, 66494900/1/2, Email: corporate@dugargroup.net
CIN:L51100TG2011PLC072532

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం కొరకు స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం

(రూ.లక్షల్లో)

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్				కన్సాలిడేటెడ్			
					ముగిసిన సంవత్సరం	ముగిసిన త్రైమాసికం			ముగిసిన సంవత్సరం
		ఆడిట్ చేయనివి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేసినవి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేసినవి
		30.09.2023	30.06.2023	30.09.2022	31.03.2023	30.09.2023	30.06.2023	30.09.2022	31.03.2023
1.	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర)	480.99	475.77	576.54	2,404.07	1,172.76	1,064.54	1,432.01	5,133.10
2.	పన్నుకు ముందు నికర లాభం	(0.64)	1.60	0.60	(44.39)	1.92	2.79	(8.01)	(41.57)
3.	పన్నుల తరువాత నికర లాభం	(2.75)	1.14	23.81	(41.42)	(0.02)	2.50	15.31	(38.06)
4.	కాలవ్యవధి కొరకు మొత్తం సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత))	(2.75)	1.14	23.81	(41.42)	(0.02)	2.50	15.31	(38.06)
5.	ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.10/- చొప్పున)	307.75	307.75	307.75	307.75	307.75	307.75	307.75	307.75
6.	బ్యాలెన్స్ షీట్స్‌లో చూపినట్లుగా ఇతర ఈక్విటీ				(130.99)				(145.73)
7.	కాలవ్యవధి కొరకు వాటా ఒక్కింటికి రాబడి (ముఖ విలువ రూ.10/- చొప్పున) బేసిక్ & డైల్యూటెడ్ (రూ.)	(0.09)	0.04	0.77	(1.35)	(0.00)	0.08	0.50	(1.24)

కంపెనీకి పై పేర్కొన్న కాలవ్యవధుల కొరకు రిపోర్టుకు ఏదేవి మినహాయింపుగల లేదా అసాధారణ ఐటంలు లేవు.

గమనికలు:

1. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీతో దాఖలుచేయబడిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క వివరించిన ఫార్మాట్‌కు పై పేర్కొన్న వాటికి సారాంశం. త్రైమాసికం యొక్క ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్లు: (www.bseindia.com) మరియు కంపెనీ వెబ్‌సైట్: (www.procurepoint.in) పై కూడా లభించును.
2. సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం కొరకు ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు సిఫారసు చేయబడినవి మరియు ఆ తరువాత 10 సెప్టెంబర్, 2023న నిర్వహించబడిన వారి సంబంధిత సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి. కంపెనీ యొక్క ఆడిటర్లు ఆర్థిక ఫలితాలకు సంబంధించి పరిమిత సమీక్షను నిర్వహించారు.
3. ప్రస్తుత కాలవ్యవధుల అంకెలను పోల్చుటకు వీలుగా అవసరమైనచోట గత కాలవ్యవధుల అంకెలు రీగ్రూప్/ రీక్లాసిఫైడ్ చేయబడినవి.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10 సెప్టెంబర్, 2023

ProcurePoint E-Sourcing

For CDG Petchem Limited
సం/-
మనోజ్ కుమార్ దుగర్
మేనేజింగ్ డైరెక్టర్
DIN: 00352733

Regency Ceramics Limited

CIN : L26914TG1983PLC004249
Corporate Office : 4th Floor, Dwaraka Summit, Plot No.83, Survey No. 43 to 46 & 48, Kavuri Hills, Jubilee Hills, Hyderabad - 500033
Email ID : support@regencyceramics.in Website: www.regencyceramics.in

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం			ముగిసిన అర్థ సం॥నికి		ముగిసిన సంవత్సరం
	30.09.2023	30.06.2023	30.09.2022	30.09.2023	30.09.2022	31.03.2023
	(ఆడిట్‌చేయనివి)					(ఆడిట్‌చేసినవి)
1 ఆపరేషన్ల నుండి ఆదాయం (నికర)	24.26	15.97	-	40.22	-	4.08
2 కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను & మినహాయింపుగల ఐటంలకు ముందు)	(156.34)	(212.44)	(124.22)	(368.78)	(253.91)	(300.94)
3 కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్నుకు ముందు మినహాయింపుగల ఐటంల తరువాత)	(156.34)	(255.44)	(124.22)	(411.78)	(253.91)	(1,564.28)
4 పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల ఐటంల తరువాత)	(156.34)	(255.44)	(124.22)	(411.78)	(253.91)	(1,564.28)
5 మినహాయింపుగల ఐటంలు (ఆదాయం)	-	(43.00)	-	(43.00)	-	(1,263.34)
6 కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	(156.34)	(255.44)	(124.22)	(411.78)	(253.91)	(1,564.28)
7 ఈక్విటీ వాటా మూలధనం	2,644.16	2,644.16	2,644.16	2,644.16	2,644.16	2,644.16
8 గత సంవత్సరపు ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్స్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వులు మినహాయించి)	-	-	-	-	-	(7,897.90)
9 వాటా ఒక్కింటికి రాబడి (వార్షికం కానిది)						
బేసిక్: (రూపాయలు)	(0.59)	(0.97)	(0.47)	(1.56)	(0.96)	(5.92)
డైల్యూటెడ్: (రూపాయలు)	(0.59)	(0.97)	(0.47)	(1.56)	(0.96)	(5.92)

గమనిక: సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీతో దాఖలుచేసిన ముగిసిన త్రైమాసికానికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. ముగిసిన త్రైమాసికానికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్స్: (www.bseindia.com) & (www.nseindia.com) మరియు కంపెనీ వెబ్‌సైట్: www.regencyceramics.in పై కూడా అందుబాటులో ఉన్నాయి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఉత్తర్వుల మేరకు
For Regency Ceramics Limited
సం/-
సత్యేంద్ర ప్రసాద్ సరాల
మేనేజింగ్ డైరెక్టర్ మరియు సిఎఫ్ఓ

ప్రదేశం: హైదరాబాద్
తేది: 09-11-2023

Ramky Infrastructure Limited

CIN: L74210TG1994PLC017356
Regd. Office: 15th Floor, Ramky Grandiose, Sy. 136/2 & 4, Gachibowli, Hyderabad - 500032 **Ph:** 040 - 23015000 **Fax:** 040-23015100; **website:** www.ramkyinfrastructure.com; **E-mail:** secr@ramky.com

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్థ సంవత్సరానికి స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం (పూర్తి మొత్తాలు రూ.మిలియన్లలో షేర్ డేటా మినహా)

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్						కన్సాలిడేటెడ్					
		ముగిసిన త్రైమాసికం			ముగిసిన అర్థ సం॥నికి		ముగిసిన సం॥	ముగిసిన త్రైమాసికం			ముగిసిన అర్థ సం॥నికి		ముగిసిన సం॥
		30.09.2023	30.06.2023	30.09.2022	30.09.2023	30.09.2022	31.03.2023	30.09.2023	30.06.2023	30.09.2022	30.09.2023	30.09.2022	31.03.2023
		(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేసినవి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేసినవి)
1	పూర్తి ఆదాయం	5,637.15	5,537.55	3,510.71	11,174.69	6,971.08	15,712.68	6,224.51	5,942.11	3,879.42	12,166.61	7,969.85	18,665.60
2	కాలవ్యవధి కొరకు నికర లాభం (పన్ను మరియు మినహాయింపుగల ఐటంలకు ముందు)	1,584.82	1,415.51	691.70	3,000.34	1,360.45	3,010.58	1,635.84	1,430.91	119.82	3,066.75	412.26	947.72
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల ఐటంల తరువాత)	1,584.82	1,415.51	691.70	3,000.34	1,360.45	3,010.58	1,635.84	1,430.91	119.82	3,066.75	412.26	13,891.74
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల ఐటంల తరువాత)	1,214.94	1,064.01	500.54	2,276.97	993.10	2,144.70	1,206.20	1,052.98	552.98	2,259.18	636.37	11,526.35
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	1,212.69	1,067.54	498.87	2,280.25	989.44	2,139.46	1,203.92	1,056.26	551.31	2,260.18	632.71	11,520.72
6	ఈక్విటీ వాటా మూలధనం	691.98	691.98	691.98	691.98	691.98	691.98	691.98	691.98	691.98	691.98	691.98	691.98
7	ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపించినట్లుగా (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహాయించి) రిజర్వులు						8,306.77						13,424.82
8	వాటా ఒక్కింటికి రాబడి (ముఖ విలువ రూ.10/-ల చొప్పున) (కొనసాగుతున్న & నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)												
	1. బేసిక్: (రూ)	17.56	15.38	7.23	32.93	14.35	30.99	16.28	14.64	7.51	30.92	8.19	164.83
	2. డైల్యూటెడ్: (రూ)	17.56	15.38	7.23	32.93	14.35	30.99	16.28	14.64	7.51	30.92	8.19	164.83
		వార్షికం కానిది						వార్షికం కానిది					

గమనికలు:

1. పై పేర్కొన్న ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 09 నవంబర్, 2023న నిర్వహించబడిన వారి సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.
2. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీతో దాఖలుచేయబడిన ముగిసిన 30.09.2023తో త్రైమాసిక మరియు అర్థ సంవత్సరానికి ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మెట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నది. ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజిల వెబ్‌సైట్ పేర్లు అనగా, (www.bseindia.com) మరియు (www. nseindia.com) మరియు కంపెనీ వెబ్‌సైట్: www.ramkyinfrastructure.com పై అందుబాటులో ఉన్నాయి.

For Ramky Infrastructure Limited
సం/-
వై ఆర్ నాగరాజా
మేనేజింగ్ డైరెక్టర్
DIN: 00009810

ప్రదేశం: హైదరాబాద్
తేది: 09-11-2023

ఆ ముగ్గురే హాట్‌టాపిక్

రెండేసి చోట్ల పోటీ ఎందుకో..!?

- ఏదీ ఉంచుకుంటారు ? ఏదీ వదిలేస్తారు ?



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో ముగ్గురు కీలకనేతలు రెండేసి నియోజకవర్గాల నుంచి పోటీచేస్తున్నారు. వారెవరో అందరికి తెలిసిందే. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సిట్టింగ్ సీటు గజ్వేల్‌తోపాటు కొత్తగా కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల బరిలోకి దిగారు. అలాగే టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి కొడంగల్‌తోపాటు కామారెడ్డి నుంచి రంగంలో ఉన్నారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్ తన పాత సీటు హుజురాబాద్‌తోపాటు గజ్వేల్ నుంచి ఎన్నికల గోదాలోకి దూకారు. ముగ్గురు నేతలు తమ తమ సిట్టింగ్ సీట్ల నుంచి పోటీపడుతూనే అదనంగా మరో నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. సీఎం కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ ఇటు రేవంత్, అటు ఈటల పోటీపడుతున్నారు. కాకపోతే రేవంత్ కామారెడ్డి నుంచి, ఈటల గజ్వేల్ సీటులో కేసీఆర్‌కు ప్రత్యర్థులుగా ముందుకొస్తున్నారు. వీరు ముగ్గురు రెండేసి చోట్లా పోటీచేయడంపై రాష్ట్రమంతా చర్చ జరుగుతున్నది. ఎందుకనేది సుస్పష్టం. రాజకీయ వైరం. పార్టీల విధానాలు. వ్యక్తిగత అంశాలు కూడా ఇమిడి ఉన్నాయి. ఈటల రాజేందర్ మాత్రం 'నన్ను హేళన చేసినందుకే' గజ్వేల్ బరిలోకి వచ్చానని స్పష్టం చేశారు. బతికుండగానే నాకు నరకం చూపించారంటూ వ్యక్తిగత కక్ష సాధింపు తరహాలో మాట్లాడుతున్నారు. అలాగే రేవంత్ విషయంలోనూ అనేక కారణాలు ఉన్నాయని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. తెలంగాణ ఇచ్చిన తర్వాత బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తా అని మాట ఇచ్చి మోసం చేశారనే కోపం ఇంకా ఉంది. అంతేగాక కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబం సోనియా, రాహుల్‌పై తరచుగా రాజకీయ విమర్శలకు పూనుకుంటున్నారు. ఇది ఏమాత్రం కాంగ్రెస్‌కు నచ్చడం లేదు. అంతేగాక రేవంత్‌కు వ్యక్తిగత వైరం అందరికి తెలిసిందే. ఓటుకు నోటు కేసులో పక్కా ప్లాన్ ప్రకారం ఇరికించి జైలుకు పంపారనే విమర్శ ఉండనే ఉంది. గురువారం పాలకుర్తి కాంగ్రెస్ సభలో రేవంత్ మాట్లాడుతూ 'నేను జైలుకు పోవడానికి ఎర్రబెల్లి దయాకర్‌రావే కారణమనీ, ఆయనే కేసీఆర్‌కు సహకరించారని' బాహాటంగానే చెప్పారు. వేర్వేరు సీట్లల్లో కేసీఆర్‌ను అడ్డుకోవడానికి, ఇబ్బంది పెట్టడానికే రేవంత్, ఈటల రాజకీయ వ్యూహాల ప్రకారం పోటీలోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే పోటీ చేస్తున్న రెండేసీ సీట్లల్లో ఎవరు ఎక్కడి నుంచి గెలుస్తారనేది అందరికి స్పష్టత ఉంది. కేసీఆర్ రెండు చోట్లా విజయం సాధిస్తారనే వ్యాఖ్యానాలు ఉండనే ఉన్నాయి. ఆయన మళ్లీ గజ్వేల్ సీటు నుంచే ఎమ్మెల్యేగా కొనసాగుతారనీ, కామారెడ్డిని తన కూతురు కవితకు అప్పగిస్తారనే ప్రచారం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జరుగుతున్నది. విపక్షాలూ ఇదే మాట అంటున్నాయి. ఇక ఈటల, రేవంత్‌లు ఇద్దరూ కేసీఆర్‌పై పోటీచేసినా ఓడిపోక తప్పదనీ, కాకపోతే గట్టిపోటీ ఇస్తారనడంలో సందేహం లేదనేది విశ్లేషకుల మాట. కామారెడ్డిలో పోరు రసవత్తరం కానుంది. ఇక్కడి ఎన్నిక దేశాన్ని ఆకర్షిస్తున్నది. అందరి నోళ్లల్లో నానుతున్నది. వీరిరువురూ తిరిగి కొడంగల్, హుజురాబాద్‌కే పరిమితమవుతారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసలు సంగతి ఏంటంటే కామారెడ్డిలో కేసీఆర్ పోటీచేయడం వెనుక మర్మమేంటి ? అనే చర్చ కూడా జోరుగానే సాగుతున్నది. అక్కడ వేలాది ఎకరాల విలువైన భూములను కొల్లగొట్టడానికే ఎన్నికల బరిలో ఉన్నారనే విమర్శలు విపక్షాల నుంచి వస్తున్నాయి. వీటిని గులాబీ శ్రేణులు ఖండిస్తున్నాయి.

COVIDH TECHNOLOGIES LIMITED

CIN: L72200TG1993PLC015306

Regd. Off: B-2, Sai Krishna Building, Plot 797/A, Road 36, Jubilee Hills, Hyderabad, Telangana 500033

30.09.2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్థ సంవత్సరానికి లాభనష్టాల ఆడిట్‌చేయని నివేదిక (రూ॥ లక్షలలో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 30-9-2023	30-6-2023	30-9-2022	ముగిసిన అర్థ సంవత్సరానికి 30-9-2023	30-9-2022	ముగిసిన సం॥ 31.03.2023
I	ఆపరేషన్ల నుండి రెవెన్యూ	0.00	0.00	0.00	0.00	0.00	0.00
II	ఇతర ఆదాయం						0.00
III	పూర్తి రెవెన్యూ (1+2)	0.00	0.00	0.00	0.00	0.00	0.00
IV	వ్యయాలు వినియోగించిన మెటీరియల్ ధర	0.00	0.00	0.00	0.00	0.00	0.00
	స్టాక్‌ఇన్ ట్రేడ్‌లో కొనుగోలు మరియు ఫినిష్డ్ గూడ్స్, వర్క్ ఇన్‌ప్రోగ్రెస్ మరియు స్టాక్ ఇన్‌ట్రేడ్‌లో ఇన్వెంట రీలో మార్పులు						
	ఎంప్లాయి ప్రయోజన వ్యయాలు	0.00	0.00	0.00	0.00	0.00	0.00
	ఆర్థిక ఖర్చులు	0.00	0.00	0.00	0.00	0.00	0.00
	తరుగుదల మరియు విమోచనం వ్యయాలు	0.00	0.00	0.00	0.00	0.00	0.00
	ఇతర వ్యయాలు	2.74	1.14	5.50	3.88	7.65	0.11
	పూర్తి వ్యయాలు	2.74	1.14	5.50	3.88	7.65	0.11
V	మినహాయింపుగల మరియు అసాధారణ ఐటంలు మరియు పన్నుకు ముందు లాభం/(నష్టం) (3-4)	-2.74	-1.14	-5.50	-3.88	-7.65	-0.11
VI	మినహాయింపుగల ఐటంలు						
VII	మినహాయింపుగల ఐటంలు మరియు పన్నుకు ముందు లాభం/(నష్టం) (5-6)	-2.74	-1.14	-5.50	-3.88	-7.65	-0.11
VIII	అసాధారణ ఐటంలు						
IX	పన్నుకు ముందు లాభం/(నష్టం) (7-8)	-2.74	-1.14	-5.50	-3.88	-7.65	-0.11
X	పన్ను వ్యయాలు ప్రస్తుత పన్ను	0.00	0.00	0.00	0.00	0.00	0.00
	వ్యత్యాస పన్ను	0.00	0.00	0.00	0.00	0.00	0.00
XI	కొనసాగుతున్న ఆపరేషన్ల నుండి కాలవ్యవధి కొరకు లాభం/(నష్టం) (9-10)	-2.74	-1.14	-5.50	-3.88	-7.65	-0.11
XII	తీసివేత: మైనారిటీ వడ్డీ						
XIII	మైనారిటీ వడ్డీ తరువాత కాలవ్యవధి కొరకు లాభం/(నష్టం) (11-12)	-2.74	-1.14	-5.50	-3.88	-7.65	-0.11
XIV	ఇతర సమగ్ర ఆదాయం						
XV	పూర్తి సమగ్ర ఆదాయం	-2.74	-1.14	-5.50	-3.88	-7.65	-0.11
XVI	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం	30.00	30.00	30.00	30.00	30.00	30.00
XVII	వాటా ఒక్కింటికి రాబడి (ఈపిఎస్) బేసిక్	-0.91	-0.38	-1.83	-1.29	-2.55	-3.73
	డైల్యూటెడ్	-0.91	-0.38	-1.83	-1.29	-2.55	-3.73


గమనికలు:
1) పై ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద 10 నవంబర్, 2023న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.
2) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద మరియు ఇండియాలో సాధారణంగా ఆమోదించిన ఇతర అకౌంటింగ్స్ ప్రకటనలు మరియు దానిలోజారీచేసిన సంబంధిత రూల్స్‌తోచదవగల కంపెనీల చట్టం, 2013లో పేర్కొన్న ఐఎన్‌డి ఏఎస్-34 'ఇంటిరిమ్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్'లో పేర్కొన్నట్లుగా రికగ్నిషన్ మరియు మేసర్‌మెంట్ ప్రిన్సిపుల్స్‌ను అనుసరించి కంపెనీయొక్క ఫలితాలు సిద్ధం చేయబడినవి.
3) ఫలితాలు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.covidh.co.in లో కూడా లభించును.
4) కంపెనీ అనునది ఐటీ/ఐటీఇఎస్ బిజినెస్‌ను నిర్వహిస్తున్నది మరియు ఐఎన్‌డి ఏఎస్-108 ఆపరేటింగ్ సెగ్మెంట్ ప్రకారం వీడిగా రిపోర్టబుల్ సెగ్మెంట్లు లేవు.
5) సంబంధితకాలవ్యవధి యొక్క అంకెలు అనునవి ప్రస్తుత కాలవ్యవధి పోల్చుటకు వీలుగా అవసరమైనచోట అంకెలు రీగ్రూప్ మరియు రీక్లాసిఫైడ్ చేయబడినవి.

For COVIDH TECHNOLOGIES LIMITED
సం/-
గనప నర్సిరెడ్డి
డైరెక్టర్
DIN : 09482406

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10-11-2023

బీజేపీతో 3 ప్రాంతీయ పార్టీల మ్యాచ్ ఫిక్సింగ్

- సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- కరువుపై ఏపీ సీఎం ప్రకటన హాస్యాస్పదం
- 15న ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలి
- వైసీపీ సాధికారత నేతి బీరకాయ
- దళితులు, గిరిజనుల భూములు లాక్కుంటూ సామాజిక సంహారం చేస్తున్న వైసీపీ
- తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ వైఖరి స్పష్టం చేయాలి





విజయవాడలో జరిగిన ప్రజారక్షణభేరి బస్సు యాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న కె.లోకనాథం

అమరావతి: ఏపీలో వైసీపీ, జనసేన, టీడీపీ, బీజేపీ కలిసి మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయని, విచిత్ర రాజకీయ పరిస్థితి ఉందని ఏపీ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు పార్టీల మధ్య మాయ నడుస్తోందని అన్నారు. వైసీపీ, బీజేపీ నేతలు రాష్ట్రంలో తిట్టుకుంటున్నారని, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ పరస్పరం సహకరించుకుంటున్నాయని, మద్దతు ఇచ్చుకుంటున్నాయని, ఇదేమీ రాజకీయమని ప్రశ్నించారు. మూడోసారి మోడీ ప్రధాని కావాలని, అధికారంలోకి రావాలని పవన్‌కల్యాణ్ కోరుకుంటున్నారని, అదే బీజేపీ ఇక్కడ వైసీపీ ప్రభుత్వాన్ని నడిపిస్తోందనే విషయాన్ని గుర్తించాల న్నారు. రాష్ట్రంలో వైసీపీతో పోరాడుతున్నామని చెబుతున్న జనసేన కేంద్రంలో బీజేపీతో కలిసి పనిచేస్తోందని, ఇక్కడ తెలుగుదేశంతో కలిసి రాజకీయ ప్రచారం చేస్తోందని, తెలుగుదేశం కూడా జనసేనతో కలిసి నడుస్తామని చెబుతోందని అన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పోటీ చేయడం లేదని చెబుతుంటే దానితో ఏపీలో కలిసి పనిచేస్తున్న జనసేన అక్కడ బీజేపీతో కలిసి ఎన్నికల్లోకి వెళ్లిందని, ఎన్‌డిఎ కూటమిలోనూ ఉందని, ఈ నేపథ్యంలో తెలుగుదేశం నాయకులు బీజేపీ పట్ల వారి వైఖరి ఏమిటో చెప్పాలన్నారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ వైఖరి స్పష్టం చేయాలని కోరారు. మహిళలు, దళితులు, మైనార్టీలు, ఆదివాసీలను అణచివేస్తున్న బీజేపీకి మద్దతు ఇవ్వడం ద్వారా వారికి ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అన్ని నందర్భాల్లోనూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్న బీజేపీతో కలిస్తే ప్రజలకు న్యాయం చేయలేరని అన్నారు.

మరోవైపు రాష్ట్రంలో సాధికారత పేరుతో వైసీపీ చేస్తున్న యాత్ర నేతిబీరకాయ లాంటిదని, అందులో నెయ్యి ఎంత ఉంటుందో వీరి యాత్రలోనూ అంతే సాధికారత ఉంటుందని విమర్శించారు. ఏజెన్సీలో పోడు భూములపై గిరిజనులకు హక్కు పత్రాలు ఇచ్చారని, అక్కడ నుండి కూడా వెళ్లగొడుతున్నారని తెలిపారు. అటవీశాఖ అధికారులు గిరిజనులపై దౌర్జన్యం చేస్తుంటే ప్రభుత్వం చూస్తు ఊరుకుందని విమర్శించారు. ఈ భూములను పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి పేరుతో అదానీకి అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గ్రామసభలు జరపకుండా అంగుళం కూడా ఇవ్వబోమని గిరిజనులు తెగేసి చెబుతున్నారని అన్నారు. రాష్ట్రంలో 2.50 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉంటే వాటిపై పోరాడుతున్న దళితులకు పట్టాలు ఇవ్వకుండా సాధికారత ఎక్కడని ప్రశ్నించారు. పేదలకు భూ పంపకం, కనీస వేతనం, ఉపాధి కల్పన ఉంటేనే సాధికారత అన్నారు. ఆర్థిక సాధికారత కల్పించకుండా కార్పొరేషన్ పదవులు ఇస్తే వారు కార్లలో తిరగడం తప్ప ప్రజలకు జరిగే న్యాయం ఏమిటో చెప్పాలన్నారు. ఎన్నికలు దగ్గరకు వచ్చే కొద్దీ వైసీపీ వాళ్లు సామాజిక సాధికార యాత్ర పేరుతో హడావుడి చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఉద్ధరిస్తామని చెబుతున్నారని కానీ కార్యక్రమంలో గానీ, చేసిన పనుల్లో సామాజిక న్యాయం లేదని విమర్శించారు. ఇప్పటికీ గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటికలు లేవని తెలిపారు. 1235 జీఓను అమలు చేయకుండా సామాజిక సాధికారత గురించి మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. భూమిలేక పేదలు ఎక్కువ మంది కూలి పనులకు వెళ్లిపోతున్నారని, అటువంటి వారందరిలో ఎక్కువమంది దళిత, గిరిజన, మైనార్టీ, వెనుకబడిన తరగతుల వారే ఉన్నారని, వారికి భూమిపై హక్కు కావాలని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం ఇవ్వకుండా, ఉపాధి లేకుండా సాధికారత ఎక్కడ నుండి వస్తుందని ప్రశ్నించారు.

స్కిల్ కేసులో ఆ పేరు 'పొరపాటే'..



అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ ఏపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారు రాజేష్ పేరును పొరపాటున నిందితుడు అని తమ వెబ్‌సైట్‌లో పేర్కొన్నట్లు సీఐడీ హైకోర్టుకు తెలియజేసింది. ఆ పేరు తొలగింపునకు అధికారులకు మౌఖికంగా ఉత్తర్వులు ఇచ్చారని సీఐడీ తరఫున ప్రత్యేక పిపి వివేకానంద చెప్పారు. తన పేరును సాక్షి, ఆ తర్వాత నిందితుడిగా పేర్కొంటూ సీఐడీ వెబ్‌సైట్‌లో ఉండటాన్ని సవాల్ చేస్తూ రాజేష్ దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. తెలంగాణలో నివాసముండే పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చే అధికారం ఏపీ సీఐడీకి లేదని సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదించారు.

పిటిషనర్ కోసం లుక్‌ఔట్ నోటీసు కూడా ఇచ్చారన్నారు. పిటిషన్‌ను కొట్టేయాలని సీఐడీ కోరింది. కౌంటర్ వేసేందుకు గడువు కావాలని కోరడంతో విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది.

GAYATRI BIOORGANICS LIMITED

6-3-1090, TSR Towers, B Block, Third Floor, Rajbhavan Road, Somajiguda, Hyderabad-500082, Telangana.
Website: www.gayatribioorganics.com, CIN: L24110TG1991PLC013512

30.09.2023తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం 30-09-2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్థ సం॥నికి 30-09-2022 ఆడిట్‌చేయనివి	ముగిసిన సంవత్సరానికి 31-03-2023 ఆడిట్‌చేసినవి	ముగిసిన త్రైమాసికం 30-09-2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్థ సం॥నికి 30-09-2022 ఆడిట్‌చేయనివి	ముగిసిన సంవత్సరానికి 31-03-2023 ఆడిట్‌చేసినవి
ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం (నికర)	-	-	-	-	-	166.74
కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	(11.42)	(19.50)	(23.72)	(30.92)	(39.94)	(79.57)
పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల &/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(11.42)	(19.50)	(23.72)	(30.92)	(39.94)	(79.57)
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు /లేదా అసాధారణ ఐటంల తరువాత)	(11.42)	(19.50)	(45.19)	(30.92)	(61.41)	(101.04)
కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	(11.42)	(19.50)	(45.19)	(30.92)	(61.41)	(101.04)
ఈక్విటీ వాటా మూలధనం	7,878.81	7,878.81	7,878.81	7,878.81	7,878.81	7,878.81
ఇతర ఈక్విటీ					(11,327.36)	
-బేసిక్ మరియు డైల్యూటెడ్	(0.02)	(0.02)	(0.06)	(0.04)	(0.08)	(0.13)

గమనికలు:
1) సెబీ (లిస్టింగ్ ఒబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో దాఖలు చేయబడిన 30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం & అర్థ సంవత్సరానికి ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు సారాంశం పై విధంగా ఉన్నవి మరియు ఆడిట్‌చేయని ఫైనాన్షియల్ సిద్ధం చేయబడినవి. సదరు త్రైమాసికం ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్లు: (www.bseindia.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.gayatribioorganics.com పై అందుబాటులో ఉన్నవి.

బోర్డు ఉత్తర్వుల మేరకు
For Gayatri Bioorganics Limited
సం/-
డైరెక్టర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10-11-2023

7SEAS ENTERTAINMENT LIMITED

L72900TG1991PLC013074

30.09.2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్థ సంవత్సరానికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

క్ర. సం	వివరాలు	ముగిసిన త్రైమాసికం 30.09.2023 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 30.09.2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన అర్థ సంవత్సరానికి 30.09.2023 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన అర్థ సంవత్సరానికి 30.09.2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన సంవత్సరానికి 31.03.2023 (ఆడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	286.06	162.47	561.03	272.44	552.21
2	పన్నుకు ముందు సాధారణ కార్యకలాపాల నుండి నికర లాభం/(నష్టం)	23.06	19.22	48.02	28.76	53.23
3	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (అసాధారణ ఐటంలతరువాత)	23.06	19.22	48.02	28.76	53.23
4	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం సంవత్సరానికి నికర పన్ను	23.06	19.22	48.02	28.76	53.23
5	ఈక్విటీ వాటా మూలధనం	1866.01	1513.59	1866.01	1513.59	1513.59
6	వాటా ఒక్కింటికి రాబడి (రూ. 10/- చొప్పున)					
	(కొనసాగుతున్న & నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)					
	బేసిక్ :	0.12	0.13	0.26	0.19	0.35
	డైల్యూటెడ్ :	0.13	0.13	0.28	0.19	0.35

గమనికలు:
1) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అదర్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బిఎస్‌ఇ లిమిటెడ్‌తో దాఖలుచేసిన ఆడిట్‌చేయని త్రైమాసిక ఆర్థిక ఫలితాల వివరణాత్మక పైన పేర్కొన్నవి సారాంశం. వివరణాత్మక ఆర్థిక ఫలితాలు ఈ సారాంశం ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 10.11.2023న నిర్వహించిన వారి సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్‌డైరెక్టర్ల ఆమోదించబడినవి. ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు నివేదిక పూర్తి వివరాలు కంపెనీయొక్క వెబ్‌సైట్ (www.7seasent.com) మరియు బిఎస్‌ఇ లిమిటెడ్ వెబ్‌సైట్ (www.bseindia.com)లో లభించును.
2) ప్రస్తుత కాలవ్యవధుల వర్గీకరణ పోల్చుటకు వీలుగా అవసరమైనచోట గత కాలవ్యధుల అంకెలు రీగ్రూప్ చేయబడినవి.
3) గత సంవత్సరం/ కాలవ్యవధి అంకెలు అవసరమైనచోట రీగ్రూప్ చేయబడినవి.

For 7Seas Entertainment Limited
సం/-
(ఎల్.మారుతి శంకర్)
మేనేజింగ్ డైరెక్టర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10-11-2023

ఇండియన్ బ్యాంక్ మొఘల్‌రాజపురం బ్రాంచి, విజయవాడ.

इंडियन बैंक · इलाहाबाद ALLAHABAD

లాకర్స్ ప్రకటన

వ. నెం.	లాకర్ నెంబరు	పేరు మరియు చిరునామా
1	28/2	జయ చంద్ర ప్రసాద్ మండవ, 7-1-32/ఎ/9/1, ఈస్ట్ కోస్ట్ మినరల్స్ & యం.ఇ., శ్రీ నిలయం, లీలానగర్, అమీర్‌పేట, హైదరాబాద్ - 500016, తెలంగాణ

పైన పేర్కొన్న ఖాతాదారులు మా బ్రాంచ్ నందు లాకర్ సౌకర్యం పొందియున్నారు. వారు గత కొద్ది సంవత్సరాలుగా అద్దె బకాయి పడ్డారు. మరియు పై అడ్రస్‌కు పంపిన నోటీసులు తిరిగి వచ్చిన కారణంగా బ్యాంక్ నిబంధనల అనుసారం లాకర్స్ పగులగొట్టి అందులోని వస్తువులను స్వాధీనత తీసుకొనబడును. పై ఖాతాదారులు లేక వారికి సంబంధించిన వారెవరైనా ఈ ప్రకటనను నోటీసుగా భావించి సరైన ధృవపత్రాలతో ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి 15 రోజులలోగా బ్రాంచి చీఫ్ మేనేజర్ వారిని సంప్రదించగలరు.

తేది : 10-11-2023 సం/- చీఫ్ మేనేజర్

INCON ENGINEERS LIMITED

B-6/3, I.D.A., UPPAL, HYDERABAD-500039. CIN : L74210TG1970PLC001319

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్థ సంవత్సరానికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు (రూ.లక్షల్లో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 30-09-2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.06.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30-09-2022 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్థ సంవత్సరం 30-09-2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్థ సంవత్సరం 30-09-2022 ఆడిట్‌చేయనివి	ముగిసిన సంవత్సరం 31-03-2023 ఆడిట్‌చేసినవి
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	3.82	3.81	15.31	7.63	24.19	35.26
2	కాలవ్యవధిలో నికర లాభం/ (నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటెంలకు ముందు)	(13.37)	(11.36)	(7.27)	(24.73)	(14.48)	(35.73)
3	కాలవ్యవధి కొరకు నికర లాభం/ (నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల ముందు)	(13.37)	(11.36)	(7.27)	(24.73)	(14.48)	(35.73)
4	పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం/ (నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	(13.37)	(11.36)	(7.27)	(24.73)	(14.48)	(35.73)
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	(13.37)	(11.36)	(7.27)	(24.73)	(14.48)	(35.58)
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం	432.71	432.71	432.71	432.71	432.71	432.71
7	వాటా ఒక్కింటికి రాబడి (రూ. 10/- చొప్పున) (కొనసాగుతున్న & నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) బేసిక్ / డైల్యూటెడ్	(0.31)	(0.26)	(0.17)	(0.57)	(0.34)	(0.83)

గమనికలు:
1. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజితో దాఖలుచేయబడిన త్రైమాసికపు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మెట్ యొక్క సారాంశం. త్రైమాసిక ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్ www.bseindia.com పై అందుబాటులో ఉంటాయి.
2. పై పేర్కొన్న ఆడిట్‌చేయని ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు ఆ తరువాత 10 నవంబర్, 2023 నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.

for and on behalf of the Board of Directors,
సం/- శ్రీధర్ ఛాదరి
మేనేజింగ్ డైరెక్టర్
DIN: 00188924

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10-11-2023

VELJAN DENISON LIMITED

VELJAN

CIN: L29119TG1973PLC001670
Regd. Office: Plot No. 44, 4th Floor, HCL Towers, Begumpet, Hyderabad - 500 016., Phone: +91-40-2776 4546 Fax: +91-40-2776 5253
Web: www.veljan.in E-mail: info@veljan.in

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్థ సంవత్సరానికి ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల యొక్క సారాంశం

(రూ.లక్షల్లో ఇపిఎస్ మినహా)

వివరాలు	ముగిసిన త్రైమాసికం 30.09.2023	30.06.2023	30.09.2022	ముగిసిన అర్థ సంవత్సరం 30.09.2023	30.09.2022	ముగిసిన సంవత్సరం 31.03.2023
	(Un-audited)			(Un-audited)		Audited
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	3389.40	3203.71	3139.62	6593.11	5961.32	12057.74
కాలవ్యవధి కొరకు నికర లాభం పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంలకు ముందు)	632.99	798.04	671.45	1431.03	1286.29	2,160.63
పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	632.99	798.04	671.45	1431.03	1286.29	2,160.63
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం(మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	469.34	593.07	518.05	1062.40	973.15	1,602.38
కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	458.99	593.07	518.05	1052.05	973.15	1,602.38
ఈక్విటీ వాటా మూలధనం	225.00	225.00	225.00	225.00	225.00	225.00
గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రివాల్యుయేషన్ రిజర్వులు మినహాయించి) రిజర్వులు	-	-	-	-	-	18,518.39
వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) (రూ.లో) 1. బేసిక్ :	20.86	26.36	23.02	47.22	43.25	71.22
2. డైల్యూటెడ్ :	20.86	26.36	23.02	47.22	43.25	71.22

కంపెనీ యొక్క ఆడిట్‌చేయని స్టాండ్అలోన్ ఆర్థిక ఫలితాల యొక్క కీ నెంబర్లు:

(రూ॥ లక్షలలో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం 30.09.2023	30.06.2023	30.09.2022	ముగిసిన అర్థ సంవత్సరం 30.09.2023	30.09.2022	ముగిసిన సంవత్సరం 31.03.2023
	(Un-audited)					(Audited)
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	3104.51	2826.60	2887.20	5931.12	5708.90	11064.40
పన్నుకు ముందు లాభం	584.24	698.97	589.63	1283.21	1204.47	1976.49
పన్ను తరువాత లాభం	432.20	518.05	436.23	950.25	891.33	1458.17

గమనిక: సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బిఎస్ఇ లిమిటెడ్‌తో దాఖలు చేయబడిన 30 సెప్టెంబర్, 2023తో త్రైమాసికం మరియు అర్థ సంవత్సరానికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల (స్టాండ్అలోన్ & కన్సాలిడేటెడ్) యొక్క వివరణాత్మక నమూనాకు పై పేర్కొన్నవి సారాంశం. త్రైమాసికం ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి వివరాలు బిఎస్ఇ స్టాక్ ఎక్స్ఛేంజీ వెబ్‌సైట్ అనగా www.bseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ అనగా www.veljan.in పై కూడాను అందుబాటులో ఉన్నాయి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరఫున & కొరకు
సం/-
యు. శ్రీ క్రిష్ణ
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సిఇఒ
DIN: 08880274

ప్రదేశం: హైదరాబాద్
తేది: 09-11-2023

PALRED TECHNOLOGIES LIMITED

palred · pTron

Regd. Office: H.No. 8-2-703/2/B, Plot.No.2 Road.No.12, Banjara Hills, Hyderabad, Telangana- 500034.
Tele: +9140 67138810, Website:www.palred.com

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం & అర్థ సంవత్సరానికి ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ మరియు స్టాండ్అలోన్ ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

క్ర. సం	వివరాలు	ముగిసిన త్రైమాసికం 30-09-2023 ఆడిట్‌చేయనివి	30-06-2023 ఆడిట్‌చేయనివి	30-09-2022 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్థ సంవత్సరం 30-09-2023 ఆడిట్‌చేయనివి	30-09-2022 ఆడిట్‌చేయనివి	ముగిసిన సంవత్సరం 31.03.2023 ఆడిట్‌చేసినవి
1	ఆపరేషన్స్ నుండి పూర్తి ఆదాయం	4167.76	3305.38	4893.73	7473.14	8542.35	14802.01
2	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంలకు ముందు)	25.3	(117.80)	117.68	(92.50)	186.57	(44.84)
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	25.3	(117.80)	117.68	(92.50)	186.57	(44.84)
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	25.3	(117.80)	117.68	(92.50)	186.57	(44.84)
5	కాలవ్యవధి కొరకు మొత్తం సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	25.55	(122.69)	104.45	(97.14)	177.61	(36.58)
6	వాటా ఒక్కింటికి రాబడి రూ. 10/- చొప్పున (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)	0.22	(0.64)	0.99	(0.42)	1.54	(0.03)
7	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం/అసాధారణ ఐటంల	1223.26	1223.26	1056.59	1223.26	1056.59	1223.26
8	తరువాత (రూ. 10/- చొప్పున) (వార్షికం కానిది) బేసిక్:	0.22	(0.64)	0.99	(0.42)	1.54	(0.03)
	డైల్యూటెడ్	0.22	(0.64)	0.99	(0.42)	1.54	(0.03)

స్టాండ్అలోన్ ఆర్థిక ఫలితాలపై ముఖ్యమైన సమాచారం

		30-09-2023	30-06-2023	30-09-2022	30-09-2023	30-09-2022	
1	ఆపరేషన్స్ నుండి పూర్తి ఆదాయం	37.5	37.5	37.5	75	75	150
2	మినహాయింపుగల ఐటంలు మరియు పన్నుకు ముందు లాభం/(నష్టం)	34.74	75.11	35.19	109.85	49.33	173.02
3	పన్నుకు ముందు లాభం/(నష్టం)	34.74	75.11	137.7	109.85	151.84	275.53
4	పన్ను తరువాత లాభం/(నష్టం)	34.74	75.11	137.7	109.85	151.84	275.53
5	పూర్తి సమగ్ర ఆదాయం (కంప్రైసింగ్ లాభం/(నష్టం)	34.77	75.15	137.79	109.92	152.02	275.68
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం/అసాధారణ ఐటంల తరువాత (రూ.10/- చొప్పున) (వార్షికం కానిది)	1223.26	1223.26	1056.59	1223.26	1056.59	1223.26
7	తరువాత (రూ. 10/- చొప్పున) (వార్షికం కానిది) బేసిక్:	0.28	0.61	1.39	0.9	1.54	2.51
	డైల్యూటెడ్	0.28	0.61	1.36	0.9	1.5	2.51

గమనికలు:
1. పై ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 10 నవంబర్, 2023న నిర్వహించబడిన వారి సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.
2. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీలతో దాఖలుచేయబడిన 30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. 30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్థ సంవత్సరానికి స్టాండ్అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు ఎక్స్ఛేంజి వెబ్‌సైట్లు అనగా www.nseindia.com & www.bseindia.com పై మరియు కంపెనీ వెబ్‌సైట్: www.palred.com పై అందుబాటులో ఉంటాయి.

FOR PALRED TECHNOLOGIES LIMITED
సం/-
పి. సుప్రియ రెడ్డి
చైర్‌పర్సన్ & మేనేజింగ్ డైరెక్టర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10-11-2023

బిజినెస్

ఉద్యోగాల సృష్టికి 8% వృద్ధి కావాలి

- అప్పుడే తగినంత ఉపాధి
- శ్రామికులకు నైపుణ్యాలను పెంచాలి:

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్



న్యూఢిల్లీ: భారత్‌లో తగినంత ఉద్యోగుల ను సృష్టించడానికి ప్రస్తుత వృద్ధి రేటు సరిపోదని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశానికి తగినంత ఉద్యోగాలను సృష్టించడానికి జిడిపి 8 శాతం కంటే ఎక్కువ వేగంతో విస్తరించాల్సిన అవసరం ఉందని విశ్లేషించారు. శుక్రవారం జరిగిన ఓ ఆన్‌లైన్ మీటింగ్‌లో రాజన్ మాట్లాడుతూ.. "జనాభా అవసరాలు, ఉద్యోగాల ఆవశ్యకతను బట్టి భారత్ 8 శాతం నుంచి 8.5 శాతం వృద్ధిని సాధించాలి. ఇతర దేశాలతో పోలిస్తే 6 శాతం-6.5 శాతంతో ఆర్థిక వృద్ధి బలంగా ఉంది. కానీ మన ఉద్యోగాల అవస రానికి సంబంధించి ఇది ఇప్పటికీ కొంత నెమ్మదిగా ఉందని భావిస్తున్నాను. ఎందుకంటే మన దగ్గర చాలా మంది యువకులు ఉపాధి పొందవలసి ఉంది. ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థల కంటే భారత్ విస్తరణ ఎక్కువగా ఉన్నప్పటికీ.. దేశం ప్రతి సంవత్సరం శ్రామికశక్తిలో చేరే లక్షలాది మంది ప్రజలకు తగినంత ఉద్యోగాలను సృష్టించడం లేదు." అని రాజన్ అన్నారు.

ముంబయికి చెందిన పరిశోధన సంస్థ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ప్రకారం.. మొత్తం నిరుద్యోగిత రేటు అక్టోబర్‌లో 10.05 శాతానికి పెరిగింది. ఇది రెండేళ్ల గరిష్ట స్థాయికి చేరింది. హెచ్ఎస్‌బిసి అంచనా ప్రకారం దేశం రాబోయే 10 సంవత్సరాలలో 7 కోట్ల కొత్త ఉద్యోగాలను సృష్టించవల్సి ఉంటుంది. 7.5 శాతం వృద్ధితో ఉద్యోగాల సమస్యలో మూడింట రెండు వంతుల సమస్య మాత్రమే పరిష్కరించ బడు తుంది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలలో మూడోసారి అధికారంలోకి రావాలని భావిస్తున్న ప్రధాని మోడీకి అధిక నిరుద్యోగం ప్రధాన సవాల్‌గా నిలువనుంది. చైనా, వియత్నాంతో సహా ఇతర సమర్థవంతమైన ఉత్పాదక దేశాలతో పోటీ పడేలా భారత్ తన శ్రామికశక్తికి శిక్షణ ఇవ్వాలని రాజన్ సూచించారు. చిప్‌ల తయారీలో చైనా అద్భుతమైన ప్రగతిని కనబర్చుతుండగా.. భారత్ ఇప్పటికీ చాలా వెనుకబడి ఉందని రాజన్ పేర్కొన్నారు.

టాటా కొత్త హారియర్‌కు బుకింగ్స్ షురూ..

ముంబయి : టాటా మోటార్స్ తన కొత్త హారియర్, సఫారీ మోడళ్ల కోసం బుకింగ్‌లను ప్రారంభించినట్లు శుక్రవారం ప్రకటించింది. అత్యాధునిక సాంకేతికత, సాటిలేని భద్రతా ఫీచర్లు, వినూత్నతతో అందుబాటులోకి తెచ్చిన కొత్త హారియర్, సఫారీలు డ్రైవింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపర్చినట్లు పేర్కొంది. వినియోగదారులు తాము ఎంపిక చేసుకున్న ఎస్‌యువిలను అన్ని అధీకృత తమ డీలర్‌షిప్‌లలో లేదా కంపెనీ వెబ్‌సైట్‌లో కేవలం రూ.25,000లతో బుక్ చేసుకోవచ్చని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండి శైలేష్ చంద్ర పేర్కొన్నారు.

హీరో గ్రూప్ ఛైర్మన్ నివాసంలో ఇడి సోదాలు



న్యూఢిల్లీ : దిగ్గజ ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్ ఛైర్మన్ పవన్ ముంజల్ నివాసాల్లో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలు చేసింది. మనీ ల్యాండరింగ్ కేసులో సోదాలు చేసిన ఇడి రూ. 24 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేసింది. ఢిల్లీలో పవన్ ముంజల్‌కు చెందిన మూడు స్థిరాస్తులను పిఎంఎల్ఎ నిబంధన ల కింద స్వాధీనం చేసుకుంది. పవన్ ముంజాల్ సహా ఇతరులు భారత్ నుంచి విదేశీ నగదును అక్రమంగా తరలించారనే ఆరోపణలపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) ఫిర్యాదు ఆధారంగా ఇడి దర్యాప్తు చేస్తోంది. ఇంతక్రితం ఆగస్టు 1న కూడా ఇడి పవన్ ముంజల్ నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేసి రూ.25 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. దీంతో సీజ్ చేసిన మొత్తం ఆస్తులు రూ.50 కోట్లకు చేరాయి.

గ్రాన్యూల్స్ ఇండియాకు రూ.102 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 102.10 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికం లాభాలు రూ.145 కోట్లతో పోల్చితే 30 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. క్రితం క్యూ2లో గ్రాన్యూల్స్ ఆదాయం 3.4 శాతం పెరిగి రూ.1,189.50 కోట్లుగా నమోదయ్యింది. తమ కంపెనీ ఐటి భద్రతను మెరుగుపర్చుతున్నామని గ్రాన్యూల్స్ ఇండియా సిఎండి డాక్టర్ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి పేర్కొన్నారు. గడిచిన త్రైమాసికంలో ఆ కంపెనీ షేర్ 19 శాతం మేర పెరిగింది.

ఆకాశ ఎయిర్ 'దీపావళి స్పెషల్ మీల్'

న్యూఢిల్లీ : దీపావళి పండుగ సందర్భంగా తమ సంస్థలో ప్రయాణించే వారికి ప్రత్యేక భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు ఆకాశ ఎయిర్ తెలిపింది. ఆకాశ ఎయిర్ ఆన్‌బోర్డ్ మీల్ సర్వీస్ అయిన కేఫ్ ఆకాశ 'దీపావళి స్పెషల్ మీల్'ని ప్రవేశపెట్టినట్లు పేర్కొంది. నవంబర్ చివరి వరకు సాంప్రదాయ మటర్ కే చోలే, మూంగ్ దాల్ కచోరీ, మోతీచూర్ లడ్డు, తమకిష్టమైన పానీయాల ఎంపికలతో కూడిన రుచులను అస్వాదించవచ్చని పేర్కొంది.

బయోజెనోమిక్స్‌తో యుఎస్‌వి భాగస్వామ్యం



బెంగళూరు: దేశంలో మధు మేహంతో బాధపడుతున్న వారి కోసం తొలిసారి బయోసిమిలర్ ఇన్సులిన్ అస్పార్ట్ అయినా ఇన్సూక్విక్ విడుదల కోసం బయో జెనోమిక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు యుఎస్‌వి ప్రయివేటు లిమిటెడ్ వెల్లడించింది. మధు మేహం ఉన్నవారి చికిత్స అవకాశాలను ఇది మెరుగుపరుస్తుందని పేర్కొంది. ఇన్సూక్విక్ 100 శాతం భారత్‌లో తయారు చేయబడిందని పేర్కొంది. దేశంలో 10.1 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారని అంచనా.

ఎల్‌ఐసికి రూ.7,925 కోట్ల నికర లాభాలు

హైదరాబాద్ : దిగ్గజ బీమా కంపెనీ ఎల్‌ఐసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.7,925 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.15,952 కోట్ల లాభాలతో పోల్చితే దాదాపు 50 శాతం తగ్గుదలను చవి చూసింది. గడిచిన క్యూ2లో సంస్థ నికర ప్రీమియం ఆదాయం రూ.1,07,397 కోట్లుగా చోటు చేసుకుంది.

గతేడాది ఇదే క్యూ2లో రూ.1,32,631.72 కోట్ల నికర ప్రీమియం నమోదయ్యింది. ఇదే సమయంలో రూ.2,22,215 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. 2023 సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.2,01,587 కోట్లుగా చోటు చేసుకుంది. క్రితం క్యూ2లో పెట్టుబడులపై నికర ఆదాయం రూ.93,942 కోట్లకు పెరిగింది. ఇది 2022-23లో రూ.84,104 కోట్లుగా నమోద య్యింది. ఇదే సమయంలో స్థూల నిరర్థక ఆస్తులు 5.60 శాతంగా ఉండగా.. 2023 సెప్టెంబర్ ముగింపు నాటికి 2.43 శాతానికి తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో ఎల్‌ఐసి రికార్డ్ స్థాయిలో రూ.17,469కోట్ల లాభాలు ఆర్జించింది. గతేడాది ఇదే కాలంలో రూ.16,635 కోట్ల లాభాలు నమోదు చేసింది.



గాజాలో కాల్పుల విరమణకు అవకాశమే లేదు : బైడెన్



ఇజ్రాయిల్‌కు, గాజాలోని హమస్‌కు మధ్య కాల్పుల విరమణ జరిగే ఆశ లేదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నాడు. గురువారంనాడు అధ్యక్ష భవనమైన వైట్ హౌస్ బయట మీడియాతో మాట్లాడుతూ కాల్పుల విరమణకు అవకాశమే లేదని ఆయన అన్నాడు. హమస్ ను నాశనం చేసేదాకా ఇజ్రాయిల్ కాల్పుల విరమణ చేయటానికి సిద్ధంగా లేదని, గత మూడు రోజులుగా దీర్ఘ కాల్పుల విరణమణకు తాను ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదని బైడెన్ తన "ఎయిర్ ఫోర్స్ ఒన్" విమానం ఎక్కేముందు మీడియాకు చెప్పాడు.ఇప్పటివరకూ మానవతా సహాయం అందించేందుకు ఇజ్రాయిల్ అప్పుడప్పుడు కాల్పులకు విరామం ఇస్తున్నదని, ఇదే "పెద్ద ముందడుగు" అని అమెరికా జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి జాన్ కిర్బీ ఒక పత్రికా సమావేశంలో చెప్పాడు. ప్రతిరోజు ఉత్తర గాజాలో నాలుగు గంటలపాటు ఇజ్రాయిల్ కాల్పులను ఆపుతోంది. అలా ఆపటానికి మూడు గంటల ముందు కాల్పులను ఆపే సమయాన్ని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటిస్తోందని కిర్బీ రిపోర్టర్లకు చెప్పాడు. ఇలా చేయటం కూడా గురువారం నుంచే ప్రారంభమైంది. ఇజ్రాయిల్ దక్షిణ ప్రాంతంపైన అక్టోబర్ 7వ తేదీనాడు హమస్ చేసిన మెరుపుదాడిలో అనేక వందలమంది చనిపోయారు. అనేక మంది హమస్ బందీలుగా ఉన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోను కాల్పుల విరమణకు అంగీకరించేది లేదని ఇజ్రాయిల్ పదేపదే ప్రకటిస్తోంది. బంధీలను వదిలేదాకా కాల్పుల విరమణ ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతాన్యాహు అనేక సార్లు ప్రకటించాడు. అయితే ప్రయివేటు సంభాషణలో బంధీలను విడుదల చేసినప్పటికీ కాల్పుల విరమణ జరిపేది లేదని ఇజ్రాయిల్ చెబుతోంది. కొందరు బంధీలను మార్పిడి చేయటం కోసం ఐదు రోజులపాటు కాల్పుల విరమణ చెయ్యాలనే ప్రతిపాదనను నెతాన్యాహు ఇప్పటికే తిరస్కరించాడని లండన్ నుంచి వెలువడే ద గార్డియన్ పత్రిక రాసింది. పిల్లలను, మహిళలను, వృద్ధులను విడిపించాలనే ప్రయత్నం జరిగినప్పుడు కూడా నేతాన్యాహు కాల్పుల విరమణకు తిరస్కరించాడు.

ప్రపంచ సమకాలీనం

మాంద్యం అంచున యూరోపియన్ యూనియన్

వర్తమాన సంవత్సరాంతానికి యూరోపియన్ యూనియన్ మాంద్యంలో మునిగిపోనున్నదని మాజీ ఇటాలియన్ ప్రధాని, మాజీ యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు(ఇసిబి) అధ్యక్షుడు మారియో డ్రాగీ ఫైనాన్షియల్ టైమ్స్ కి చెప్పాడు. జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో యూరోజోన్ ఆర్థిక వ్యవస్థ అంతకు ముందటి త్రైమాసికంతో పోల్చినప్పుడు 0.1శాతం కుదింపుకు గురైందని గణాంకాల ఏజన్సీ యూరోస్టాట్ అంచనా వేసింది. వర్తమాన సంవత్సరాంతానికి యూరో జోన్ లో మాంద్యం వస్తుందని, రానున్న సంవత్సరంలోని మొదటి రెండు త్రైమాసికాలలో ఈ విషయం బయటపడుతుందని డ్రాగీ అన్నట్టు ఫైనాన్షియల్ టైమ్స్ రాసింది.2011-2019మధ్యకాలంలో మారియో డాగీ యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేశాడు. తక్కువ స్థాయి ఉత్పాదకత, ఇందన వ్యయం చాలా ఎక్కువగా పెరిగిపోవటం, తగినంత ప్రావీణ్యతగల శ్రామికులు లేకపోవటంవంటి కారణాలవల్ల యూరోపియన్ యూనియన్ మాంద్యంలోకి జారుకోబోతోందని ఆయన విశ్లేషించాడు. గత 20సంవత్సరాలుగా అమెరికా, చైనా, దక్షిణ కొరియా, జపాన్‌లతో యూరోప్ పోటీపడలేకపోతున్నదని కూడా ఆయన అన్నాడు.తగినంతగా డిమాండ్ లేకపోవటంవల్ల యూరోజోన్ ఆర్థిక వ్యవస్థ గత మూడు సంవత్సరాలుగా వేగంగా కుదింపుకు గురౌతోందని తాజాగా విడుదలైన ఎస్ అండ్ పి గ్లోబల్ నివేదిక తెలియజేస్తోంది. వ్యాపార కార్యకలాపాలను స్థాయిని కొలిచే పర్చేజింగ్ మేనేజర్స్ సూచిక(పిఎమ్ఐ) ప్రకారం సెప్టెంబర్ లో 47.2 పాయింట్లున్న సూచిక అక్టోబర్ లో 46.5 పాయింట్లకు పడిపోయింది. ఇది ఉత్పత్తి పతనాన్ని సూచిస్తోంది. వరుసగా ఐదు నెలల పాటు ఈ సూచిక 50 పాయింట్ల నుంచి పతనమౌతూ వస్తోంది. ఉత్పత్తి పతనంతోపాటు ఉద్యోగ కల్పన కూడా స్తంభించిందని ఎస్ అండ్ పి నివేదిక పేర్కొంది. జర్మనీ, ఫ్రాన్స్‌లలో పతనం వేగవంతం అయింది. ఇటలీ గత సంవత్సరం నుంచే పతనావస్థలో ఉంది. స్పెయిన్ లోని ప్రయివేటు రంగంలో వృద్ధి అక్టోబర్‌లో స్తంభించింది. సెప్టెంబర్ 2012 తరువాత కోవిడ్ మహమ్మారి విజృంభించిన కాలాన్ని వదిలితే యూరోజోన్ ఆర్థిక వ్యవస్థలో ఇంతగా పతనం ఎన్నడూ సంభవించలేదు. యూరోజోన్‌లో అంతిమ త్రైమాసికంలో సేవారంగం మరింతగా కుదేలయింది. రానున్న కాలంలో పరిస్థితి మరింతగా క్షీణిస్తుందని హాంబర్గ్ బ్యాంకు చీఫ్ ఎకనామిస్టు సైరస్ డి లా రూబియా అన్నది. 2023వ సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో కూడా యూరోజోన్ ప్రాంతంలో ఉత్పత్తి పతనం అవుతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇది మాంద్యానికి ఒక సూచిక.

బీజేపీ లిస్టులో ట్విస్టులే ట్విస్టులు

వేములవాడలో తుల ఉమకు బీ-ఫాం నిరాకరణ అనూహ్యంగా వికాస్‌రావు పేరు ప్రకటన

- జాతీయ స్థాయిలో చక్రం తిప్పిన విద్యాసాగర్‌రావు, బండి సంగారెడ్డిలో బండిపై ఈటలది పైచేయి
- దేశ్‌పాండేను కాదని పులిమామిడి రాజుకు బీ-ఫాం
- కంటోన్మెంట్ విషయంలోనూ అలాగే బీజేపీ ఆఫర్‌ను తిరస్కరించిన నీలం మధు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల వేళ బీజేపీ నేతల మధ్య ఆధిపత్యపోరు మరింత తారాస్థాయికి చేరుకున్నది. వేములవాడ అభ్యర్థిగా తొలుత ప్రకటించిన తుల ఉమ నామినేషన్ వేసి ఎన్నికల గోదాలో నిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఆమెకు చివరి నిమిషంలో అధిష్టానం మొండిచేయి చూపింది. మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ జాతీయ స్థాయిలో చక్రం తిప్పి వికాస్‌రావుకు బీ-ఫాం ఇప్పించారు. విద్యాసాగర్‌రావు తనయుడే వికాస్‌రావు. సంగారెడ్డిలోనూ మొదట ప్రకటించిన రాజేశ్వర్‌రావు దేశ్‌పాండేకు కాదని పులిమామిడి రాజుకు బీ-ఫాం ఇచ్చి రంగంలోకి దింపింది. కంటోన్మెంట్ విషయంలో చివరి క్షణంలో కాంగ్రెస్ అసంతృప్త నేత గణేశ్‌కు టికెట్ కట్టబెట్టింది. వనపర్తిలోనూ అభ్యర్థిని మార్చేసింది. సంగారెడ్డిలో పోటీచేయాలని బీజేపీ ఆఫర్ ఇచ్చినా నీలం మధు ఆసక్తి చూపలేదు. ఆయన బీఎస్పీవైపు మొగ్గుచూపారు. ఇలా నాలుగో విడత టికెట్ల పంపిణీలో ట్విస్టుల మీద ట్విస్టులు చోటుచేసుకుంటున్నాయి. బహుశ సినిమాలోనూ ఈ స్థాయి ట్విస్టులు ఉండకపోవచ్చునేమో.

బీజేపీ అధినాయకత్వం తెలంగాణలో పార్టీ అభ్యర్థుల ప్రకటన విషయంలో మొదటి నుంచీ గందరగోళ పడుతూనే ఉన్నది. పార్టీ శ్రేణులను సైతం ఆయోమయానికి గురిచేస్తూనే ఉంది. అభ్యర్థుల విషయంలో స్పష్టతలేమి ఆ పార్టీలోని ఆధిపత్యపోరుకు మరింత ఆజ్యం పోసి కూర్చున్నది. వేములవాడ సీటు విషయంలో బీజేపీ తర్జనభర్జనలు పడి మూడో లిస్టులో తుల ఉమకు కేటాయించింది. ఆమెకు టికెట్ ఇవ్వకపోతే తాను పార్టీని వీడుతానంటూ ఈటల రాజేందర్ ఒకానొక దశలో అధిష్టానంపై తీవ్ర ఒత్తిడి చేశారు. విద్యాసాగర్‌రావు, బండి సంజయ్ ఎత్తుల్ని తిప్పికొట్టి మరీ ఆమెకు టికెట్ ఇప్పించారు. వేలాది మందితో ఆమె నామినేషన్ కూడా వేశారు. కానీ, అసలు కథ శుక్రవారం ఉదయం మొదలైంది. చివరి లిస్టులో వికాస్‌రావు పేరును ప్రకటించింది. చివరిక్షణంలో ఆయనకు బీ-ఫాం అందజేసింది. దీనిపై ఈటల రాజేందర్ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. తుల ఉమ అయితే ఏకంగా ఏడ్చేశారు. 'డబ్బుల మూటతో వచ్చే వాళ్లకు సీట్లిచ్చి పార్టీని నమ్ముకుని వచ్చిన మాలాంటోళ్లకు అన్యాయం చేసింది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోటీలో ఉండబోతున్నట్టు స్పష్టం చేశారు. మునుముందు ఏం జరుగుతుందో చూడాలి. వేములవాడలో ఈటలపై బండి గ్రూపు పైచేయి సాధించింది. సంగారెడ్డిలో మాత్రం బండిని కాదని ఈటల పైచేయి సాధించారు. తాను సూచించిన పులిమామిడి రాజుకు టికెట్ దక్కేలా చూసుకున్నారు.

అభ్యర్థుల మార్పు..అంతా అయోమయం

బీజేపీ అధిష్టానం వనపర్తి సీటును ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డికి కేటాయించింది. ఆయన నామినేషన్ కూడా వేశారు. తీరా చివరి నిమిషయంలో అక్కడ అనూగ్న రెడ్డికి బీ-ఫాం ఇచ్చి నామినేషన్ వేయించింది. బెల్లంపల్లి సీటును తొలుత శ్రీదేవికి ఇచ్చింది. తీరా నాలుగో లిస్టులో ఏమాజి పేరును ప్రకటించి అందర్నీ అయోమయానికి గురిచేసింది. చివరకు పార్టీనే సరిచేసి తమ అభ్యర్థి శ్రీదేవినే అని చెప్పి బీ-ఫాం అందజేసింది. అలంపూర్ స్థానంలో మరియమ్మకు సీటు కేటాయించారు. చివరకు ఆమె స్థానంలో రాజగోపాల్‌ను ఫైనల్ చేశారు. చాంద్రాయణగుట్ట అభ్యర్థి పోటీచేయబోనని ప్రకటించడంతో కొత్తగా కె.మహేందర్‌ను ప్రకటించింది.

అగ్గి రాజేసిన జనసేన

మొదటి 119 స్థానాల్లోనూ పోటీ అని ప్రకటించి అనూహ్యంగా చివరి వారంలో జనసేనతో పొత్తు అంటూ ఆ పార్టీకి ఎనిమిది సీట్లను కేటాయించడం బీజేపీలో అగ్గి రాజేసింది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పార్టీ ముఖ్యనేతలు పార్టీ వీడటానికి కారణమైంది. జనం లేని జనసేన పార్టీకి సీట్లు ఎలా ఇస్తారంటూ శ్రేణుల ఆగ్రహానికి గురైంది. కొండా పట్టుబట్టడంతో శేరిలింగంపల్లిని జనసేనకు ఇవ్వలేదు. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ స్థానాల్లో తాను సూచించిన రవియాదవ్, తోకల శ్రీనివాస్‌రెడ్డిలకే సీట్లు కేటాయించాలని ఒత్తిడి చేసి మరీ విజయం సాధించారు. పార్టీ నిర్ణయంపై శేరిలింగంపల్లి నేత యోగానంద్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. కంటోన్మెంట్‌లో రజని బీజేపీ టికెట్‌ను ఆశించింది. అక్కడ మాజీ ఎమ్మెల్యే శంకర్‌రావు కూతుర్ని బరిలోకి దింపాలని చివరి వరకు వేచిచూసింది. చివరకు అదిసాధ్యం కాకపోవడంతో కాంగ్రెస్ నేత గణేశ్ సత్యనారాయణకు కట్టబెట్టింది. ఇది కంటోన్మెంట్ నియోజకవర్గంలో మంటపెట్టింది.

అదానీ గురించి మాట్లాడితే అణచివేయాలని చూస్తోంది

- మోడీ సర్కార్‌పై మహువా మొయిత్రా విమర్శలు



కోల్‌కతా : అదానీ గ్రూపు కుంభకోణం గురించి ఎవరన్నా విమర్శిస్తే వెంటనే వారిని అణచివేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం భావిస్తోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా శుక్రవారం విమర్శించారు. లోక్‌సభ నుండి తనను బహిష్కరించాలని నైతిక విలువల కమిటీ చేసిన సిఫార్సు, నిరాశా నిస్పృహలతో ఆ దిశగా తీసుకున్న చర్యేనని విమర్శించారు. పిటిఐ వీడియోకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. ప్రశ్నకు నగదు కుంభకోణంలో ఆమె పాత్రపై గత కొంతకాలంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదానీ, రూ.13వేల కోట్ల బొగ్గు కుంభకోణానికి పాల్పడ్డారు. మరే ఇతర దేశంలోనైనా అయితే, ఈ కుంభకోణంతో ప్రభుత్వం కూలిపోయేది. మోడీకి కూడా ఈ విషయం తెలుసు, అందువల్లే వారు సాధ్యమైనంత కాలమూ దీన్ని దాచిపెట్టేందుకే చూస్తున్నారని మొయిత్రా విమర్శించారు. మోడీ,అదానీ ఇద్దరూ కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఎవరైనా వారిని ప్రశ్నించాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. అలా ప్రశ్నించేవారిని నోరుమూయించి, జైల్లో కూర్చోబెట్టాలన్నది వారి ఆలోచన అని మొయిత్రా తీవ్రంగా విమర్శించారు. అబద్ధాల ఫ్యాక్టరీగా కాషాయ పార్టీ మారిందని వ్యాఖ్యానించారు.

ఇజ్రాయిల్‌లో శాంతి ప్రదర్శనలపై నిషేధం

- సవాల్ చేసిన ఇజ్రాయిల్ కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర శక్తులు
- పోలీసులకే వత్తాసు పలికిన న్యాయస్థానం

జెరూసలెం: గత నెలలో పాలస్తీనియన్లపై ప్రధానమంత్రి బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించిన యుద్ధాన్ని నిరసిస్తూ అనేక మంది ఇజ్రాయిలీయులు, యూదులు, అరబ్బులు వీధుల్లోకి వచ్చారు. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ లెక్కచేయకుండా వారు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. విచిత్రంగా ఈ ప్రదర్శనలపై ఇజ్రాయిల్ పోలీస్ కమిషనర్ యకోవ్ షబ్తాయ్ నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిషేధానికి ఆయన చూపిన కారణం ప్రదర్శనలను నియంత్రించేందుకు తగినంత మంది పోలీసు అధికారులు లేరని. ప్రదర్శనలపై నిషేధాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. షబ్తాయ్ ఆదేశాలు భావ ప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమని, కాబట్టి వాటిని రద్దు చేయాలని ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ , హదాష్ (డెమొక్రటిక్ ఫ్రంట్ ఫర్ పీస్ అండ్ ఈక్వాలిటీ) సంకీర్ణం, అదాలా (ఇజ్రాయిల్ అరబ్ మైనార్టీల హక్కుల కోసం పోరాడే లీగల్ సెంటర్) సంయుక్తంగా ఈ పిటిషన్ వేశాయి. పోలీసుల ఆదేశం వెనక ఉన్న సైద్ధాంతిక ప్రేరణలను ఇది ఎత్తి చూపింది. కాల్పుల విరమణ కోసం పిలుపునిచ్చే ఇజ్రాయిలీ నిరసనకారులను బస్సులోకి ఎక్కించి మిలిటరీ బాంబులు వేస్తున్న గాజా ప్రాంతానికి పంపుతామని నెతన్యాహు ప్రభుత్వం బెదిరించింది. యుద్ధ సమయంలో ఇజ్రాయిల్ కోర్టులు ఎమర్జెన్సీ ఫార్మేట్‌లో పనిచేస్తాయి. వారు అత్యవసరంగా భావించిన కేసులను మాత్రమే విచారిస్తారు. కాబట్టి ఈకేసును విచారణకు చేపట్టడం అసాధారణమైన విషయం. ఈ విచారణలో పోలీసుల తరపు న్యాయవాది చేసిన వాదనలు వింటే గాజాకు వ్యతిరేకంగా సైన్యం చేస్తున్న యుద్ధానికి మద్దతు తెలపని వారు ఎవరైనా హమాస్‌కు మద్దతు ఇస్తున్నట్టే పరిగణిస్తామని నెతన్యాహు తీసుకున్న వైఖరిని బలపరిచేవిగా ఉన్నాయి. నిరసన తెలిపే హక్కు రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కు అంటూనే, ఇజ్రాయిల్‌లో ఇప్పుడున్న అసాధారణ పరిస్థితుల్లో అటువంటి స్వేచ్ఛ గురించి ఆదేశించలేమని కోర్టు పేర్కొంది.

ఆరు నెలల్లోపు కులగణన నిర్వహిస్తాం

- మైనార్టీలతో సహా ఓబీసీలకు న్యాయమైన రిజర్వేషన్లు
- రూ.4వేల కోట్ల బడ్జెట్...ప్రత్యేక మైనార్టీ సబ్‌ప్లాన్
- మైనార్టీలకు కాంగ్రెస్‌డిక్లరేషన్ హామీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు కులగణన నిర్వహిస్తామని మైనార్టీలకు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మైనార్టీలతో సహా ఓబీసీలకు న్యాయమైన రిజర్వేషన్లు కల్పిస్తామని మైనార్టీ డిక్లరేషన్‌లో పేర్కొంది.దీంతోపాటు మైనార్టీలకు రూ. 4వేల కోట్ల బడ్జెట్ కేటాయించడంతోపాటు ప్రత్యేక మైనార్టీ సబ్‌ప్లాన్ రూపొందిస్తామని తెలిపింది. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఓ ఫంక్షన్‌హాల్‌లో టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, అభ్యర్థులు అజహరుద్దీన్, సునీతారావు, రోహిన్‌రెడ్డి, నాయకులు నిజాముద్దీన్, ఉజ్మాషాకీర్, అలీ మస్కతి తదితరులు 'మైనార్టీ డిక్లరేషన్'ను విడుదల చేశారు. అందులోని కొన్ని ముఖ్యాంశాలు

- నిరుద్యోగ మైనారిటీ యువత, మహిళలకు సబ్సిడీ రుణాలను అందించేందుకు ఏడాదికి రూ. 1,000 కోట్లు
- అబ్దుల్ కలాం తౌఫా-ఎ-తలీమ్ పథకం ఎంఫిల్ పూర్తి చేస్తున్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కు మరియు ఇతర మైనార్టీ యువతకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం.
- పీహెచ్‌డీ విద్యార్థులకు అదనంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత లక్ష, గ్రాడ్యుయేషన్‌కు రూ.25వేలు, ఇంటర్‌కు రూ.15వేలు,10వ తరగతికి రూ.10వేలు.
- తెలంగాణ సిక్కు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను స్థాపించి, మైనార్టీ సంస్థల్లో ఖాళీలను భర్తీ.
- ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల నియామకానికి ప్రత్యేక డీఎస్సీ.
- ఇమామ్‌లు, మ్యూజిన్‌లు, ఖాదీమ్‌లు, పాస్టర్లు, గ్రంథిలతో సహా అన్ని మతాల పూజారులకు నెలవారీ గౌరవ వేతనం రూ.10వేల నుంచి రూ. 12వేలు.
- వక్ఫ్ బోర్డు యొక్క భూమి, ఆస్తి రికార్డులను డిజిటలైజ్
- వక్ఫ్ బోర్డ్ యొక్క ఆక్రమణకు గురైన ఆస్తులను తిరిగి తీసుకుంటాం.
- ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికల కోసం భూమి
- ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద ఇండ్లులేని మైనార్టీ కుటుంబాలందరికీ ఇంటి స్థలం. దాని నిర్మాణానికి రూ.5 లక్షలు.
- ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు ఇతర మైనార్టీలకు చెందిన కొత్తగా పెళ్లైన జంటలకు రూ.1.6 లక్షల సహాయం .
- పాత నగరంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (క్యూక్యూఎస్‌యూడీఏ) ఏర్పాటు.

చివరికి మిగిలింది కన్నీరే

ఆఖరి క్షణంలో చెయ్యిచ్చిన పార్టీలు

- బోరున విలపించిన తుల ఉమ
- పార్టీ మారిన నీలం మధు
- అయోమయంలో అబ్రహం



నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్

యుద్ధంలో గెలుపోటములు సహజం... అయితే గెలిచావని ఎంపైర్ ప్రకటించాక.... తిరిగి ఓటమి పాలయ్యావని చెబితే ఎంత భయంకరంగా ఉంటుందంటే ఊహించడమే కష్టం. అది క్రీడలైనా... రాజకీయ క్రీడలైనా తట్టుకోవడానికి గుండె ధైర్యం కావాలి. ఈ స్థానం టికెట్ నీకే అంటూ ఖరారు చేసి చివరి క్షణంలో బీ ఫాం ఇవ్వకుండా అభ్యర్థులను మార్చడంతో పలువురు కంట కన్నీరు పెట్టారు. ఆలంపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే వి. అబ్రహం, బీజేపీ వేములవాడ నేత తుల ఉమ, పటాన్‌చెరు కాంగ్రెస్ నేత నీలం మధులకు ఆఖరి క్షణంలో చేదు అనుభవం ఎదురైంది.

బోరున విలపించిన తుల ఉమ

ఎన్నో ట్విస్టుల మధ్య వేములవాడ బీజేపీ టికెట్ దక్కించుకున్న ఈటల రాజేందర్ వర్గానికి చెందిన తుల ఉమకు చివరి క్షణంలో ఆ పార్టీ చెయ్యిచ్చింది. నామినేషన్ వేసేందుకు సిద్ధమైన తరుణంలో శుక్రవారం అఘమేఘాల మీద ఆమె అభ్యర్థిత్వాన్ని మార్చింది. ఇటీవల పార్టీలో చేరిన మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు కుమారుడు వికాస్ రావును అభ్యర్థిగా అధిష్టానం ఖరారు చేసింది. మొదటి నుంచి వేములవాడ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న తుల ఉమ అధిష్టానం నిర్ణయంతో ఖంగు తిన్నది. తనకు పార్టీ అన్యాయం చేసిందని బోరున విలపించింది.

అయోమయంలో అబ్రహం

బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన మొదటి జాబితాలోనే టికెట్ దక్కించుకున్న ఆలంపూర్ ఎమ్మెల్యే వి.అబ్రహంకు చేదు అనుభవం ఎదురైంది. స్థానిక రాజకీయాల నేపథ్యంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అనుచరుడైన విజయుడు ఎట్టకేలకు టికెట్ దక్కించుకున్నారు. టికెట్ అందినట్టే అంది చేజారి పోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన అబ్రహం ఒక దశలో పార్టీ మారాలని నిశ్చయించుకున్నారు. సన్నిహితుల సూచన మేరకు పార్టీ మార్పు నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న అబ్రహం తీవ్ర నిరాశతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రాజకీయాలకు కొన్ని రోజులు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

పార్టీ మారిన నీలం మధు

పటాన్ చెరు నియోజక వర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో క్రియాశీల నాయకునిగా ఎదిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధుకు ఆ పార్టీ టికెట్ కేటాయించక పోవడంతో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరాడు. స్థానిక నాయకులను కాదని ఇచ్చిన హామీ మేరకు ఆ పార్టీ టికెట్ కేటాయించింది. అయితే పలువురు సీనియర్ నాయకుల ఒత్తిడి మేరకు నామినేషన్‌కు ఒక రోజు ముందు అభ్యర్థిని మార్చి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కాట శ్రీనివాస్ గౌడ్‌కు టికెట్ కేటాయించారు. దాంతో ఆందోళనకు గురైన మధు అఘమేఘాల మీద బీఎస్పీ టికెట్‌పై బరిలో నిలబడ్డారు. తనను కాంగ్రెస్ నమ్మించి మోసం చేసిందని, ఆ పార్టీని ఓడించడమే తన లక్ష్యమని ఆయన ప్రకటించడం కొస మెరుపు.

సిబ్బందికి, ఓటర్లకు..పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించాలి

- సెంట్రల్ అబ్జర్వర్ అభయ్ నందన్ అబస్థా



నవతెలంగాణ-శాయంపేట

ఈనెల 30న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సిబ్బందికి, ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు మౌలిక వసతులు కల్పించాలని ఎన్నికల సెంట్రల్ అబ్జర్వర్ అభయ్ నందన్ అభస్థా అధికారులకు సూచించారు. హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలోని శాయంపేట, పత్తిపాక, కొత్తగట్టుసింగారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఉందా, కేంద్రాల్లోని గదులకు కిటికీలు ఉన్నాయా.. మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నాయా.. అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బందికి, ఎన్నికల రోజు వచ్చే ఓటర్లు వినియోగించుకునేందుకు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటితోపాటు దివ్యాంగులకు ర్యాంప్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట భూపాలపల్లి ఏడీఏ నర్సింగం, తహసీల్దార్ సుభాషిణి, ఎంపీడీవో ఆమంచ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలో సోదరిని హత్య చేసిన సోదరులు

- బావ పరిస్థితి విషమం

నవతెలంగాణ-వైరా

భూ వివాదమై జరిగన ఘర్షణలో సోదరిని ఆమె సోదరులు హత్య చేశారు. అడ్డు వచ్చిన బావపై సైతం దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఖమ్మం జిల్లా వైరా మండలం తాటిపూడి గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టల రాములు కుటుంబానికి అతని కుమార్తె ఉషా కుటుంబానికి సుమారు 10 ఏండ్లుగా భూ వివాదం నడుస్తుంది. ఈ వివాదం కోర్టు వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆ స్థలంలో సుబాబుల్ విత్తనాలు పడి మొలిచి పెద్దవి కాగా ఆ చెట్లను ఉషా అమ్ముకున్నది. సుబాబుల్ కర్ర నరికేందుకు శుక్రవారం మనుషులు రాగా రాములు అతని కుమారులు నరేష్, వెంకటేష్.. స్థలం వివాదంలో ఉన్నదని కర్ర నరక వద్దని చెప్పటంతో వాళ్ళు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఉషా కొడవలి చేత బట్టి తండ్రితో గొడవకు దిగింది. మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఉషా వద్ద ఉన్న కొడవలి వేటుకు తండ్రి రాములు తలకు గాయమైంది. తండ్రిపై దాడి అనంతరం పారిపోతున్న ఉషను ఆమె సోదరులు నరేష్, వెంకటేష్.. వెంబడించి మారణాయుధాలతో దాడి చేసి హతమార్చారు. అడ్డువచ్చిన ఆమె భర్త కృష్ణపై కూడా దాడి చేశారు. సంఘటనా స్థలాన్ని వైరా ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, ఎస్ఐ మేడా ప్రసాద్ సందర్శించి.. కృష్ణను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎంపీ సీటు మీదే

- బలరాంనాయక్‌కు కేసీ వేణుగోపాల్ హామీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించిన భంగపడిన కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌ను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుజ్జగించారు. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన టికెటు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన పార్టీ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతోపాటు జహీరాబాద్ అభ్యర్థిగా ప్రకటించిన సురేష్ శెట్కర్ చివరి నిమిషంలో ఆయనకు బీఫామ్ ఇవ్వకుండా మరో అభ్యర్థి సంజీవరెడ్డికి బీఫామ్ అందజేసింది. దీంతో నిరాశకు గురైన ఆయన్ను కేసీ వేణుగోపాల్ పిలిచి మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వెంకట్‌ను ఆయన బుజ్జగించారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు.

అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ కేసీఆర్

- మాజీ మంత్రి పుష్పలీల, కోదండరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారని మాజీ మంత్రి పుష్పలీల, పార్టీ సీనియర్ నేత కోదండరెడ్డి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ విమర్శించారు.ఎన్నికల్లో సీఎం కేసీఆర్ అన్ని అబద్ధాలే మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వేర్వేరుగా వారు విలేకర్లతో మాట్లాడారు. తొమ్మిందేండ్లలో ఎప్పుడైనా ఇన్ని సమావేశాలు నిర్వహించారా? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తున్నారని చెప్పారు. దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు కేసీఆర్ మీద ఛీటింగ్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. చరిత్ర వక్రీకరిస్తూ...కాంగ్రెస్‌పై, గాంధీ కుటుంబంపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్, బీఆర్‌ఎస్ బలహీనపడడంతో కాంగ్రెస్‌పై అబద్ధపు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందెందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై మాట్లాడే ముందు ఆయన చరిత్ర తెలుసుకోవాలని సీఎం కేసీఆర్‌కు సూచించారు. నామినేషన్ల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్‌ఎస్ చేసిన దౌర్జన్యాలపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. .

కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ఓ మోసం

- బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రావణ్

నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలను మరోసారి మోసం చేసేందుకేనని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 34 సీట్లు బీసీలకు ఇస్తామని పీఏసీలో తీర్మానం చేసిన కాంగ్రెస్ పార్టీ చివరికి 22 సీట్లకు పరిమితం చేసిందని గుర్తు చేశారు. బీసీల సీట్లను అడ్డగోలుగా అమ్ముకున్న పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి బీసీలను న్యాయం చేస్తారని ఆశించడం భ్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి బీసీలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ బ్రోచర్‌లో తెలంగాణకు చెందిన ఒక్క బీసీ నాయకుని ఫోటో లేదని, ఆరోపించారు. ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు.

ఖమ్మంలో కాంగ్రెస్‌కు షాక్..

- మాజీ మంత్రి సంభానితో పాటుపలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక
- సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్న నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. మాజీ మంత్రి, టీపీసీసీ ముఖ్య నేత సంభాని చంద్రశేఖర్ సహా పలువురు నాయకులు సీఎం కేసీఆర్ సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, కొత్తగూడెం, సత్తుపల్లి, వైరా, ఇల్లందు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు ఎడవల్లి కృష్ణ, కోటూరి మానవతారాయ్, డాక్టర్ రాంచందర్‌నాయక్, మడత వెంకట్ గౌడ్ లకు కేసీఆర్ ఎర్రవల్లి లోని తన వ్యవసాయ క్షేత్రంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దగ్గరుండి మరీ నేతలందరినీ పార్టీలో చేర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేయటం కోసమే తామంతా పార్టీలో చేరుతున్నామని వారు ప్రకటించారు. పార్టీలో చేరిన నాయకులందరి సేవలు వినియోగించుకోవాలని సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లా నేతలకు సూచించారు. అంతకు ముందు వీరందరినీ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రగతిభవన్‌కు పిలిపించుకుని పార్టీలోకి ఆహ్వానిస్తూ.. శుభాకాంక్షలు తెలిపారు.

గోదావరి-కావేరీ అనుసంధానానికి సూత్రప్రాయ అంగీకారం

- తెలుగు రాష్ట్రాల జలాలను ముట్టుకోం మిగిలిన వాటినే తరలిస్తాం
- సమస్యలు పరిష్కరించాకే ఒప్పందం : చైర్మెన్ శ్రీరామ్ వెదిరే హామీ


నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గోదావరి- కావేరి నదుల అనుసంధానికి భాగస్వామ్య రాష్ట్రాలన్నీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపాయి. అన్ని రాష్ట్రాలు తమ నిర్దిష్ట సమస్యలను పరిష్కరించిన తర్వాతే ఎంఓయూపై సంతకం చేయడానికి అంగీకరించాయి. ఆరునెలల్లోగా ప్రాజెక్టును ముందుకు తీసుకుపోతామని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి కావేరికి 4189 మిలియన్ క్యూబిక్ మీటర్లు మళ్లింపు, నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. ఈ లింక్ ద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు 1250 ఎంసీఎం, తమిళనాడుకు 1150 ఎంసీఎం, కర్ణాటకకు 450 ఎంసీఎం అందించాలని సమావేశం ప్రతిపాదించింది. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన జలాలు పోగా మిగులు జలాలను వాడుకుంటే తమకు అభ్యంతరం లేదని రాష్ట్ర సాగునీటి శాఖ అధికారులు సమావేశంలో చెప్పారు.

గోదావరి-కృష్ణా-పెన్నార్-కావేరి లింక్ ప్రాజెక్ట్‌తో సహా ప్రాజెక్టు గురించి చర్చించే నదుల అనుసంధానం సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని జలసౌధలో జరిగింది. ఈ సమావేశానికి నదుల అనుసంధానంపై టాస్క్‌ఫోర్స్ చైర్మెన్ శ్రీరామ్ వెదిరె అధ్యక్షత వహించగా, సీడబ్ల్యూసీ చైర్మెన్ ఎన్‌డబ్లూడీఏ డైరెక్టర్ జనరల్ భూపాల్‌సింగ్, ఏపీ, తమిళనాడు, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఇరిగేషన్ కార్యదర్శులుతోపాటు తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు హాజరయ్యారు. ఏపీ, ఒరిస్సా, పుదుచ్చేరి, మహారాష్ట్ర, కేరళతో పాటు టాస్క్‌ఫోర్స్‌లోని ఇతర సభ్యులు హాజరయ్యారు.

ఈ ప్రాజెక్టు కింద కాలువల సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా భూసేకరణను తగ్గించాలని రాష్ట్రాలు కోరినట్టు చెప్పారు. సమ్మక్క సారక్క బ్యారేజీ బ్యాక్ వాటర్ కిందకు రాకుండా చూసేందుకు వీలుగా ఇచ్చంపల్లికి సంబంధించిన సోర్స్ పాయింట్‌ను ఎగువ భాగంలో కొద్దిగా సర్దుబాటు చేయాలని కూడా సూచించారు. తెలంగాణ రాష్ట్రం లేవనెత్తిన అంశాలపై టాస్క్‌ఫోర్స్ చైర్మెన్ శ్రీరామ్ వెదిరే స్పందిస్తూ మాట్లాడారు. హైడ్రాలజీ విషయానికొస్తే, ఈ ప్రాజెక్టు కింద వినియోగానికి తెలంగాణకే కాదు, మరే రాష్ట్రానికి కేటాయించిన జలాలను అస్సలు ముట్టుకోబోమని ఆయన హామీ ఇచ్చారు. అతను కూడా సీడబ్ల్యూసీ నిర్వహించిన అధ్యయనాల ప్రకారం నదిలో మిగులు జలాలు ఉన్నందున, ఈ లింక్ కూడా గోదావరి నదిలోని మిగులు జలాలను ఉపయోగించుకోబోమని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఎగువనున్న రాష్ట్రాలు ఉపయోగించని జలాలను ఈ ప్రాజెక్ట్‌లోని జలాల గురించి ఆలోచించడం జరిగిందన్నారు. భూసేకరణ విషయానికొస్తే, ప్రాజెక్ట్ ఫేజ్-1 కింద సుమారు 988 ఎకరాల భూమిని మాత్రమే సేకరించాల్సి ఉంటుందన్నారు. ఉత్తమ పరిహారం ప్యాకేజీని రూపొందిస్తామని చెప్పారు. ఇచ్చంపల్లి ప్రధాన ప్రదేశంగా ఉంటుందనీ, సమ్మక్క సారక్క ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ను పరిగణనలోకి తీసుకుని కచ్చితమైన స్థలాన్ని ఖరారు చేసేందుకు ఎన్‌డబ్ల్యూడీఏ బందం ఆ ప్రాంతాన్ని సందర్శిస్తుందని వివరించారు. అనంతరం తెలంగాణ ఎంఓయూపై సంతకం చేసేందుకు అంగీకరించినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత లింక్‌తో ఏకీభవిస్తున్నట్టు పేర్కొన్నారు. గోదావరి నది హైడ్రాలజీపై సీడబ్ల్యూసీ చేసిన తాజా అధ్యయనాలను ఎన్‌డబ్ల్యూడీఏ ద్వారా అధ్యయనం చేయాలని సూచించారు, తద్వారా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఉపయోగించని జలాలను మాత్రమే ఇందులో ఉపయోగించుకునేలా చూడాలని కోరారు. నాగార్జునసాగర్, సోమశిల రిజర్వాయర్లు రెండూ ఈ ప్రాజెక్ట్ కింద కొత్త అవసరాలకు నీటిని సరఫరా చేయగలవని నిర్ధారించేందుకు ఎన్‌డబ్ల్యూడీఏ ద్వారా అధ్యయనాలు చేయాలని సూచించారు. ఏపీ లేవనెత్తిన సమస్యలపై చైర్మన్ శ్రీరామ్ వెదిరే స్పందిస్తూ ఈ ప్రాజెక్టులో మిగులు జలాలను ఎప్పటికీ వినియోగించబోమన్నారు. ఛత్తీస్‌గఢ్ కేటాయింపులు మాత్రమే వినియోగించుకోవాలని యోచిస్తున్నామని చెప్పారు. చిన్నపాటి సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఎన్‌డబ్ల్యూడీఏ రాష్ట్ర అధికారులతో సమావేశం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. నాగార్జున సాగర్, సోమశిల రెండింటి సామర్థ్యానికి సంబంధించి, రాష్ట్ర భయాలను పోగొట్టడానికి అవసరమైన అనుకరణ అధ్యయనాల చేయాలని చైర్మెన్ ఎన్‌డబ్ల్యూడిఏను ఆదేశించారు. దిగువ నదీతీర రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ హక్కులపై రాజీ పడేందుకు ఎప్పటికీ అనుమతించబోమని పేర్కొన్నారు. ఇచ్చంపల్లికి సంబంధించిన మూలస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని, పోలవరాన్ని ప్రత్యామ్నాయంగా పరిగణించాలని రాష్ట్రాన్ని కోరుతూ, అలైన్‌మెంట్‌ను ప్రస్తావించారు. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న కాలువలో తెలంగాణ రాష్ట్రం అవసరాలు తగ్గిపోతున్నాయన్నారు. ప్రస్తుత ప్రతిపాదన ప్రాజెక్ట్ ఫేజ్-1 మాత్రమేననీ, తదుపరి దశలలో, ప్రతిపాదిత కొత్త మూలస్థానాలను పరిశీలించవచ్చని సూచించారు. ఏపీ తన సంతప్తిని వ్యక్తం చేసి, అవగాహన ఒప్పందానికి సంసిద్ధతను తెలియజేసింది. కర్ణాటక అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కింద కర్ణాటకలో 450 ఎంసీఎం నీటిని వినియోగించాలని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు కర్ణాటక తన పూర్తి మద్దతు తెలిపింది. ఈ ప్రాజెక్ట్ కింద లబ్ది పొందుతున్న ఇతర రెండు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ ఈ ప్రాజెక్టుకు తమ పూర్తి మద్దతును తెలిపాయి. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర రాష్ట్రాలు ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఈ ప్రాజెక్టుకు తమ పూర్తి మద్దతును అందించాయి.

నవతెలంగాణ మారో తీన్‌మార్





ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్
వేదిక : పుణె , సమయం : ఉ: 10.30

ఇంగ్లాండ్ X పాకిస్థాన్
వేదిక : కోల్‌కత , సమయం : మ: 2.00

స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

శ్రీలంక బోర్డుపై ఐసీసీ వేటు

దుబాయ్ : శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ)పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వేటు వేసింది. ప్రపంచకప్ వైఫల్యంతో శ్రీలంక క్రికెట్ బోర్డును తొలుత ఆ దేశ ప్రభుత్వం రద్దు చేసింది. బోర్డు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసింది. ఐసీసీ నిబంధనల ప్రకారం క్రికెట్ బోర్డులు స్వతంత్రంగా వ్యవహరించాలి. శ్రీలంక క్రికెట్ బోర్డులో ప్రభుత్వం జోక్యం కారణంగా ఐసీసీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

రచిన్‌కు ఐసీసీ అవార్డు

వరల్డ్‌కప్‌లో కివీస్ స్టార్ జోరు



దుబాయ్ : న్యూజిలాండ్ యువ క్రికెటర్ రచిన్ రవీంద్ర కెరీర్ తొలి ఐసీసీ పురస్కారం దక్కించుకున్నాడు. 23 ఏండ్ల రచిన్ రవీంద్ర 2023 ఐసీసీ ప్రపంచకప్‌లో దుమ్మురేపుతున్నాడు. ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచుల్లో అదరగొట్టిన రచిన్ రవీంద్ర ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ (అక్టోబర్) నిలిచాడు. అక్టోబర్‌లో రచిన్ రవీంద్ర 81.20 సగటుతో 406 పరుగులు సాధించాడు. ఇంగ్లాండ్‌పై 123, ఆస్ట్రేలియాపై 116 పరుగులతో మెరుపు శతకాలు బాదాడు. వెస్టిండీస్ ఆల్‌రౌండర్ మాథ్యూస్ ఐసీసీ ఉమెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నిలిచింది. అక్టోబర్‌లో ఆసీస్‌పై 155 సగటుతో 310 పరుగులు చేసింది మాథ్యూస్. మెన్స్ విభాగంలో జశ్‌ప్రీత్ బుమ్రా, క్వింటన్ డికాక్‌లను వెనక్కి నెట్టి రచిన్ రవీంద్ర అవార్డును దక్కించుకున్నాడు.

సఫారీ జోరు

అఫ్గనిస్థాన్‌పై దక్షిణాఫ్రికా గెలుపు

ఛేదనలో వాండర్ డుసెన్ మెరుపుల్



నవతెలంగాణ-అహ్మదాబాద్

సెమీఫైనల్ ముంగిట సఫారీ జోరు కొనసాగించింది. గ్రూప్ దశలో తన చివరి మ్యాచ్‌లో అఫ్గనిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 245 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ వాండర్ డుసెన్ (76 నాటౌట్, 95 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్థ సెంచరీతో కదంతొక్కాడు. టెయిలెండర్ ఫెలుక్‌వయో (39 నాటౌట్, 37 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఓపెనర్ క్వింటన్ డికాక్ (41, 47 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్థాన్ 244 పరుగులకు కుప్పకూలింది. 50 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్థాన్ నాణ్యమైన బౌలర్లను ఎదుర్కొని మంచి స్కోరు నమోదు చేసింది. అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (97 నాటౌట్, 107 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో అదరగొట్టాడు. ఛేదనలో చెలరేగిన వాండర్ డుసెన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. అఫ్గనిస్థాన్, దక్షిణాఫ్రికా తలపడిన ఈ మ్యాచ్‌లోనే రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 491 పరుగులు నమోదయ్యాయి. ఈ రెండు జట్ల ముఖాముఖిలో ఇదో రికార్డు. గ్రూప్ దశలో ఏడో విజయంతో దక్షిణాఫ్రికా రెండో స్థానంతో సెమీస్‌లో అడుగుపెట్టగా.. ఐదో పరాజయంతో అఫ్గనిస్థాన్ ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది.

డుసెన్ దూకుడు : ఛేదనలో దక్షిణాఫ్రికా దంచికొట్టింది. అఫ్గనిస్థాన్ పేసర్లు, స్పిన్నర్లు క్రమశిక్షణతో బంతులు వేయటంతో సఫారీ బ్యాటర్లు కాస్త ఆచితూచి ఆడారు. ఓపెనర్లు క్వింటన్ డికాక్ (41), తెంబ బవుమా (23)లు తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి శుభారంభం అందించారు. ఓపెనర్లు సహా ఎడెన్ మార్‌క్రామ్ (25), హెన్రిచ్ క్లాసెన్ (10), డెవిడ్ మిల్లర్ (24) వికెట్ చేజార్చుకున్నా.. మరో ఎండ్‌లో వాండర్ డుసెన్ (76 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిసిన డుసెన్ ఆఖరు వరకు క్రీజులో నిలిచి సఫారీలకు విజయాన్ని అందించాడు. టెయిలెండర్ ఫెలుక్‌వయో (39 నాటౌట్) చివర్లో డుసెన్‌తో కలిసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో 47.3 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా గెలుపొందింది. అఫ్గనిస్థాన్ బౌలర్లలో మహ్మద్ నబి, రషీద్ ఖాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

అఫ్గనిస్థాన్ ఇన్నింగ్స్ : 244/10 (అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 97, రెహమత్ షా 26, గెరాల్డ్ 4/44, కేశవ్ మహరాజ్ 2/25)

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : 247/5 (వాండర్ డుసెన్ 76, డికాక్ 41, ఫెలుక్‌వయో 39, మహ్మద్ నబి 2/35)

ఐపీఎల్‌కు పంత్ సిద్ధం

ఢిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్ గంగూలీ



న్యూఢిల్లీ : కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ప్రాణాపాయం నుంచి బయటపడిన యువ క్రికెటర్ రిషబ్ పంత్ 2024 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడతాడని ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ సౌరవ్ గంగూలీ అన్నారు. బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో సాధన చేస్తున్న రిషబ్ పంత్ మ్యాచ్ ఫిట్‌నెస్ స్థాయికి అతి చేరువలో ఉన్నాడని సమాచారం. 'రిషబ్ పంత్ ఇప్పుడు బాగున్నాడు. వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్‌లో పంత్ ఆడతాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు నాయకత్వం వహిస్తాడు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ శిక్షణ శిబిరంలో పంత్ ప్రాక్టీస్ చేయటం లేదు. అందుకు చాలా సమయం ఉంది. ఇక్కడ జట్టు గురించి చర్చిస్తున్నాం. పంత్ జట్టుకు నాయకుడు. వచ్చే ఆటగాళ్ల వేలంపై పంత్ తన ఆలోచనలను పంచుకున్నాడు' అని సౌరవ్ గంగూలీ తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ శిక్షణ శిబిరం గురువారం కోల్‌కతలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీ గ్రౌండ్‌లో ఆరంభమైంది. ఈ సందర్భంగా ట్రైనింగ్ క్యాంప్‌కు రిషబ్ పంత్ హాజరయ్యాడు.

ప్రీ క్వార్టర్స్‌లో నంద్యాల జోడీ

హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ



హైదరాబాద్ : 15వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ శుక్రవారం ఘనంగా ఆరంభమైంది. భారత స్టార్ క్రీడాకారుడు విష్ణువర్థన్, మిస్ ఇండియా చాయలు శుక్రవారం జరిగిన సికింద్రాబాద్ క్లబ్‌లో హెచ్‌ఓటీఏ టెన్నిస్ టోర్నీని ప్రారంభించారు. మెన్స్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో 30, 40, 50, 60, 70 ప్లస్ వయో విభాగాల్లో సుమారు 360 మంది వెటరన్ అథ్లెట్లు పోటీపడుతున్నారు. మహిళా అథ్లెట్లు ఓపెన్ విభాగంలో తలపడనున్నారు. ఆదివారం అన్ని విభాగాల్లో ఫైనల్స్‌తో టోర్నీ ముగియనుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో నంద్యాల నర్సింహారెడ్డి, నీలకంఠ జోడీ 8-1తో తొలి రౌండ్లో విజయం సాధించి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. మెన్స్ సింగల్స్‌లోనూ నంద్యాల నర్సింహారెడ్డి తొలి రౌండ్లో 8-6తో విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. ఆరంభ కార్యక్రమంలో సికింద్రాబాద్ క్లబ్ ప్రెసిడెంట్ గౌతమ్ భూపాల్, హెచ్‌ఓఏటీ అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, టోర్నీ డైరెక్టర్ వినీత్ సహా తెలంగాణ టెన్నిస్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అండర్-19 సిరీస్‌కు మనోళ్లు

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ అభినందన

హైదరాబాద్ : అంతర్జాతీయ మెన్స్ అండర్-19 సిరీస్‌కు హైదరాబాద్ నుంచి ముగ్గురు క్రికెటర్లు ఎంపికయ్యారు. నాలుగు జట్లు పోటీపడనున్న ఈ టోర్నీ నవంబర్ 13 నుంచి 27 వరకు విజయవాడలో జరుగనుంది. ఇంగ్లాండ్, బంగ్లాదేశ్ అండర్-19 జట్లు, భారత్ నుంచి రెండు జట్లు ఈ టోర్నీలో టైటిల్ వేటలో పోటీపడుతున్నాయి. హైదరాబాద్ యువ క్రికెటర్లు మురుగన్ అశ్విన్, అరవెల్లి అవినాశ్ రావు, నిశాంత్ ఎస్‌లు ఎంపికయ్యారు. ఇటీవల బీసీసీఐ అండర్-19 టోర్నీలో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను ఈ సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇక దేశవాళీ మహిళల ఇంటర్ జోనల్ ట్రోఫీలో సౌత్ జోన్‌కు హైదరాబాద్ క్రికెటర్లు గొంగడి త్రిష, భోగి శ్రావణిలు ఎంపికయ్యారు. నిశాంత్ శరణు ఇటీవల హైదరాబాద్‌లో పాకిస్థాన్ ప్రపంచకప్ మ్యాచులకు ఆ జట్టు నెట్ బౌలర్‌గా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. అండర్-19 సిరీస్, ఇంటర్ జోనల్ ట్రోఫీకి ఎంపికైన క్రికెటర్లను హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అభినందించారు.

ఇంగ్లాండ్, పాక్ ఢీ నేడు

కోల్‌కత : ఐసీసీ ప్రపంచకప్‌లో పాకిస్థాన్, ఇంగ్లాండ్ గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి. ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించగా.. పాకిస్థాన్ సాంకేతికంగా ఆశలు నిలుపుకుంది. ఈడెన్‌గార్డెన్స్‌లో నేడు డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌ను పాక్ కనీసం 290 పరుగుల తేడాతో ఓడించాలి. లేదంటే, ఇంగ్లాండ్‌ను 150 పరుగులకు పరిమితం చేసి ఆ లక్ష్యాన్ని 3.4 ఓవర్లలో ఛేదించాలి. అప్పుడే న్యూజిలాండ్ నెట్ రన్‌రేట్‌ను పాక్ అధిగమించగలదు. తొలుత బ్యాటింగ్ చేసి 400-450 పరుగులు చేసి, బౌలర్లు అద్భుతం చేస్తేగానీ పాకిస్థాన్‌కు అవకాశాలు లేవు. మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో బంగ్లాదేశ్ తలపడనుంది. సెమీస్ ముంగిట మరో విజయంపై ఆసీస్ కన్నేయగా.. విజయంతో వరల్డ్‌కప్ నుంచి నిష్క్రమించాలని బంగ్లాదేశ్ భావిస్తోంది.



జాతీయ చెస్ చాంప్ సంహిత



హైదరాబాద్ : అండర్-9 బాలికల జాతీయ చెస్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణ చిన్నారి సంహిత పుంగవనం చాంపియన్‌గా నిలిచింది. ఇటీవల జార్ఖండ్‌లో ముగిసిన జాతీయ టోర్నమెంట్‌లో సంహిత ఓవరాల్‌గా 11 రౌండ్లలో పది పాయింట్లు సాధించింది. చివరి రౌండ్లో తమిళనాడు ప్లేయర్, టాప్ సీడ్ శ్రావణికపై మెరుపు విజయం సాధించింది. నల్ల పావులతో మొదలెట్టిన సంహిత 35 ఎత్తుల్లోనే శ్రావణికను చిత్తు చేసి విజేతగా అవతరించింది. అండర్-9 జాతీయ చాంప్‌గా నిలిచిన సంహితను తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్ ప్రసాద్ అభినందించారు.

మహిళల టీ20 విజేత ముంబయి

ఫైనల్లో ఉత్తరాఖాండ్‌పై గెలుపు



ముంబయి : దేశవాళీ సీనియర్ మహిళల టీ20 టోర్నమెంట్ విజేతగా ముంబయి నిలిచింది. శనివారం రాయ్‌పూర్‌లో జరిగిన ఫైనల్లో ఉత్తరాఖాండ్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొందిన ముంబయి తొలిసారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. సీనియర్ ఉమెన్స్ టీ20 ట్రోఫీని అత్యధికంగా రైల్వేస్ 11 సార్లు గెల్చుకుంది. టైటిల్ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తరాఖాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 84 పరుగులు చేసింది. ముంబయి బౌలర్లు పి నాయక్ (3/14), దాక్షిణి (2/8), ఫాతిమా జాఫర్ (2/13) ఉత్తరాఖాండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. స్వల్ప లక్ష్యాన్ని ముంబయి 15.2 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్, కెప్టెన్ జెమీమా రొడ్రిగస్ (30 నాటౌట్), హుమైరా (23), సయాలి (10 నాటౌట్) రాణించారు.

జిమ్నాస్టిక్స్‌లో అర్షద్‌కు మెడల్



హైదరాబాద్ : తెలంగాణ చిన్నోడు అర్షద్ మహ్మద్ జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటాడు. ఆల్ ఇండియా సీబీఎస్ఈ జాతీయ చాంపియన్‌షిప్స్‌లో హైదరాబాద్‌కు చెందిన అర్షద్ మహ్మద్ కాంస్య పతకం సాధించాడు. అండర్-11 బాయ్స్ టేబుల్ వాల్ట్ విభాగంలో అర్షద్ మూడో స్థానంలో నిలిచాడు. అనుభవ్ సింగ్ (ఉత్తరప్రదేశ్), దేవాన్ష్ (మహారాష్ట్ర)లు వరుసగా 10.60, 10.05తో పసిడి, రజతాలు నెగ్గగా.. అర్షద్ 9.90 స్కోరుతో బ్రాంజ్ మెడల్ అందుకున్నాడు. జాతీయ స్థాయిలో మెరిసిన అర్షద్‌ను అతడి కోచ్ హేమంత్ అభినందించారు.

నవచిత్రం

నా సినిమాలకు నా సినిమాలే పోటీ : బాలకృష్ణ



బాలకృష్ణ 'భగవంత్ కేసరి' చిత్రం బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని బాక్సాఫీస్ కా షేర్‌గా నిలిచింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా, శ్రీలీల కీలక పాత్ర పోషించిన ఈ సినిమా ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్ ద్వారా దసరా కానుకగా అక్టోబర్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి, అభిమానులు, ప్రేక్షకులు, విమర్శకులందరి ప్రశంసలు అందుకుని అఖండ విజయం సాధించింది.

'భగవంత్ కేసరి' వన్ ఇయర్ జర్నీ. ఈ ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు ఉన్నాయి. అద్భుత విజయంతో షీల్డ్స్ ప్రజెంట్ చేయడం ఆనందంగా ఉంది.

- దర్శకుడు అనిల్ రావిపూడి

ఈ సినిమాకి ఇంత ఘన విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు, బాలయ్య ఫ్యాన్స్‌కు ధన్యవాదాలు. ఈ విజయం మాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది.

- నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది

రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ బాక్సాఫీస్ కా షేర్ సెలబ్రేషన్‌ని ఘనంగా నిర్వహించింది. దర్శకేంద్రుడు కె రాఘవేంద్రరావు ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని చిత్ర బృందానికి షీల్డ్స్ అందించారు. అంబికా కృష్ణ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు.

బాలకృష్ణ మాట్లాడుతూ,'మూడు తరాల ప్రేక్షకులు మెచ్చుకుంటున్నారు, అభినందిస్తున్నారంటే అది నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. మంచి కథలను పరిచయం చేస్తే విజయం తప్పక వరిస్తుందనడానికి ఈ సినిమా ఓ నిదర్శనం. నా సినిమాలతో నా సినిమాలకే పోటీ. ఒక మంచి సందేశం చెప్పాలంటే సినిమానే గొప్ప మాధ్యమం. ఇది బాధ్యతగా భావించి వెంటనే ఈ కథని ఒప్పుకున్నాను. ఈ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ సినిమా త్వరలో హిందీలో రాబోతుంది. హిందీలో కూడా మొట్టమొదటి సారి డబ్బింగ్ చెప్పాను. హిందీపై తెలుగు వారికి ఉన్న భాషా పటిమ, సత్తా ఏమిటో ఈ చిత్రం తప్పకుండా నిరూపిస్తుంది. అందులో సందేహమే లేదు' అని తెలిపారు.

'భగవంత్ కేసరి' దీపావళి చిచ్చుబుడ్డిలా వెలుగుతూనే ఉంది. అన్నీ థియేటర్స్‌లో ఇంకా సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతూనే ఉంటుంది. ఆ వెలుగు నిర్మాతల కళ్లలో కనిపిస్తోంది. బాలయ్యకి కాలాలతో సంబంధం లేదు. ఏ కాలంలోనైన జై బాలయ్య నినాదం ఒకే మంత్రంలా వినిపిస్తుంది. బాలయ్య విజయపతాకం ఎప్పుడూ ఇలా ఎగురుతూనే ఉండాలి' అని కె.రాఘవేంద్రరావు అన్నారు.

కృష్ణకు ఘన నివాళి..

లెజెండరీ నటుడు, సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని అగ్ర కథానాయకుడు కమల్ హాసన్ శుక్రవారం ఉదయం విజయవాడలో ఘనంగా ఆవిష్కరించారు.

భారతీయ సినిమాలో చెరగని ముద్ర వేసిన దిగ్గజ నటుడికి ఇది గొప్ప నివాళి. కృష్ణ పట్ల తన అభిమానాన్ని ప్రతిబింబిస్తూ కమల్ హాసన్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఈ వేడుకకు మరింత గౌరవాన్ని తీసుకొచ్చింది. ఈ మహత్తర వేడుకని చూసేందుకు సూపర్ స్టార్ అభిమానులు, శ్రేయోభిలాషుల పెద్ద ఎత్తున పాల్గొని కృష్ణపై తమ ప్రేమ, అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఎంటర్‌టైన్‌మెంట్ వరల్డ్‌కు కృష్ణ చేసిన కృషికి ఈ విగ్రహం కలకాలం నిలువెత్తు నిదర్శనంగా, తరతరాల మధ్య వారధిగా నిలుస్తుందని కమల్ హాసన్ అన్నారు.



కృష్ణ విగ్రహావిష్కరణలో పాల్గొన్న కమల్‌హాసన్

ధనుష్‌తో ఇళయరాజా బయోపిక్



ధనుష్, ఇళయరాజా

హీరో ధనుష్ ముఖ్యపాత్రధారిగా మ్యాస్ట్రో ఇళయ రాజా బయోపిక్‌కి శ్రీకారం చుట్టారు. భారతీయ సినీ పరిశ్రమలో సంగీత జ్ఞానిగా తనదైన ముద్ర వేసిన ఇళయరాజాపై సినిమా రావడం అనేది సంగీతాభిమానులతో పాటు ఇళయరాజా అభిమానులను, సినీ ప్రేక్షకులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తింది.

ఈ చిత్రాన్ని కనెక్ట్ మీడియా, మెర్క్యూరీ గ్రూప్ సంస్థలు కలిసి రూపొందించనున్నాయి. ఈ నిర్మాణ సంస్థల కలయికలో తొలి చిత్రంగా రూపొందనున్న ఈ బయోపిక్ షూటింగ్ అక్టోబర్ 2024లో ప్రారంభమై 2025 మధ్యలో విడుదల కానుంది. రాబోయే మూడు సంవత్సరాలలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా అనేక మెగా-బడ్జెట్ చిత్రాలను కనెక్ట్ మీడియా, మెర్క్యూరీ గ్రూప్ కలిసి సంయుక్తంగా నిర్మించబోతున్నాయి. ఈ నేపథ్యంలో కనెక్ట్ మీడియా నుంచి వరుణ్ మాథుర్ మాట్లాడుతూ, 'మెర్క్యురి అనేది ప్రపంచ వినోద ప్రదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన పేర్లలో ఒకటి. మెగా-బడ్జెట్ చిత్రాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం పట్ల మేము సంతోషిస్తున్నాం. ఒక జాతీయ స్టూడియోగా మెర్క్యురీతో మా భాగస్వామ్యం గొప్పగా ఉంటుంది' అని తెలిపారు.

మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తిశరణ్ మాట్లాడుతూ, 'లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిస్తాం. కనెక్ట్ మీడియాతో చేస్తున్న ఈ వెంచర్ మీద మాకు ఎంతో నమ్మకం ఉంది' అని చెప్పారు.

బ్రష్ వేసుకో.. సందడి షురూ

నితిన్, శ్రీలీల హీరో, హీరోయిన్లుగా రూపొందుతున్న సినిమా 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్'. రైటర్ - డైరెక్టర్ వక్కంతం వంశీ తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'బ్రష్ వేసుకో..' అనే లిరికల్ పాటను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. దీనికి సిఎంఆర్ కాలేజ్ వేదికగా మారింది. పాటను వింటుంటే చాలా హమ్మింగ్‌గా ఉంటుంది. ఫుట్ ట్యాపింగ్ మ్యూజిక్‌తో హారిష్ జైరాజ్ అందించిన ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. సంజిత్ హెగ్డే పాడారు. కచ్చితంగా చార్ట్ బస్టర్‌లో ఈ పాట సెన్సేషన్ క్రియేట్ చేస్తుందనిపించేలా మ్యూజిక్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి 'డేంజర్ పిల్ల...' సాంగ్ ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ఆ పాటను అర్మాన్ మాలిక్ పాడారు. అలాగే రీసెంట్‌గా విడుదలైన టీజర్.. అందులో యూనిక్‌గా ఉన్న నితిన్ క్యారక్టరైజేషన్, మూవీ కాన్సెప్ట్ అందరినీ మెప్పించింది.

నితిన్ ఈ చిత్రంలో జూనియర్ ఆర్టిస్ట్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు.ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యమూవీస్ అండ్ ఎంటర్ టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి ఈ మూవీని నిర్మిస్తున్నారు.



నితిన్

అరుదైన అవకాశం



మోహన్ ముళ్ళపూడి

అభిరుచిగల నిర్మాతగా, ప్రముఖ పంపిణీదారుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలో తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న మోహన్ ముళ్ళపూడిని తాజాగా ఓ అరుదైన అవకాశం వరించింది. టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ద్వారా జారీ చేసిన ఉత్తర్వులకు, ప్రస్తుత టీటీడీ బోర్డు పదవీకాలానికి అనుగుణంగా శ్రీ వేంకటేశ్వర దేవాలయాలు, జూబ్లీహిల్స్, కరీంనగర్, హిమాయత్‌నగర్ లోకల్ అడ్వైజరి కమిటీ సభ్యునిగా మోహన్ ముళ్ళపూడి నియమితులవ్వడం విశేషం.

గతంలో పలు సినిమాలకు నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గానూ వ్యవహరించిన ఆయన ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌కు (ఎఫ్ఎన్‌సిసి) హానరబుల్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ప్రస్తుతం శ్రీ వెంకటేశ్వర దేవాలయాల లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా బాధ్యతలు చేపట్టారు. జూబ్లీహిల్స్, కరీంనగర్, హిమాయత్‌నగర్‌లోని టీటీడీ దేవాలయాల మొత్తం అభివృద్ధిలో, కరీంనగర్‌లో నిర్మిస్తున్న కొత్త ఆలయానికి సంబంధించిన పనులలో లోకల్ అడ్వైజరి కమిటీ మెంబర్‌గా మోహన్ ముళ్ళపూడి చేపట్టిన బాధ్యతలను నిర్వహిస్తారు.

సినిమాకి అందరూ కనెక్ట్ అవుతున్నారు

ఫీల్ గుడ్ లవ్ కాన్సెప్ట్‌తో దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరో, హీరోయిన్లుగా వచ్చిన చిత్రం 'అలా నిన్ను చేరి'. విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పించగా, కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించారు. మారేష్ శివన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి విశేష ఆదరణ పొందుతోంది.

ఈ సందర్భంగా నిర్మాత సాయి సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ, 'మా సినిమాకు ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. మరీ ముఖ్యంగా విలేజ్ నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా కూడా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు. ప్రేమ, లక్ష్యం మధ్య ఉండే సంఘర్షణ అనేది అందరి జీవితాల్లోనూ కామన్‌గా ఉంటుంది. సినిమా చూసిన చాలా మంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందని అన్నారు. ఈ సినిమా బాగా తీశారని మా నాన్న మెచ్చుకోవడం ఆనందంగా ఉంది. నాకు నటన మీద నాలెడ్జ్ అంతగా లేదు. కానీ నేను తెరపై బాగుంటాను అని అందరూ అంటుంటారు. అందుకే నన్ను నేను టెస్ట్ చేసుకునేందుకు ఓ చిన్న పాత్రను పోషించాను. నా పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. డైరెక్టర్ మారేష్ శివన్ మంచి కథను, డెప్త్ ఉన్న డైలాగ్స్‌ను రాసుకున్నారు. ఆయన రాసిన డైలాగ్స్‌కు థియేటర్లో మంచి రెస్పాన్స్ వస్తోంది. సుభాష్ ఆనంద్ సంగీతం, ఆండ్రూ కెమెరాపనితనం ప్రధాన బలంగా నిలిచాయి' అని తెలిపారు.



సాయి సుధాకర్

రంగంలోకి దిగిన సత్యభామ


అగ్ర కథానాయిక కాజల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'సత్యభామ'. పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఆమె కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. "మేజర్" చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ, స్క్రీన్ ప్లే అందించారు.

సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. దీపావళి పండుగ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను శుక్రవారం మేకర్స్ రిలీజ్ చేశారు.

"హత్యకు గురైన ఓ యువతిని రక్షించే క్రమంలో ఆమె ప్రాణాలు కాపాడలేక పోతుంది పోలీస్ ఆఫీసర్ సత్యభామ. ఆ యువతిని చంపిన హంతకుల వేట మొదలుపెడుతుంది. ఈ వేటను మన ఇతిహాసాల్లో నరకాసుర వధ కోసం యుద్ధరంగంలో అడుగుపెట్టిన సత్యభామ సాహసంతో పోల్చుతూ ప్లే అయ్యే బ్యాక్ గ్రౌండ్ సాంగ్ టీజర్‌లో ఆకట్టుకుంటోంది. ఆద్యంతం ఆసక్తికరంగా ఉండే ఈ సినిమా అందర్నీ మెప్పిస్తుందనే దీమాని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు.



కాజల్



భార్య అంటే కేవలం ఇంటిపని, వంటపని చేయడంతో పాటు భర్త కోర్కెలు తీర్చుతూ పిల్లల్ని కని పెంచే యంత్రం అనే ఆలోచన నేటికీ సమాజంలో ఇంకా కొనసాగుతూనే ఉంది. దీని వల్ల ఎంతో మంది మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. లోలోపలే కుమిలి పోతున్నారు. అలాంటి సమస్యతోనే షబానా ఐద్వా అదాలత్‌కు వచ్చింది. అసలు ఆమె ఎదుర్కొన్న సమస్య ఏంటో, ఆ సమస్యను ఎలా పరిష్కరించుకుందో తెలుసుకుందాం...

భార్యంటే యంత్రం కాదు

ఐద్వా అదాలత్ సెల్ : 9490098024

షబానాకు 23 ఏండ్లు ఉంటాయి. ఎన్నో ఆశలతో యాసిన్‌ను పెండ్లి చేసుకొని అత్తగారింట్లో అడుగు పెట్టింది. కానీ ఆమె ఆశలు మూడు నెలలకే అడి ఆశలయ్యాయి. పెండ్లయిన మూడు నెలలకే ఇంకా పిల్లలు కావడం లేదు అంటూ అత్తమామలు, భర్త, ఆడపడుచులు గొడవ మొదలుపెట్టారు. వాళ్ళ మాటలు విని తట్టుకోలేక పోయింది షబాన.

'ఇంట్లో పని చేయడం రాదు, బంధువులు వస్తే వారికి సేవలు చేయడం రాదు. వంట కూడా సరిగ్గా వండదు. ఉప్పుకారం కూరలలో ఉండదు. ఇలాంటి వంట జంతువులు కూడా తినవు, అలాంటిది రోజూ మేము తినాల్సి వస్తుంది. ఆ వంట కూడా గంటలు, గంటలు చేస్తావు. ఏ పనీ సరిగా చేయవు. నిన్ను తీసుకు వచ్చింది ఎందుకు. మా వంశం ముందుకు వెళ్ళాలంటే పిల్లలు పుట్టాలి. ఇప్పటి వరకు నువ్వు నెల తప్పలేదు. మేము బతికున్నప్పుడే పిల్లలు పుడతారు అనే నమ్మకం మాకు పోతుంది. మేము మా అబ్బాయి కు రెండో పెండ్లి చేస్తాము. నీ వల్ల పిల్లలు కలగన ప్పుడు రెండో పెండ్లి చేసుకోవడంలో తప్పేముంది' అంటూ షబానాను హింసించడం మొదలుపెట్టారు.

'అనవసరంగా పెండ్లి చేసుకున్నాను. ఈ పెండ్లి అనే బంధం లేకపోతే వీరందరితో ఇన్ని మాటలు పడాల్సి వచ్చేది కాదు' అంటూ లోలోపలే కుమిలి పోయేది. చివరకు ఆ బాధ భరించలేక విడాకులు ఇస్తాను అనే స్థాయికి వచ్చేసింది. షబానా తల్లి దండ్రులు ఆమె అత్తమామలతో మాట్లాడే ప్రయత్నం చేశారు. కానీ వాళ్ళెవరూ మాట్లాడటానికి ఇష్టపడలేదు. దాంతో మత పెద్దల దగ్గరకు వెళ్ళి పిర్యాదు చేశారు.

అక్కడ కూడా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. పైగా 'మొదటి భార్యకు పిల్లలు కలగక పోతే భర్త రెండో పెండ్లి చేసుకోవచ్చు. అతనికి ఆ అవకాశం ఉంది. భార్యగానీ, ఆమె కుటుంబం గానీ అడ్డుకునే హక్కు లేదు' అంటూ తీర్పు ఇచ్చారు.

'ఇది అన్యాయం, ఇలా జరగడానికి వీలు లేదు అని షబాన వాళ్ళ అక్క చెల్లెళ్ళి తీసుకుని ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది. మేము వెంటనే యాసిన్‌ను పిలిపించాము. 'మాకు పెండ్లి అయి మూడు నెలలు అవుతుంది. ఆమెకు పిల్లలు పుట్టడం లేదు. ఇంట్లో కూడా ఏ పని సరిగ్గా చేయడం చేతకాదు. నేను రెండో పెండ్లి చేసుకోవచ్చు. మా మతంలో నాకు అలాంటి అవకాశం ఉంది. ఈ విషయం మా మత పెద్దలే షబానా కుటుంబ సభ్యులకు చెప్పారు. అందుకే నేను రెండో పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను' అని చెప్పాడు.

తర్వాత ఇద్దరినీ కూర్చోబెట్టి 'మీ పెండ్లి జరిగి మూడు నెలలు మాత్రమే అవుతుంది. మూడేండ్లు అయినట్టు పిల్లల కోసం కంగారు పడుతున్నారు. విడాకుల విషయంలో అప్పుడే తొందరపడటం సరైనది కాదు. మీకు పిల్లలు కావాలని అంత తొందర ఉంటే ముందు మంచి డాక్టర్ దగ్గర చూపించుకోండి. ఇద్దరూ డాక్టర్ సలహా తీసుకొని అవసరమైతే పరీక్షలు చేయించు కోండి. దాన్ని బట్టి అవసరమైతే మందులు వాడొచ్చు. అంతే గానీ తొందర పడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు. ఇకపోతే ఇంట్లో పని అంటే షబాన పెండ్లి తర్వాతనే వంట పని, ఇంట్లో పనులు చేయడం మొదలుపెట్టింది. మెల్లిమెల్లిగా అన్నీ నేర్చుకుంటుంది. ఇలాంటి చిన్న చిన్న విషయాలకే విడాకులు తీసుకో వడం కరెక్ట్ కాదు. మీ మతంలోనైనా మొదటి భార్య ఒప్పుకుంటేనే రెండో పెండ్లి చేసుకునే అవకాశం ఉంటుంది. లేదా ఆమెకు విడాకులు ఇచ్చిన తర్వాతనే రెండో పెండ్లి చేసుకోవాలి. అంతేకానీ మా ఇష్టం వచ్చినట్టు చేస్తామంటే కుదరదు. అలా కాదని నువ్వు రెండో పెండ్లి చేసుకుంటే షబానాకు నీపై కేసు పెట్టే హక్కు ఉంటుంది. ఆమెకు అండగా మేముంటాము. కాబట్టి ముందు ఇద్దరూ మంచిగా ఉండండి. అవసరమైతే డాక్టర్ దగ్గర చూపించుకోండి' అని చెప్పారు.

షబానాకు మేము అండగా ఉన్నామని తెలిసి ఏమీ చేయలేక యాసిన్, అతని కుటుంబ సభ్యులు కూడా అంగీకరించారు. ఆరు నెలల తర్వాత మళ్ళీ వచ్చారు. ప్రస్తుతం ఇద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవని, చాలా సంతోషంగా ఉన్నామని చెప్పారు. మరి ఎందుకు వచ్చారని అడిగితే షబానా నెలతప్పిందనే శుభవార్త చెప్పడానికి వచ్చామని చెప్పారు.


'మేడం మీరు చెప్పిన తర్వాత మేము డాక్టర్ దగ్గరకు వెళ్ళాము. వాళ్ళు అన్ని పరీక్షలు చేసి మాకు కొన్ని మందులు ఇచ్చారు. ఇద్దరం వాళ్ళిచ్చిన మందులు వాడాము. డాక్టర్ చెప్పిన సూచనలన్నీ పాటించాము. ఇప్పుడు నా భార్యకు మూడో నెల. మేము మీ దగ్గరకు రావడం వల్ల నాకు మంచే జరిగింది. మా మతపెద్దలు నన్ను రెండో పెండ్లి చేసుకోమని చెప్పారు. వాళ్ళ మాట వింటే షబానాకు అన్యాయం చేసినవాడినయ్యే వాడిని. మీ వల్ల షబానా ఎంత మంచిదో నాకు తెలిసొచ్చింది. ఇకపై మేము ప్రతి నెలా మీ దగ్గరకు వస్తాము. నా నుండి ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచేసుకుంటాను' అంటూ యాసిన్ సంతోషంగా తన భార్యను తీసుకొని వెళ్ళాడు.



మేము డాక్టర్ దగ్గరకు వెళ్ళాము. వాళ్ళు అన్ని పరీక్షలు చేసి మాకు కొన్ని మందులు ఇచ్చారు. ఇద్దరం వాళ్ళిచ్చిన మందులు వాడాము. డాక్టర్ చెప్పిన సూచనలన్నీ పాటించాము. ఇప్పుడు నా భార్యకు మూడో నెల. మేము మీ దగ్గరకు రావడం వల్ల నాకు మంచే జరిగింది. మా మతపెద్దలు నన్ను రెండో పెండ్లి చేసుకోమని చెప్పారు. వాళ్ళ మాట వింటే షబానాకు అన్యాయం చేసినవాడినయ్యే వాడిని. మీ వల్ల షబానా ఎంత మంచిదో నాకు తెలిసొచ్చింది.

- వై. వరలక్ష్మి
9948794051

చర్మ సంరక్షణకు...



చలి కాలం ప్రారంభమైంది. వాతావరణానికి తగ్గట్లు చర్మం పొడిబారిపోతూ ఉంటుంది. అందుకే ఈ కాలంలో ఆరోగ్య సంరక్షణతో పాటు చర్మ సంరక్షణ కూడా చాలా ముఖ్యమైనది. చర్మం ఆరోగ్యంగా లేకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అందువల్ల చర్మాన్ని సంరక్షించుకోవడానికి కొన్ని జాగ్రత్తలు విధిగా పాటించాలి.

నీళ్లు తాగండి : చర్మానికి ఔషధంలా పనిచేసేది స్వచ్ఛమైన నీరు. అందుకే మీరు డీహైడ్రేట్ కాకుండా చూసుకోవడం అత్యంత ముఖ్యమైన విధిగా గుర్తుంచుకోండి. డీహైడ్రేషన్ బారిన పడితే రాను రాను మీ చర్మం మందంగా మారి, త్వరగా ముడతలు పడిపోతుంది. ఒంట్లో తేమ శాతం తగ్గకుండా చేయడం చర్మానికి చాలా అవసరం. నున్నని, సున్నితమైన చర్మం కోసం నీళ్లు బాగా తాగాలి. ఇలా చేస్తే మొటిమల సమస్య కూడా తగ్గుతుంది.

స్కిన్ టైప్ : చర్మ సంరక్షణలో మొదటి మెట్టు మీ చర్మం ఏ రకమైనదో తెలుసుకోవడంతోనే మొదలవుతుంది. చర్మం ఏ రకం అనే దాన్ని బట్టే ఉత్పత్తులు వాడాలి. డ్రై స్కిన్, ఆయిలీ స్కిన్, కాంబినేషన్ స్కిన్ అనే విషయం తేలితే దాన్ని బట్టి మీరు తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఉదాహరణకు మీది బాగా పొడిబారిన చర్మం అనుకోండి హైడ్రేషన్ పై పూర్తి ఫోకస్ పెట్టడం అత్యంత ముఖ్యమైన విషయం. లేదంటే మీకు వృద్ధాప్య లక్షణాలు అతి చిన్న వయసులోనే వచ్చేస్తాయి.

స్క్రబ్ : చర్మం పైపొర పొలుసులుగా ఊడిపోతూనే ఉంటుంది. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. చర్మం పై పొర పొడిపొడిగా రాలడం, చర్మంపై అక్కడక్కడా తెల్లగా కనిపించడం వంటివన్నీ దీంతోనే వస్తాయి. దీనికి విరుగుడు మంచి స్క్రబ్‌ను ఉపయోగించడమే. రక్త ప్రసరణ మెరుగు పరిచి, చర్మానికి నిగారింపు తెచ్చే స్క్రబ్బింగ్‌ను రెగ్యులర్ గా చేయండి. ఇందుకు పార్లర్‌కు వెళ్లాల్సిన పని లేదు. మీరు ఇంట్లోనే చేసుకోవచ్చు.

ఆహారంలో యాంటీ ఆక్సిడెంట్స్ : మీరేం తింటారన్న ఆహారంలోనే మీ చర్మం ఆరోగ్యం, అందం దాగి ఉంది. నీరు ఎక్కువ శాతం ఉన్న కర్బూజ, పుచ్చకాయ, దోసకాయ వంటివి తింటే మీ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అంతేకాదు వేపుళ్లు, పచ్చళ్ల వంటివి ఎక్కువగా తినకుండా ఉడికించిన ఆహారం, ఆవిరి మీద ఉడికించిన ఆహారాన్ని ఎక్కువగా తింటే చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్న బెర్రీలు, ద్రాక్ష, నట్స్ వంటివి మీ చర్మ కణాలు డ్యామేజ్ కాకుండా సహజసిద్ధంగా మెరుపును సంతరించుకునేలా చేస్తాయి.

ఎన్ని ప్రయోజనాలో...



ఆలివ్ ఆయిల్లో మన శరీరానికి పనికొచ్చే ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ నూనె గుండె జబ్బులు రాకుండా చేస్తుంది. అలాగే అధిక బరువు అదుపులో ఉంచి శరీరంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. అంతేకాదు మన చర్మాన్ని కాపాడుతుంది. అదెలాగో తెలుసుకుందాం.

- స్నానం చేసే అరగంట ముందు శరీరానికి ఆలివ్ ఆయిల్ రాసుకోవాలి. తర్వాత స్నానం చేస్తే చర్మం పగలకుండా మృదువుగా ఉంటుంది. చర్మం పాలిపోకుండా చేసే గుణం ఈ నూనెలో ఉంది.
- ఆలివ్ నూనెలో కొద్దిగా పంచదార కలిపి చర్మానికి మసాజ్ చేస్తే చర్మం మృదుత్వాన్ని పొందుతుంది.
- ఆలివ్ ఆయిల్ చర్మానికే కాదు వెంట్రుకలకూ మంచిదే. జుట్టు ఎండిపోయినట్టు అనిపిస్తే, గుడ్డు సొనలో కొద్దిగా ఆలివ్ నూనె కలిపి తలకు రాసుకోవాలి. అరగంట తర్వాత తలస్నానం చెయ్యాలి. తరచూ ఇలా చేస్తే వెంట్రుకలు పట్టులా మారుతాయి. మృదుత్వాన్ని పొందుతాయి.
- రోజూ వాడే షాంపూ లేదా కండీషనర్‌లో ఆలివ్ నూనెను కలిపి వాడినా ఫలితం ఉంటుంది. వెంట్రుకల సమస్యలన్నీ పోతాయి. చుండ్రు సమస్య పరిష్కరించబడుతుంది.
- నిమ్మరసం, ఆలివ్‌నూనె కలిపి జుట్టుకు పట్టించి కాసేపయ్యాక తలస్నానం చేయాలి. ఇలా అప్పుడప్పుడూ చేస్తే చుండ్రు పోవడమే కాదు వెంట్రుకలు నిగారింపును పొందుతాయి.

ఆకలి కేకలు ఒప్పుకున్న మోడీ

(మొదటిపేజీ తరువాయి)

ఉధృతంగా సాగుతోంది.

హామీల అమలులో వైఫల్యం

మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరస్కరించిన పథకాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒకటి. ఈ పథకం ద్వారా యూపీఏ ప్రభుత్వం ఆర్థికాభివృద్ధిని సాధించలేకపోయిందని, ఉపాధి కల్పించలేకపోయిందని, ప్రజల ఆదాయాలను పెంచలేకపోయిందని ఆయన విమర్శించారు. కానీ ఇప్పుడో? బడ్జెట్‌లో నిధుల కోతతో ఈ పథకాన్నే నిర్వీర్యం చేసే పనిలో మోడీ ఉన్నారు. గడచిన పది సంవత్సరాల్లో మోడీ అధిక జీడీపీ వృద్ధి రేటుకు గ్యారంటీ ఇవ్వలేదు. గత తొమ్మిదేళ్లుగా ఈ రేటు 5.7%గానే ఉంటోంది. 2014లో హామీ ఇచ్చిన విధంగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నెరవేర్చడంలో మోడీ దారుణంగా విఫలమయ్యారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలోనూ వైఫల్యమే. గత పదేళ్లలో వ్యవసాయ ఉత్పత్తులకు అయ్యే వ్యయాన్ని కనీస మద్దతు ధరల పెంపుతో పోలిస్తే ఈ విషయం బోధపడుతుంది. ఈ హామీలను నెరవేర్చలేని మోడీ ఇప్పుడు మరో ఐదేళ్ల వరకూ ఉచిత ఆహార ధాన్యాలు అందిస్తానని గ్యారంటీ ఇస్తున్నారు.

కార్మిక సర్వే చెప్పిన చేదు నిజాలు

ఆర్థిక రంగంలో మోడీ ప్రభుత్వ పనితీరు ఎంత దారుణంగా ఉన్నదో గణాంకాల శాఖ గత నెలలో విడుదల చేసిన కార్మిక సర్వే బయటపెట్టింది. 2022-23 జూలై నెలల మధ్య కాలానికి సంబంధించి ఈ సర్వే ఏం చెప్పిందంటే దేశంలో ఉద్యోగాలు, ఉపాధి పొందిన 500 మిలియన్ల మందిలో 58శాతం మంది స్వయం ఉపాధి పొందిన వారే. స్వయం ఉపాధి పొందిన వారిలో ఎక్కువ మంది చిన్న చిన్న వ్యాపారులు, స్వయంగా సేవలు అందించే వారు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య అధికంగా ఉంది. 2017-18లో ఉద్యోగాలు, ఉపాధి పొందిన వారిలో వీరి సంఖ్య కేవలం 52శాతం. అంటే ఇటీవల స్వయం ఉపాధి పొందిన వారి సంఖ్య పెరిగిందన్న మాట. ఉత్పాదకేతర రంగంలో తక్కువ నాణ్యత కలిగిన ఉద్యోగాల్లో పెరుగుద లను ఇది సూచిస్తోంది. ఎందుకంటే స్వయం ఉపాధి పొందిన వారిలో మూడో వంతు మంది వేతనాలు లేకుండా పని చేస్తున్నారు. చిన్న కుటుంబాలు నడిపే వ్యాపారాల్లో వీరు ఎలాంటి వేతనం తీసుకోకుండా పని చేస్తుంటారు. స్వయం ఉపాధి పొందిన వారు, వారిలో వేతనాలు తీసుకోకుండా పని చేస్తున్న వారి మధ్య దామాషా గడచిన ఐదేళ్లలో బాగా పెరిగింది. ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ ప్రభావం తర్వాత ఈ పరిస్థితి కన్పించింది.

తగ్గిన వేతనాలు

స్వయం ఉపాధి పొందిన వారిలో వేతనాలు లేకుండా పని చేస్తున్న వారు 2017-18లో నాలుగు కోట్ల మంది ఉంటే ఆ సంఖ్య గత సంవత్సరం నాటికి తొమ్మిదిన్నర కోట్లకు పెరిగిందని ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా తెలిపారు. వీరిని ఉద్యోగులుగా గుర్తించలేమని ఆయన చెప్పారు. 2017-18తో పోలిస్తే 2022-23లో నెలవారీ సగటు వేతనాలు 20శాతం తగ్గాయని కార్మిక సర్వే తెలిపింది. స్వయం ఉపాధి పొందిన వారు, క్యాజువల్ కార్మికులదీ ఇదే పరిస్థితి. ఐదేళ్లలో సగటు వేతనాలు పెరగకపోవడం ఉపాధి నాణ్యత దారుణ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఓ వైపు జీవన వ్యయం పెరుగుతుంటే మరోవైపు తమ వేతనాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని స్వయం ఉపాధి పొందిన వారు వాపోతున్నారు. వేతనాలు స్థిరంగా ఉండడం ప్రజల కొనుగోలు శక్తిపై ప్రభావం చూపుతోంది. గ్రామీణ ప్రజల్లో వినియోగ వస్తువులకు డిమాండ్ పెరగడం లేదు. ఫలితంగా హిందుస్థాన్ లీవర్, బజాజ్ ఆటో వంటి వినియోగ వస్తువులు ఉత్పత్తి చేసే కంపెనీల అమ్మకాలు పడిపోయాయి. దిగువ మధ్యతరగతి ప్రజల్లో వినియోగం బాగా తగ్గిపోయింది.

టిటీడీ ఎల్ఏసీ సభ్యునిగా అజయ్

నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్

తెలంగాణలో తిరుమల తిరుపతి దేవస్థానం లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా దేవులపల్లి అజయ్‌ని నియమిస్తూ కార్యనిర్వహణ అధికారి ఉత్తర్వులు జారీ చేసారు. జూబ్లీహిల్స్, హిమాయత్ నగర్, నిర్మాణంలో ఉన్న కరీంనగర్ టీటీడీ అభివృద్ధి కార్యక్రమాల్లో సేవా భావంతో పని చేయాలని లేఖలో పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ముఖ్య సలహా దారు సజ్జల రామకష్ణ రెడ్డి, టీటీడీ ఛైర్మెన్ కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మా రెడ్డి జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్‌లకు అజయ్ కతజ్ఞతలు తెలిపారు.

రంగన్న వెంటే

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనిస్టులు పోరాడుతున్నారన్నారు. బీజేపీతో లోపాయికారీ ఒప్పందం ఉండడం వల్లనే కేసీఆర్ వామపక్షాలతో స్నేహాన్ని వదులుకున్నాడని విమర్శించారు. బీజేపీని నివారించాలనే లక్ష్యంతో కాంగ్రెస్‌తో పొత్తుకు సమ్మతించినా.. వారికి లక్ష్యం పట్ల చిత్తశుద్ధి లేనందున పొత్తు కుదరలేదన్నారు. పార్టీ సత్తా ఏమిటో ఈ ఎన్నికల్లో చూపిస్తామని సవాల్ విసిరారు. ప్రజల కోసం పనిచేసే జూలకంటి రంగారెడ్డిని గెలిపించాలని కోరారు.

పేదల పక్షాన పోరాడే నాయకుడు రంగన్న : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

పేదల పక్షాన నిరంతరం రాజీలేని పోరాటాలు చేసే నాయకుడు జూలకంటి రంగారెడ్డి అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పదవి ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల కోసం పనిచేసే జూలకంటి రంగారెడ్డిని గెలిపిస్తే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు.

బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత వాగ్దానాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. అమలుకు నోచుకోని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు.

మోసగాళ్ల మాటలను నమ్మొద్దు : జూలకంటి

ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు ఇచ్చే మోసగాళ్ల మాటలను నమ్మొద్దని సీపీఐ(ఎం) అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ప్రజలకు మాయమాటలు చెబుతూ ఓటు వేయించుకోవాలని చూస్తున్నారని, అలాంటి వారి మాటలను నమ్మితే భవిష్యత్తులో మోసపోతారని చెప్పారు.

వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, డబ్బు సంచులతో వచ్చి ఓట్లను కొని అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. మిర్యాలగూడలో ధన బలం, పోరాడే బలం మధ్య ఎన్నికల జరుగుతున్నాయని, ప్రజలు ఓటు వేసేటప్పుడు ఆలోచించుకొని ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఐదేండ్లు పాలించే ప్రజానాయకుడు ఎలా ఉండాలో మీరే తెలుసుకోవాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరి వాడిలా అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని చెప్పారు తనకు ఓటు వేసి గెలిపిస్తే మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. దీనికి తోడు మహిళా డిగ్రీ కళాశాల మంజూరుకు పాటుపడతానన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మిర్యాలగూడ గౌరవాన్ని పెంచుతానన్నారు.

కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ నాయక్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌వీ రమ, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రవి నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, భవాండ్ల పాండు, పాదూరి శశిధర్ రెడ్డి, రాగిరెడ్డి మంగా రెడ్డి, పరుశురాములు, వరలక్ష్మి, వినోద్ నాయక్, సీతారాములు, గోవర్ధన, రొండి శ్రీనివాస్, బాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఇంజినీర్‌పై దాడి చేసిన వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారు?

(మొదటిపేజీ తరువాయి)

సరఫరాను నిలిపివేశారని ఆరోపిస్తూ మలింగ, ఆయన అనుచరులు హర్షాధిపతిని కులం పేరుతో దూషిస్తూ... రాడ్‌లు, కర్రలతో కొట్టారు. ఇంజినీర్‌కు తగిలిన గాయాలను వివరిస్తూ దళిత సంఘాలు ఇప్పుడు మోడీ, బీజేపీకి బహిరంగ లేఖ రాశాయి. దాడి ఫలితంగా బాధితుడి 22 ఎముకలు విరిగిపోయాయనీ, ఏడాదిన్నర నుంచి (ఇప్పటికీ) అతను ఆస్పత్రిలోనే ఉన్నాడని వివరించాయి.

'దళితులపై బీజేపీకి ఉన్న ప్రేమ ఇదేనా?'

ఇటు బీజేపీపై కాంగ్రెస్ సైతం ఆరోపణల దాడి పెంచింది. మలింగకు రాష్ట్రంలో గూండాయిజంతో సంబంధం ఉన్నదని ఆరోపించింది. ఈ ఎన్నికల్లో ఆయనకు టికెట్ కేటాయించవద్దని తెలిపింది. "నడ్డా జీ, మోడీ జీ, దళిత-వాల్మీకులపై బీజేపీకి ఉన్న ప్రేమ ఇదేనా? మలింగాను పార్టీలోకి బీజేపీ స్వాగతించిన తీరుపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాం. రాజస్థాన్‌లోని మీ పార్టీకి చెందిన బాధ్యతాయుతమైన నాయకులు ఈ అంశంపై మాట్లాడిన తీరు, గిర్‌రాజ్ సింగ్ మలింగను విమర్శించిన తీరు నిందితులకు శిక్ష పడుతుందనే ఆశను కలిగించింది. కానీ, దళిత అఘాయిత్యాలకు పాల్పడిన వ్యక్తిని చూసి మేము షాక్ అయ్యాము. ఎంతో ఆర్భాటంగా, ఆనందంతో బీజేపీలోకి తీసుకున్నారు. ఆ సందర్భంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మిఠాయిలు పంచి, మలింగకు లడ్డూలు తినిపించి స్వాగతం పలికారు" అని దళిత సంఘాలు ఆవేదనను వ్యక్తం చేశాయి. రచయిత, దళిత హక్కుల కార్యకర్త భన్వర్ మేఘవంశీ మాట్లాడుతూ.. బీజేపీ దళిత హింసను ఎన్నికల అంశంగా మారుస్తుందన్నారు. "కాంగ్రెస్ మా డిమాండ్‌ను విని, మలింగకు అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది. అది ఎన్నికలలో వారిని దెబ్బతీసినప్పటికీ.. మేము వారి సూత్రప్రాయ వైఖరిని స్వాగతించాము. కానీ ఈ సంఘటనల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా" అని మేఘవంశీ అన్నారు.

నిప్పుతో ఆటలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన కలిగిస్తున్నాయనీ, ఆర్టికల్ 200 కింద గవర్నర్‌కు 12 బిల్లులు పంపిస్తే ఒక్కదానిపైనా నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌ల సహాయాన్ని కూడా కోర్టు కోరింది.

గవర్నర్ల ప్రవర్తన రాజ్యాంగ విరుద్ధం: అభిషేక్ మను సింఘ్వీ

పంజాబ్, తమిళనాడు ప్రభుత్వాల తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ.. బిల్లులపై చర్య తీసుకోవడానికి గవర్నర్లు నిరాకరించే ధోరణి ఇప్పుడు దేశంలోని అనేక రాష్ట్రాల్లో కనిపిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ల సమస్య పంజాబ్ నుంచి తమిళనాడుకు, కాశ్మీర్ నుంచి కన్యాకుమారికి విస్తరిస్తోన్న వ్యాధి అని, దీనిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపారు. గవర్నర్ల ప్రవర్తన రాజ్యాంగ విరుద్ధమనీ, వారి చర్యలు ప్రభుత్వ పాలనపై ప్రభావం చూపుతాయని తెలిపారు. "దాదాపు రెండు మూడు సంవత్సరాల క్రితం తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ సంతకం చేయటం లేదు. రిమిషన్ ఆర్డర్‌లకు సంబంధించిన బిల్లుపైనా సంతకం చేయడం లేదు. ప్రాసిక్యూషన్ లేదా రిమిషన్ కోసం శాంక్షన్ ఇవ్వాలని మిమ్మల్ని వేడుకుంటున్నాం అనే లేఖ ఇక్కడ ఉంది. జైలులో ప్రజలు ఉన్నారు. ఏదో ఒకటి చేయాలి" అని సింఘ్వీ అన్నారు. సింఘ్వీతో పాటు తమిళనాడు తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, పి. విల్సన్ కూడా హాజరయ్యారు.అనంతరం అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ తీసుకున్న చర్యల వివరాలను తమకు అందజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోర్టు ఆదేశించింది. కేసును దీపావళి తరువాత సోమవారం (నవంబర్ 20) విచారిస్తామని చెబుతూ వాయిదా వేసింది.

డీఎంకే నేతృత్వంలోని ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య, పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వానికి గవర్నర్ పురోహిత్‌కి మధ్య ఇటీవలి కాలంలో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను పాస్ చేయడంలో గవర్నర్లు ఉద్దేశ్యపూర్వకంగా అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కాగా పలు రాష్ట్రాల్లో గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు నవంబర్ 6న ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. గవర్నర్లకు ఆత్మపరిశీలన అవసరమని వ్యాఖ్యానించింది. రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల అంశం తమ వద్దకు చేరక ముందే గవర్నర్లు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పది కీలక బిల్లులకు ఆమోదం తెలిపేలా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆదేశించాలని కోరుతూ తెలంగాణ కూడా గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేరళకు చెందిన ఇలాంటి పిటిషన్లు కూడా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. కేరళ దాఖలు చేసిన పిటిషన్లను కూడా ఈ నెల 20న విచారించనుంది.

కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులు కుంగిపోతున్నాయి

నవతెలంగాణ-కోదాడరూరల్

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో కట్టిన ప్రాజెక్టులన్నీ కుంగిపోతున్నాయని కర్నాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ మునిగిపోయే నావ లాంటిదని, డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని దీమా వ్యక్తం చేశారు. కోదాడలో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 25 వేల మెజార్టీతో గెలుస్తారన్నారు. ప్రజలు కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇల్లు లేని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 100 గజాల స్థలంతోపాటు ఇల్లు కట్టుకోవడానికి ఉచితంగా రూ.5 లక్షలు ఇస్తుందని చెప్పారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీ పథకాలు కర్నాటకలో నాలుగు నెలల నుంచి అమలు అవుతున్నాయన్నారు. ఇక్కడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ కర్నాటకకు వచ్చి తాము అమలు చేస్తున్న హామీలను చూడొచ్చన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వేరుపడినా రెండు రాష్ట్రాల డీఎన్ఏ ఒకటే అన్నారు. రెండు చోట్లా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముజూర్‌నగర్, కోదాడ ప్రజలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి - పద్మావతి రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, ఉత్తమ్ పద్మావతిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేరళ సుసంపన్నమైన భవిష్యత్తుకై 22 ప్రాధాన్యతా రంగాల గుర్తింపు

ముఖ్యమంత్రి విజయన్ వెల్లడి

కోచి : కేరళ రాష్ట్రానికి సుస్థిరమైన, సుసంపన్నమైన భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం 22 ప్రాధాన్యతా రంగాలను గుర్తించిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం తెలిపారు. కేరళకు గల అభివృద్ధి అవకాశాలపై చర్చించేందుకు కేరళ పారిశ్రామిక సహకార సంస్థతో కలిసి ఫిక్కి ఏర్పాటు చేసిన రెండు రోజుల సమావేశం రెండవ రోజు ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగించారు.



పెట్టుబడులను ఆకర్షించి, ఆర్థికాభివృద్ధిని పెంపొందించేం దుకు సానుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాల్సిన ప్రాముఖ్యతను గుర్తిస్తూ, అనేక చొరవలను తాము తీసుకున్నామని అవే ఈనాడు కేరళను వ్యాపారాల ఆవిష్కరణకు, అభివృద్ధికి కేంద్రంగా నిలబెట్టాయని విజయన్ చెప్పారు.

'ఇందుకు సంబంధించి మన కీలకమైన లక్ష్యాల్లో ఒకటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ కె-స్విఫ్ట్ (సింగిల్ విండో క్లియరెన్స్ మెకానిజం)ను ప్రవేశపెట్టడం. ఈ వినూత్నమైన వేదిక వివిధ విభాగాలను, సంస్థలను సమన్వయం చేసి, వివిధ ప్రక్రియలను వేగవంతం చేస్తుంది, ఇన్వెస్టర్లకు అనవసరమైన పాలనా యంత్రాంగ అడ్డంకులను తొలగిస్తుంది. ప్రస్తుతం, కేరళ రాష్ట్రం మరింత సులభంగా వ్యాపారం చేసుకోవడాన్ని పెంపొందించడం కోసం జాతీయ ఏక గవాక్ష వ్యవస్థతో కె-స్విఫ్ట్‌ను సమ్మిళితం చేసే దిశగా మేం పనిచేస్తున్నాం" అని విజయన్ పేర్కొన్నారు.

సులభంగా వ్యాపారం చేసుకోవడానికి, పారదర్శకత, జవాబుదారీతనానికి హామీ కల్పించడానికి కె-స్విఫ్ట్‌కు సంబంధించి గణనీయమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. కేరళ కేంద్ర తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా మాన్యువల్‌గా జరిగే వాటిని మార్చామని, దీనివల్ల జరగాల్సిన క్రమం మరింత క్రమబద్ధీకరణ అవడమే గాకుండా పారదర్శకత పెరుగుతుందని, అవినీతికి తావు లేకుండా వుంటుందని విజయన్ చెప్పారు.





నామినేషన్ల సందర్భంగా ఆయా జిల్లాల్లో సీపీఐ(ఎం) శ్రేణుల ర్యాలీలు

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు ఏకం కావాలి

ఇబ్రహీంపట్నంలో సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్యను గెలిపించండి : పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య

అసెంబ్లీలో ప్రజల గొంతు వినిపించాలి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు ఏకం కావాలని, పేద ప్రజల గొంతును శాసన సభలో వినిపించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాల్లో చైతన్యమైన పోరు గడ్డపై ఎర్రజెండాను ఎగరవేయాలని, సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్యను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా కార్యకర్తలు, ప్రజలు ఎర్రజెండాలతో కవాత్, పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు.

నామినేషన్ అనంతరం జరిగిన సభలో నాగయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పట్టించుకోని రాజకీయ పార్టీలకు ఓటు అడిగే హక్కులేదని, నిత్యం ప్రజల కోసం పోరాటం చేస్తున్న కమ్యూనిస్టు నాయకులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. పాషా, నరహరి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని.. వారి ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతున్న కేంద్రంలోని బీజేపీ.. రాష్ట్రంలో అధికారంలోకి రావాలని చూస్తోందని, ఎట్టి పరిస్థితిల్లోనూ



అడగుపెట్టనివ్వొద్దని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఈ పదేండ్లలో ప్రజలకు అర చేతిలో వైకుంఠం చూపిందన్నారు. అప్రజాస్వామిక ప్రభుత్వ పాలనకు స్వస్తి చెప్పేందుకు ఎర్రసైనం ఎన్నికల రణరంగంలో నిర్విరామ పోరాటం చేసి కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, నాయకులు భూపాల్, ధర్మనాయక్, వెంకట్రాములు, జంగారెడ్డి, ఉడుత రవి, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, సామేల్, జగదీశ్, చంద్రమోహన్, రాజు, శోభన్, కవిత పాల్గొన్నారు.

మునుగోడు గడ్డ కమ్యూనిస్టుల అడ్డా

సీపీఐ(ఎం) అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డిని గెలిపించండి

కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ-చండూరు

మునుగోడు గడ్డ అంటేనే కమ్యూనిస్టుల అడ్డా అని.. మళ్లీ చరిత్రను పునరావృతం చేసే విధంగా ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తా సీపీఐ(ఎం) అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. శుక్రవారం చండూరు తహసీల్దార్ కార్యాలయంలో మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి రెండోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెరుపల్లి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టులకు



కంచుకోటగా పేరుగాంచిన మునుగోడులో తమ బలం నిరూపించుకునే సమయం ఆసన్నమైందన్నారు. యాద్రాద్రి భువనగిరి జిల్లా జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మళ్లీ ఎర్రజెండా రాజ్యం కోసం.. సీపీఐ(ఎం) ప్రకటించిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





హుజూర్‌నగర్ అభివృద్ధి

సీపీఐ(ఎం)తోనే సాధ్యం

కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

మల్లు లక్ష్మి నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ

నవతెలంగాణ- హుజూర్‌నగర్‌టౌన్

హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి సీపీఐ(ఎం)తోనే సాధ్యమని, నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేది కమ్యూనిస్టులేనని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, సీపీఐ(ఎం) హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో మల్లు లక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతంలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలుగా అరిబండి లక్ష్మీనారాయణ, జూలకంటి రంగారెడ్డి తదితరులు పనిచేసి అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించినట్లయితే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానని మల్లు లక్ష్మి తెలిపారు. అనంతరం నిర్వహించిన భారీ ర్యాలీతో హుజూర్‌నగర్ పట్టణం ఎరుపెక్కింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ఇందిరా సెంటర్ మీదుగా గాంధీ పార్క్ వరకు ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా నేతలు ఇందిర, జ్యోతి, ప్రభావతి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) నల్లగొండ అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి నామినేషన్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

సీపీఐ(ఎం) నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో రెండుసెట్లు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, సయ్యద్‌హాషం తదితరులున్నారు.

ప్రజల్లో ఉండే సీపీఐ(ఎం) అభ్యర్థి దశరథ్‌ను గెలిపించండి

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు

కార్మికలోకంతో కలిసి నామినేషన్ వేసిన సీపీఐ(ఎం) ముషీరాబాద్ అభ్యర్థి

నవతెలంగాణ - ముషీరాబాద్

నిత్యం ప్రజలతో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు దశరథ్‌ను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు కోరారు. భారీ స్థాయిలో కార్మికులతో కలిసి సీపీఐ(ఎం) ముషీరాబాద్ అభ్యర్థి దశరథ్ శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. కవాడిగూడ చౌరస్తా వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి డిజి, హైదరాబాద్ సిటీ సెంట్రల్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ హాజరయ్యారు. డిజి నర్సింహారావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) నాయకులను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న యువ నాయకుడు దశరథ్‌ను అసెంబ్లీకి పంపించాలన్నారు. ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ సీపీఐ(ఎం) గుర్తు చేశారు. హుస్సేన్‌సాగర్ నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి ముందుండి



పోరాడామన్నారు. ధర్నా చౌక్ తిరిగి ప్రారంభించడానికి ముఖ్య కారణం సీపీఐ(ఎం) అని చెప్పారు. ప్రజా సమస్యలు తెలిసిన నాయకున్ని చట్ట సభకు పంపిస్తే శాశ్వతంగా సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

చట్ట సభల్లో ప్రజల గొంతుక వినిపిస్తాం..

నకిరేకల్ సీపీఐ(ఎం) అభ్యర్థి బొజ్జ చిన్నవెంకులు నామినేషన్ సందర్భంగా నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నవతెలంగాణ-నకిరేకల్

కమ్యూనిస్టులను చట్టసభలకు పంపించాలని, అక్కడ ప్రజల గొంతుకను వినిపించి సమస్యల పరిష్కారానికి పోరాడుతామని సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుల రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు. శుక్రవారం



నకిరేకల్ పట్టణంలో సీపీఐ(ఎం) నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ చిన్నవెంకులు నామినేషన్ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో ప్రజాసమస్యలపై ప్రభుత్వాలను నిలదీసింది మార్క్సిస్టు నాయకులు నర్రా రాఘవరెడ్డి అని గుర్తు చేశారు. ఆయన వారసత్వాన్ని ఈ గడ్డా ప్రజలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నిలబడే నిలదీసే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాలని కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. అందుకు దేవుడి మీద కానీ, మహానుబావుల మీద కానీ ఆధారపడొద్దు. నీకూ ఓ విలువైన ఆయుధం ఉంది. అదే ఓటు..



ఓటుతో నీ జీవితాన్నే మార్చుకోవచ్చు!!

ఎన్నికల వేళ.. పూల ధరలకు రెక్కలు

భారీగా పెరిగిన గులాబీ రేట్లు

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నేపథ్యంలో పూలకు డిమాండ్ పెరిగింది. కిలోకు 60 రూపాయల వరకు పలికిన ఓపెన్ గులాబీ పూలు ఎన్నికల తరుణంలో ప్రస్తుతం రూ.100 దాటింది. అలాగే మరికొన్ని పూలు కిలోకు రూ.150 రూ.200కు చేరాయి. ఎన్నికల ప్రచారాల కోసం ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు పూలను అధికంగా వాడటమే ఇందుకు కారణం.



వ్యాపా రులు ప్రస్తుతం రోజంతా మార్కెట్లోనే ఉంటున్నారు. ఎన్నికల వేళ వ్యాపారం బాగా జరుగుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గులాబీతోపాటు బంతి, చామంతి, ఇతర పూలకు మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్‌లోని ఎంజే మార్కెట్, గుడిమల్కాపూర్, కుషాయిగూడ, మెహిదిపట్నం, మోండా, ఎర్రగడ్డ మార్కెట్లో పూలు జోరుగా విక్రయిస్తున్నారు.

• వీరపట్నంలో వీరవనిత...



నేను సైతం...

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య నామినేషన్ ర్యాలీలో 90 ఏండ్ల అవ్వ...

ప్రశ్నించే గొంతులకు పట్టం కట్టండి

సీపీఐ(ఎం) కోదాడ అభ్యర్థి మట్టిపల్లి సైదులు నామినేషన్

నవతెలంగాణ - కోదాడరూరల్

అవకాశవాద పార్టీలకు కాకుండా ప్రశ్నించే గొంతు అయిన సీపీఐ(ఎం)కు ఓటు వేసి గెలిపించాలని సీపీఐ(ఎం) కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రి శ్రీరాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు ఓటర్లను కోరారు. సీపీఐ(ఎం) కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మట్టిపల్లి సైదులు నామినేషన్ సందర్భంగా శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. మట్టిపల్లి



సైదులు రిక్షా తొక్కి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అనంతరం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచ్ తంత్రం!



ఊరూర పార్టీలు సారాయి దించేయి
సారాయి అననాటు సారగాదు
వెన్క రోజులుగావు మెక్డొనాల్డొకటిచ్చి
భుజముపై చెయ్యేసి బుజ్జగించ
బ్లాక్‌డాగ్ ఉంటుంది బ్లెడర్స్‌ప్రైడుంటుంది
టీచర్స్ ఉంటుంది స్కాచు ఉంది
కొత్త బ్రాండొచ్చెనా కచ్చితంబుగ దెత్రు
కొసురుటకిది గొప్ప ఖర్చు కాదు

కల్లు తాగిన వాడపో కంసుడంటె
బీరు దాగిన వాడెపో భీముడంటె
నమ్ము వాడెవ్వడుండడీ నేల మీద
ఏమి దాగని వాడేపో ఎదవకొడుకు

- ఏనుగు నరసింహారెడ్డి

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి సబితాఇంద్రారెడ్డి నామినేషన్

నవతెలంగాణ- విలేకరులు

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. కామారెడ్డిలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, మహేశ్వరంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి, సీపీఐ(ఎం) అభ్యర్థులు తదితరులు నామినేషన్లు వేశారు.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డితో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందచేశారు. బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు మహేశ్వరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మరోసారి తనను గెలిపించాలని సబిత కోరారు. హైదరాబాద్‌లోని గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిషోర్ వ్యాస్ (బిలాల్) అబిడ్స్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ సనత్‌నగర్ అభ్యర్థి డాక్టర్ కోటా నీలిమ, బీజేపీ అభ్యర్థులు కూడా పలుచోట్ల నామినేషన్లు వేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆయా నియోజకవర్గాల నుంచి మొత్తం 136 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు



అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థి అర్జున్ రావు పిట్టల తన రెండో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మెచ్చా నాగేశ్వరరావు నాలుగో సెట్ దాఖలు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గం నుంచి కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వనమా వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు.

కంటతడి పెట్టిన తుల ఉమ

చివరి నిమిషంలో బీజేపీ వేములవాడ అభ్యర్థి మార్పు

నవతెలంగాణ - వేములవాడ

బీజేపీలో వేములవాడ నియోజకవర్గం టికెట్ విషయంలో తుల ఉమకు అధిష్టానం హ్యాండిచ్చింది. నామినేషన్‌కు చివరి నిమిషంలో ఆమెకు కాకుండా బీఫామ్ మరొకరికి ఇచ్చింది. ఆ పార్టీ నాలుగో జాబితాలో తుల ఉమకు వేములవాడ నియోజకవర్గం టికెట్ కేటాయించడటంతో.. బీజేపీ రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు, వేములవాడ మండల అధ్యక్షులు వికాస్ మూడు రోజులు రాష్ట్ర కార్యాలయంలో నిరసనకు దిగారు. దాంతో అధిష్టానం వికాస్‌కు బీఫామ్ ఇచ్చింది. అయితే, తుల ఉమ శుక్రవారం నామినేషన్ వేశారు. బీఫామ్ మాత్రం వికాస్‌కు



మీడియా ముందు ఉమ కంటతడి

ఇవ్వడంతో ఆమె ఆవేదనకు గురయ్యారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తుల ఉమ మీడియా ముందు భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ బీసీ నినాదాన్ని తుంగలో తొక్కి.. డబ్బులు సంచులతో వచ్చే దొరలకు టికెట్ కేటాయించిందని విమర్శించారు. తాను కచ్చితంగా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.